# ఇంద్రాణీ సప్తశతీ

కావ్యకంఠ శ్రీ వాసిష్ఠ గణపతిముని విరచితము.

※

పరిష్కరణకర్త :

గుంటూరు లక్ష్మీకాంతము

యలమంచిలి, విశాఖజిల్లా.

※

వెల : రు. 5/-



# ఇంద్రాణీ సప్తశతీ

కావ్యకంఠ శ్రీ వాసిష్ఠ గణపతిముని విరచితము.

✳

పరిష్కరణకర్త :

గుంటూరు లక్ష్మీకాంతము

యలమంచిలి, విశాఖజిల్లా.

✳

వెల : రు. 5/-

*Published by*

**G. L. KANTAM,**

YELLAMANCHILI, (Visakha District)

*With the kind permission of the copy-right holder*

**SRI D. S. VISHWAMITRA,** B. A., LLB.

SIRSI, (North Kanara Dt.)

ప్రతులు వలయువా రీదిగువ అడ్రసుకు వ్రాయవలెను :–

1. గుంటూరు లక్ష్మీకాంతము, యలమంచిలి (విశాఖజిల్లా) లేదా

2. **J. G. K. MURTY,**
*22, Burkit Road, T. Nagar, Madras–17.*

# మనవి మాట

'ఇంద్రాణీ సప్తశతీ' యను నీ గ్రంథము మహత్తరమైన స్తోత్ర కావ్యము. దీనిని రచించిన కావ్యకంఠ శ్రీవాసిష్ఠ గణపతిముని యాంధ్రుడు. బొబ్బిలికి సమీపమందున్న కలువరాయియను గ్రామము నివాసముగా గల్గిన తల్లిదండ్రు లీయన జన్మించుటకు పూర్వము పొందిన కొన్ని దివ్య దర్శనములచే నీయన తమ యిష్టదైవమగు గణపతియొక్క యంశసంభూతుడని విశ్వసించి యీయనకు గణపతి యను పేరిడిరి. వారి విశ్వాసమునకు తగినట్లీయనయం దసాధారణ ధీవిక్రమము, వాక్సిద్ధి, యాశుకవితాప్రజ్ఞ మొదలగు దివ్యవిలాసములు బాల్యమందే ప్రస్ఫుటమగుట జూచి తమ విశ్వాసమును ధ్రువపరచుకొనిరి. కాని, బాలగణపతి వారి నమ్మకమును కాదనకున్నను తన కా దైవాంశానుభవ మాంతర్యమున గల్గకుండుట గుర్తించుకొని, తత్ప్రాప్తికొఱ కీశ్వరానుగ్రహమును సాధించుటకు పదునాఱవయేటనుండి తపస్సును బూనెను.

అత్యంత భక్తిశ్రద్ధలతోడను, శాస్త్రములనుండియు పెద్దలవల్లను గ్రహించిన విధివిధానములతోడను నాచరింపబడిన యీ తపస్సునం దచిరకాలములోనే భువనేశ్వరీ యనుగ్రహమున దివ్యవాగ్రసప్రవాహమును, ఈశ్వరానుగ్రహమున నిర్విషయధ్యాన యోగమును బడసినను దృప్తిజెందక తన తపస్సునకు ఫలముగా నిజతపస్స్వరూపానుభవమునే కాంక్షించుచు సుమారు పండ్రెండు సంవత్సరములు పాటుపడెను. కాని లక్ష్యము సిద్ధించలేదు. అప్పుడు వేదశాస్త్రభాష్యములందును, పురాణేతిహాసములందును పేర్కొనబడిన తపఃపదనిర్వచనములనే శంకించుకొని, దాని యదార్థమును తర్కించుకొనుచుండగా నొక ప్రేరణము బొంది యరుణాచలక్షేత్రమున 1907 సం॥లో కృత్తికోత్సవముల సమయమునకు ధ్యానదీక్ష బూనెను. ఈశ్వరకృప

స్రవించుట కప్పటికి నిర్ణయమయ్యెను కాబోలు! అది కావ్యకంఠుని పైనేకాక ఆ క్షేత్రమున పండ్రెండు సంవత్సరములనుండి నిరంతర తపోమగ్నుడైయున్న నొక బ్రాహ్మణస్వామిపై కూడ స్రవించెను. ఆ కృప చొప్పున బ్రాహ్మణస్వామి నాశ్రయించి శంక దీర్చుకొనుటకు కావ్యకంఠు డొకవంక ప్రేరేపితుడై, యింకొకవంక చిరకాల మంతర్దృష్టి యందున్న కారణమున వాగ్రస ప్రవాహములేక శుష్కించిన కంఠనాళములచే బద్ధకంఠుడైన బ్రాహ్మణస్వామి ముక్తకంఠుడై తన కనుభవసిద్ధమైన నూత్నమార్గముచే తపస్స్వరూపము నుపదేశించుటకు ప్రేరేపితుడయ్యెను.

ఉపనిషత్తుల్యమైన యీ నవ్యోపదేశముచే కావ్యకంఠుడు కృతార్థుడై, తనకు ప్రాప్తించిన సిద్ధగురుని పూర్వాశ్రమ నామమును సంస్కరించి యతనికి భగవాన్ రమణమహర్షి యను పేరుంచి యంగీకరింప వేడెను. 'సరే నాయనా' యని పల్కి గురువంగీకరించుట బట్టి 'నాయన' యను క్లుప్తనామము గణపతిమునికి ప్రసిద్ధమయ్యెను. అటుపిదప నీ యుపదేశ సందర్భములను సమకూర్చిన యుపనిషద్దేవతయగు 'ఉమ' నుద్దేశించి, 'ఉమా సహస్ర' మను స్తోత్రకావ్యమును పంచదశాక్షరీ మంత్రబద్ధముగా రచించి, దానియందీ నవ్యోపదేశముచే కర్మ-భక్తి-యోగ-జ్ఞాన మార్గములు సంస్కరింపబడిన తీరును జూపెను. ఆ స్తోత్రఫలముగా తన దివ్యదృష్టిచే శ్రీ రమణునియందు గాంచబడిన కార్తికేయాంశను ప్రస్ఫుటము గావించి, దానిచే లోకమందిప్పుడు వక్రమైయున్న బుద్ధిని సంస్కరింప వేడెను. ఈ ఫలము వెంటనే సిద్ధించి, ఆఱు నక్షత్రరూపములుగా నొకా నొక దివ్య తేజస్సాకాసమునుండి వ్యక్తమై శ్రీరమణుని బొందుట కావ్యకంఠునితో పాటక్కడివారు పెక్కుమంది తిలకించి ధన్యులయిరి.

అటుపిమ్మట గణపతిమునియందు రేణుక యను నామాంత రముగల ఇంద్రాణి ప్రత్యేక కృప జూపజొచ్చెను. వైదిక దేవతయైన యీ యామె కృపవలన వేదహృదయ భేదజ్ఞానము, శ్రీరమణుని యుప దేశమునకు కవచమగు నొక వేదమంత్ర దర్శనము, తపఃపరిపాకమందు క్రమముగా కపాలభేదనమను సిద్ధిచే నమృత ప్రాప్తిని గణపతిముని పొంది, ఋగ్వేదఋషివలె ప్రకాశింప జొచ్చెను. అట్టి యపూర్వ కటాక్ష మును బరపిన ఇంద్రాణి నుద్దేశించి 1922సం॥లో కపాలభేదనమైన పిదప రచింపబడిన స్తోత్రకావ్యమే యీ 'ఇంద్రాణీ సప్తశతీ'. దీనికి ఫల ముగా మనదేశమందప్పుడు పాలించుచున్న పరదేశ ప్రభుత్వమునుండి విముక్తిని, దేశస్థులందు వేదమతదృష్టి నిచ్చి వారియందు వీర్యతేజోభి వృద్ధిని యర్థించెను. ఉమా సహస్ర పారాయణమువలన తపఃప్రబోధ మగుటకు సంకల్పించినట్లే కవి దీని పారాయణమువలన నంతర్బాహ్య శత్రువర్గ నాశనమును సంకల్పించెను.

ఉమాసహస్రములో వలెనే దీనియందును 25 శ్లోకముల నొక్కొక్క స్తబకముగా కూర్చి, యొక్కొక్క స్తబకము నొక్కొక్క ఛందస్సుతో రచించెను. మఱియు, నొక్కొక్క శతకమున కొక్కొక్క వైదికఛందోనామమిడి, కవి వైదికదేవతను సార్థకము చేసెను. అది గ్రీష్మఋతువైనను ప్రతి దినము రచనాంతమందా దేవత మెఱుపుల నాకసమందు గల్పించి తన సంతోషమును జూపెను.

అట్టి యీ పవిత్ర గ్రంథమును ప్రచురించు భాగ్యము నాకు చేకూరినందుల కింద్రాణీదేవతకు, నామెకు పుత్రులైన శ్రీ రమణ గణపతులకు నేనెంతయు కృతజ్ఞుడను.

నాచే ప్రచురితమైన శ్రీ గణపతిముని గ్రంథములందిది పదియవ పుష్పము. దీనికి పూర్వము ప్రచురితమైన స్తోత్రచతుష్కముతో బాటు దీనిని గూడ నీ సంవత్సరము వచ్చిన శ్రీ గణపతిముని నిర్వాణదినమున కర్పించుకొనునట్లు శ్రీ జయంతి ప్రెస్సు, కాకినాడ వారచ్చొత్తి యిచ్చినందులకు వారికి నేనెంతయు కృతజ్ఞుడను.


యలమంచిలి,
తే 7—8—62 దీకి
సరియగు శ్రావణశుద్ధ సప్తమి.
(శ్రీ గణపతిముని నిర్వాణదినము)

ఇట్లు,
గుంటూరు లక్ష్మీకాంతము.



# విషయసూచిక


| | శతకము. | స్తబకము. | | పుటసంఖ్య. |
|---|---|---|---|---|
| 1. | గాయత్రం | శశివదనా | ... | 2 |
| | | తనుమధ్యా | ... | 10 |
| | | ముకుళా | ... | 16 |
| | | వసుమతీ | ... | 24 |
| 2. | ఔష్ణిహం | కుమారలలితా | ... | 34 |
| | | మదలేఖా | ... | 42 |
| | | హంసమాలా | ... | 48 |
| | | మధుమతీ | ... | 56 |
| 3. | అనుష్టుభం | పథ్యావక్త్ర | ... | 66 |
| | | మాణవక | ... | 76 |
| | | చిత్రపదా | ... | 84 |
| | | నారాచికా | ... | 90 |
| 4. | బార్హతం | హలముఖీ | ... | 102 |
| | | భుజగశిశుభృతా | ... | 110 |
| | | మణిమధ్యా | ... | 116 |
| | | మాత్రాసమక | ... | 124 |
| 5. | పాంక్తం | మయూరసారిణీ | ... | 136 |
| | | మనోరమా | ... | 144 |
| | | మణిరాగ | ... | 154 |
| | | మేఘవితాన | ... | 164 |
| 6. | త్రైష్టుభం | ఉపజాతి | ... | 176 |
| | | రథోద్ధతా | ... | 192 |
| | | మౌక్తికమాలా | ... | 200 |
| | | సుముఖీ | ... | 210 |
| 7. | జాగతం | ద్రుతవిలంబిత | ... | 222 |
| | | జలోద్ధతగతి | ... | 230 |
| | | ప్రమితాక్షర | ... | 242 |
| | | సులలితతామరస | ... | 252 |



శ్రీ రమణ గణపతులు

ఓం

ప్రథమం

# గాయత్త్రం శతకమ్

# 1. శశివదనాస్తబకము

1. హారిలలనే మే పథి తిమిరాణి ।
హార దరహాస ద్యుతిభి రిమాని ॥

2. అగతి మవీర్యా మపగత ధైర్యాం ।
అవతు శచీమే జనిభువ మార్యాం ॥

3. శ్రుణు కరుణావ త్యలఘుమఖర్వే ।
స్తవ మహామార్య స్తవ శచి కుర్వే ॥

4. త్రిజగ దతీతో విలసతి నిత్యః ।
అణు రణుతో, హా భగవతి సత్యః ॥

5. త్వ మఖిల కార్యే ష్వయి ధృత శక్తిః ।
ఉరుగతి రస్య ప్రభుతమ శక్తిః ॥

6. విదురిమ మేకే జగతి మహేంద్రం ।
జగురయి కేచి జ్జనని మహేశం ॥

7. అవగత వేదో వదతి మహేంద్రం ।
పరిచిత తంత్రో భణతి మహేశం ॥

8. జనని శచీ త్వం ప్రథమ దళస్య ।
భగవతి దుర్గా స్వపర దళస్య ॥

1. ఓ ఇంద్రాణీ! నా మార్గమందున్న యీ చీకట్లను నీ మంద హాస కాంతులచే తొలగింపుము.

2. గతి చెడి, వీర్యము గోల్పోయి, అధైర్యముజెందిన నా పవిత్ర జన్మభూమిని శచీదేవి రక్షించుగాక.

3. ఓ శచీ! ఆర్యుడనగు నేను శ్రేష్ఠమైన నీ స్తవము జేయు చుంటిని. వినుము.

4. ఓ భగవతీ! సత్యస్వరూపుడైన యెవడణువుకంటె నణువగు చుండెనో, త్రిజగదతీతుడగు నాతడు నిత్యము ప్రకాశించు చుండెను.

5. ఓ దేవీ! సర్వకార్యములందు ధరించబడు శక్తి గలిగి, త్వరిత గతి గలదానవై నీవీ ప్రభునకు మిగుల సమర్థమైన శక్తివి.

6. ఓ తల్లీ! జగత్తునందు కొందఱీ పురుషుని మహేంద్రుడని తెలియుచున్నారు, మఱికొందఱు మహేశ్వరుడని గానము చేయుచున్నారు.

7. వేదవిదులు మహేంద్రుడందురు, తంత్రశాస్త్ర పరిచితులు మహేశ్వరుడందురు.

8. ఓ తల్లీ! నీవు మొదట చెప్పబడినవారికి శచీదేవి వగుచుంటివి, రెండవవారికి దుర్గవగుచుంటివి.

9. న శచి శివాత స్త్వ మితర ద్దైవం ।
బహు ముని వాణీ సమరస త్తైవం ॥

10. దివిచ సితాద్రా శచి వపుషోర్వ్యాం ।
పృథ గుపలంభా దయి భిదయోక్తిః ॥

11. తనుయుగ మాలం వపురతి మాయం ।
కరచరణాద్యై ర్వియుత మమేయం ॥

12. త్వముదరవర్తి త్రిభువన జీవా ।
భవసి శచీ సా జనని శివా వా ॥

13. విభు శుచికీలా తతిరయి ధూమం ।
త్వ మమర మార్గం బత వమసీమం ॥

9. ఓ శచీదేవీ! నీ వందువలన శివవే కాని యితరదైవమవు కావు. ఇట్లనుట బహుమునుల వాణి ననుసరించి యుండును.

10. ఓ శచీ! స్వర్గ, కైలాసములందు మీరు (శచీ, దుర్గలు) వేర్వేరు శరీరములను ధరించుటవలన మీకు భేద మూహింప బడుచున్నది.

(స్వర్గమనగా నాకము = న + అకము = దుఃఖము లేనిది యైనను కైలాసము మోక్షస్థానముగా నెంచబడుచున్నది. సుషుప్తికి సమాధికి గల సంబంధమువంటిదని పౌరాణిక భావము. కాని యివి యొకే లోకమునకు వైదిక తాంత్రిక పరిభాషలందున్న పేర్ల భేదము. తేజస్సునుబట్టి యొకరు, శబ్దమునుబట్టి యొకరు కల్పించిరి.)

11. మాయకతీతమైనది, కరచరణాది విహీనమైనది, యమేయ మైనది యైన శరీరము పై రెండుశరీరములకు మూలమైయుండెను. (ఈ రెండు శరీరములు ఆకాశ సంబంధములు, వీనికి మూల మైనది సచ్చిదానంద స్వరూపము. సృష్టికొఱకాకాశ శరీరము ధరింపబడుట శ్రుతిప్రసిద్ధము. దీనినే సగుణ బ్రహ్మలక్షణ మందురు.)

12. ఓ తల్లీ! ఉదరమందిమిడించుకొనిన త్రిభువనములకు నీవు జీవమునై శచివైతివి. ఆ నీవే దుర్గగా కూడ నుంటివి.

13. దేవీ! శుద్ధాగ్నియైన విభునియొక్క కిరణ సమూహమవై నీవు దేవయానమను ధూమమును గ్రక్కితివి. ఆశ్చర్యము.

(విభుడు మూలమందు సచ్చిదానందస్వరూపుడైనను సృష్టికొఱకు వ్యాపకత్వధర్మ మును జెంది విభుడనబడెను. విభుడనగా వ్యాపకుడు. వ్యాపకత్వధర్మ మతని మహిమ.

14. జయసి నభస్తో జనని పరస్తాత్ ।
నభసిచ భాంతీ భవసి పురస్తాత్ ॥

15. త్వ మతనురంబ జ్వలసి పరస్తాత్ ।
ఇహా ఖ శరీరా లససి పురస్తాత్ ॥

ఆ మహిమ మతనియందుద్గారలీనములను జెందుచు సృష్టిప్రళయములకు కారణమగుచుండును. ఉద్గార మనెడి వికాసమును బొందినప్పు డచలమైన స్వరూపవస్తువు మహిమావంతమై తన యుపరిభాగములందు వ్యాపకత్వలక్షణముచే సూక్ష్మధూమసదృశమైన రజస్సగుచు, మహిమ యొక్క విజృంభణమువలన అగ్నినుండి క్రక్కబడు సూక్ష్మధూమమువలె విభునిస్వరూపము నుండి యది క్రక్కబడుచున్నది. ఈవిధముగా ఆనందస్వరూపవస్తువు తనకుతానే తనమహిమచే విషయలక్షణముగా వ్యాపించి ఆకాశనామమును బొందెనుగావున ఆకాశమానందము కాకపోదను నర్థముగల శ్రుతివాక్య (యదేష ఆకాశ ఆనందో నస్యాత్) వ్యాఖ్యానమగును. ఈ యాకాశము సూక్ష్మమైనను దానిని వ్యాపింపజేయు మహిమ దానికంటెను సూక్ష్మమై దానికంతరమున నున్నట్లు మఱువరాదు. అంతరమున కేవలమైయున్న మహిమకు శుద్ధత్వదశ చెప్పబడును; ఆకాశముతోగూడి వ్యాపించునప్పుడు విషయత్వదశ చెప్ప బడును; ఈ రెండుదశలకు నడుమ నెక్కడ ఆకాశమును బొందుచు విడుచుచు నున్నటు లుండునో ఆ సంధి సంధానప్రాంతమందు మహిమ జ్వలించు చున్నందున దానికక్కడ తేజస్త్వదశ చెప్పబడును. ఈ విధముగా శుద్ధత్వ తేజస్త్వ విషయత్వదశలచే జ్వాలారూప మున వ్యాపించిన మహిమ కాశ్రయుడైన విభుడు శుద్ధాగ్నితోడను. విషయలక్షణముగా వ్యాపించిన సూక్ష్మ రజోభూతాకాశము ధూమముతోడను పోల్చబడెను. రెండింటికి నడుమ నున్న తేజస్త్వసంధిభాగము విషయమును వేఱుచేయుచు ఆనందస్వరూపముతో సంధానమొనర్చు చున్నందున దుఃఖములేని ప్రాంతముగా నెంచబడి నాక మనబడెను. (నాకము = న + అకము = దుఃఖములేనిది). ఇది కాంతులకు మార్గమైనందున ముక్తికి మార్గమగు దేవయాన మనియు పిలువబడుచున్నది (దివ్ = కాంతి). ఇది రజోమయాకాశమనెడి ధూమమున కంతరముననుండి దాని సంబంధముచే దేవయానధూమ మనబడెను. అట్లే ఆకాశపరముగా పరమాకాశమనియు పిలువబడుచున్నది. దీని నధిష్ఠించినది సచ్చిదానందస్వరూపమైనను. అధిష్ఠాన లక్షణమువలన కవులా స్వరూపమును శక్తిపురుషులుగా విభజించి పల్కిరి. ఆ శక్తి పురుషులే ఇంద్రాణీ యింద్రులని గ్రహించవలెను.)

14. ఓ తల్లీ ! నీవాకాశమునకావల (అనగా పరమాకాశము లేదా కేవల మహిమగా) ప్రకాశించుచు, నాకాశమందును దాని కీవలను (అనగా గోళాకృతులుగా రూపొందిన విశ్వమందును) గూడ నుంటివి.

15. ఓ తల్లీ ! ఆవల నీవశరీరవై జ్వలించుచు, ఆకాశమందును దాని కీవలనున్న గోళ ప్రపంచమందును గూడ ఆకాశ శరీరిణివై ప్రకాశించు చుంటివి.

16. జనని పరస్తా న్మతిరసి భర్తుః ।
అసి ఖ శరీరా పృథగవగంత్రీ ॥

17. సువిమల రూపం భగవతి శాంతం ।
న భవతి శూన్యం తదిద మనంతం ॥

18. దివి దధతీంద్రే పురుషశరీరం ।
జనని పురంధ్రీ తనురభవ స్త్వం ॥

19. దృశి విలసంతం ప్రభు ముపయాంతీ ।
భవసి విరాట్ త్వం నృతనుషు భాంతీ ॥

20. తవ గుణగానం జనని విధాతుం ।
భవతి పటుః కో వియదివ మాతుం ॥

21. భగవతి తృప్తి ర్భవతు నవా తే ।
అభిలషితాప్తి ర్భవతు నవా మే ॥

22. భజతి తవాంఘ్రిం మమఖలు భాషా ।
పతి మనురాగా త్ప్రియమివ యోషా ॥

23. అఘ మపహర్తుం శుభమపి కర్తుం ।
అల మజరే తే గుణగణ గానం ॥

24. అవసి జగత్త్వం కులిశి భుజస్థా ।
అవ మునిభూమిం గణపతి ధీస్థా ॥

16. ఓ తల్లీ ! నీ వాంవల భర్తకు మతివై యుంటివి. ఆకాశ శరీరిణివై నీవు ప్రత్యేక చలన శక్తిగానుంటివి.

17. ఓ తల్లీ! నీ నిర్మల స్వరూపము శాంతమైనను, శూన్యము మాత్రము కాదు. ఇచ్చటి (ఆకాశ) రూప మనంతమైయున్నది.

18. ఓ తల్లీ! నీ వాకాశములో నింద్రునియందు పురుష శరీరమును ధరించి, నీవు స్త్రీ శరీరిణివైతివి.

19. ఓ తల్లీ ! దృక్కులలో విలసించు ప్రభువుతో గలసి నీవు మానవులందు ప్రకాశించుచు 'విరాట్' వైతివి.

20. ఓ తల్లీ ! ఆకాశమును కొలత జేయుట శక్యము గానట్లే నీ గుణగానము చేయుట యెవరికిని శక్యము కాదు.

21. ఓ భగవతీ ! నీకు దృప్తియగుగాక, కాకపోవుగాక, నాకోర్కె సిద్ధించుగాక, మానుగాక ;

22. ప్రియ భర్తననురాగముతో భార్య విడువనట్లు, నా భాష నీ పాదమును విడువక భజించును గదా.
(పాదమనగా అంశయగు నాకాశ రూపమునకును అన్వయించును. ఆకాశము శబ్ద గుణము కలది గావున భాషచే భజింప బడునట్టిదగును.)

23. దేవీ ! నీ గుణ గణగానము పాపములను నశింప జేయుటకును శుభముల నిచ్చుటకును సమర్థమైనది.

24. ఓ తల్లీ ! ఇంద్రుని భుజములందుండి (భుజశక్తిగా) నీవు జగత్తులను రక్షించు చుంటివి. గణపతి బుద్ధియందట్లే నీ వుండి భారత భూమిని రక్షింపుమా.

25. శశివదనాభి ర్గణపతిజాభిః ।
శశివదనాద్యా పరిచరితాఽస్తు ॥

---

## 2. తనుమధ్యాస్తబకము

1. ధ్వాంతం పరిహర్తుం తేజాంస్యపి భర్తుం ।
అంతర్మమ భూయా త్స్మరేంద్ర పురంధ్రీ ॥

2. భీతా మరిభూతా మార్యావని మేతాం ।
సమ్రాజ్ఞి బుధానాం దూనా మవ దీనాం ॥

3. ఇంద్రస్యసహాయాం విశ్వస్య విధానే ।
ఆకాశ శరీరా మంబాం ప్రణమామః ॥

4. కర్తుర్భువనానాం మాయాసి శచి త్వం ।
సత్యస్య తపోఽసి జ్ఞస్యాసి మనీషా ॥

5. ఆజ్ఞాఽసి వినేతు స్తేజోఽసి విభాతః ।
నిర్యత్న సమాధే రానంద రసోఽసి ॥

6. తస్య త్వమనన్యాఽ ప్యన్యేవ ఖకాయా ।
అత్యద్భుతమాయా జాయాఽసి సహాయా ॥

7. ఆకాశ శరీరాం జాయామశరీరః ।
ఆలింగ్య విభుస్త్వాం సందృశ్యయి చిత్రం ॥

25. గణపతి కవివలన బుట్టిన యీ 'శశివదనా' వృత్తములచే నాది శక్తియైన యింద్రాణి సేవింపబడుగాక.

---

1. చీకటిని పరిహరించుటకు, తేజస్సును నింపుటకు ప్రకాశించు ఇంద్రాణి నా హృదయమందుండుగాక.

2. ఓ పండిత పరిపాలినీ! భీతిజెంది, శత్రువుల యధీనమై, కంపించు దీనురాలైన ఈ యార్యావర్తమును రక్షింపుము.

3. విశ్వసృష్టియం దింద్రునకు సహాయురాలవై, యాకాశ శరీర ముగల అంబవైన నీకు మేము నమస్కరింతుము.

4. ఓ శచీ! నీవు భువనకర్తకు మాయవైతివి, సద్వస్తువునకు తపస్సువైతివి, పండితులకు బుద్ధివైతివి.

5. ఈశ్వరునకు నీవతని యాజ్ఞవైతివి, అగ్నికి తేజస్సువైతివి, నిర్వికల్ప సమాధియందుండు యోగికానందరసమైతివి.

6. అనన్యురాలవైనను, అన్యురాలవలె నాకాశ శరీరముతో నత్యద్భుత మాయారూపిణివై, నీ వతనికి సహాయమొనర్చు భార్యవైతివి.

7. దేవీ! అశరీరుడైన ప్రభువు ఆకాశ శరీరముచే భార్యవగు నిన్నాలింగనము చేసికొని యానందించుచున్నాడు. ఇదియే చిత్రము. (నందతి ధాతువునుండి వచ్చిన 'ఆనంద' పదమునకు

8. వజ్రేశ్వరి ఘస్రే శీర్షేంబ బిభర్షి ।
దీప్తం సవితారం మాణిక్య కిరీటం ॥

9. నక్షత్ర సహస్రై శ్శుభ్రద్యుతిభి స్తే ।
పుష్పాయితమేతై ర్మాతర్నిశి మస్తే ॥

10. ఘస్రః ఖలుకాలో రాజ్యం శచి కర్తుం ।
రాత్రిః ఖలుకాలో రంతుం రమణేన ॥

11. నిశ్శబ్ద తరంగా స్వగ్లౌషు నిశాసు ।
నూనం ఖశరీరే కాంతం రమయంతీ ॥

12. సాంద్రోడు సుమస్ర గ్విభ్రాజిత కేశా ।
ధ్వాంతాసిత చేలా శాంతాఽప్యసి భీమా ॥

సమృద్ధిమంత మర్థమగును, సంతోషమని కాదు. ఆకాశ శరీర మునకు వస్తుసమృద్ధినిచ్చువా డానందస్వరూపుడు. అతని స్వరూపమందొక అంశమాత్ర మాకాశము. దాని నావరించి స్వరూపముండుట ఆలింగనమగును.

8. ఓ యంబా! పగటిపూట ప్రజ్వలించుచున్న సూర్యుని నీవు మాణిక్య కిరీటమువలె ధరించు చుంటివి.

(ఆకాశ రూపిణియొక్క వైభవమిది. శక్తికి రెండు రూపములు వచింపబడుచున్నవి. అందొకటి యాకాశరూపమై కిరీటమును ధరించి విశ్వపాలన మొనర్చు ప్రభ్వీరూపము ఇంకొకటి దివ్యస్త్రీ రూపము. రెండవది దిగువ13, 14శ్లోకములచే చెప్పబడుచున్నది)

9. తల్లీ! తెల్లని కాంతిగల యీ నక్షత్రసమూహములే రాత్రిభాగ మున నీ శిరస్సునందు పుష్పములవలె నున్నవి.

10. ఓ శచీ! రాజ్యమును పాలించుకాలము పగలేగదా! భర్తతో రతిసల్పుకాలము రాత్రియేకదా!

(మొదటి దాకాశరూపమునకు, రెండవది స్త్రీ రూపమునకు జెందును.)

11. ఓ యాకాశ శరీరిణీ! చంద్రుడు లేనట్టి, నిశ్శబ్ద తరంగములు గలిగినట్టి చీకటి రాత్రులందు నీవు భర్తను రమింపజేయు చుంటివి. నిశ్చయము.

12. ఓ దేవీ! దట్టమైన నక్షత్రములనెడి పూలదండలతో విభ్రాజ మానమగు కేశములున్ను, చీకటియను నల్లని వస్త్రమున్ను గలిగి నీవు శాంతముగా నున్నను భయంకరముగా నుంటివి.

13. రాజ న్మితతారా మందార వతంసాం ।
మాత స్సితభాసా స్మేరాం హసితేన ॥

14. జ్యోత్స్నా ఘనసార ద్రావై రనులిప్తాం ।
త్వాం వీక్ష్య న శాంతిః కస్య క్షణదాసు ॥

15. బాలారుణ రోచిః కాశ్మీర రజోభిః ।
ఆలిప్తముఖీం త్వాం ప్రాతః ప్రణమామి ॥

16. సాయంసమయ శ్రీ లాక్షారస రక్తం ।
ప్రత్య క్ప్రసృతం తే వందే వర దేంఘ్రిం ॥

17. దీప్తార్క కిరీటాం సర్వాన్వినయంతీం ।
వందే భువనానాం రాజ్ఞీమసమానాం ॥

18. ధూతాఖిల రోగా శ్శ్వాసా స్తవ వాతాః ।
మాతర్వితరంతు ప్రాణస్య బలం నః ॥

19. ప్రాంచ స్తవ వాతా శ్శ్వాసా శ్శముశంతు ।
ప్రత్యంచ ఇమే నః పాపం శమయంతు ॥

20. మన్మాత రవాంచో వీర్యం వితరంతు ।
సంతాప ముదంచ స్సర్వంచ హరంతు ॥

13. ఓ మాతా! జ్యోతిర్మయమ్మైన నక్షత్రములనెడి మందార పుష్పములచే నలంకృతమైనట్టిన్ని, తెల్లని కాంతిగల నవ్వుచే శోభించు చున్నట్టిన్ని,

14. వెన్నెల యను కర్పూర రసముచే లేపన జేయబడినట్టిన్ని నిన్ను రాత్రి భాగములందు జూచిన వారికెవరికి శాంతి గలుగకుండును?

15. బాలసూర్యుని కిరణములనెడి కుంకుమ ధూళిచే లేపనగావింప బడిన ముఖముగల నిన్ను నేను ప్రాతఃకాలమున నమస్కరింతును.

16. ఓ దేవీ! సాయంసమయ కాంతియనెడి లత్తుకచే నెఱ్ఱబడి పశ్చిమమున వేఱుగా వ్యాపించిన నీ పాదమునకు నేను నమస్కరింతును.

17. ప్రకాశించు సూర్యుని కిరీటముగా గొని సకలజనులను శాసించు నట్టి, భువనములకు ప్రభ్వివై నిరుపమానవైనట్టి నిన్ను నేను కొలుతును.

18. ఓ తల్లీ! సకలరోగనివారణమగు నీ శ్వాస మా ప్రాణములకు బలమిచ్చుగాక.

19. ఓ తల్లీ! వెలుపలకు వచ్చు నీ శ్వాస మాకు సౌఖ్యము నిచ్చుగాక. లోనికి బోవు నీ శ్వాస మా పాపములను నశింప జేయుగాక.

20. తల్లీ! దక్షిణముగా వచ్చు నీ శ్వాసవాయువులు మాకు వీర్యము నిచ్చుగాక. ఉత్తర దిక్కుగా వచ్చు శ్వాస మా సకల సంతాపములను హరించుగాక.

21. అస్యా ఇవ భూమే ర్ఖ్యాత ప్రసవాయాః ।
ఏకైకశ ఆహు ర్యేషాం మహిమానం ॥

22. అద్రే రుపలానాం సద్యాస్సికతానాం ।
యేషాంచ న కశ్చి చ్ఛక్తో గణనాయాం ॥

23. రోమాయిత మేతై ర్గోత్రై స్తవకాయే ।
వ్యాఖ్యాత మనేన శ్లాఘ్యం తవభాగ్యం ॥

24. విశ్వం వహాసీదం జంభారి భుజస్థా ।
ఆర్యాన్వహ మాత ర్వ్యాప్తిమతిష్ఠా ॥

25. ఆద్యాం భువనానాం భర్తు స్తనుమధ్యాం ।
భక్తస్య భజంతా మేతా స్తనుమధ్యాః ॥

---

## 3. ముకుళాస్తబకము

1. పౌలోమ్యా శ్శుచయో హాసానాం ఘృణయః ।
భూయాసు ర్విమల ప్రజ్ఞాయై హృది మే ॥

2. ఇంద్రాణ్యాః కరుణా లోకా శ్శోక హృతః ।
భూయాసు ర్భరత క్ష్మాయై క్షేమ కృతః ॥

21. భూతములకు తల్లియైన భూమియొక్క మహిమను బూర్తిగా చెప్పలేనట్లే, యే గోళమహిమను గురించియైన నొక్కొక్క భాగముకంటె హెచ్చుగా చెప్పజాలకుండిరి.

22. కొండలయొక్క రాళ్లసంఖ్య, నదులయొక్క యిసుక (తిన్నెల) సంఖ్య చెప్పజాలనట్లే, గోళముల సంఖ్యయు చెప్పశక్యము కాదు.

23. ఓ దేవీ! ఇట్టి యసంఖ్యాకమైన గోళములే నీ శరీరమందు రోమములు (అల్పాంశలు). ఇంతమాత్రముచేతనే కొనియాడ దగియున్న నీ భాగ్యము వ్యాఖ్యానమయ్యెను.

24. ఓ తల్లీ! దేవేంద్రుని భవనమునందు నీవుండి విశ్వమును వహించుచుంటివి. వాసిష్ఠుని (గణపతిముని) బుద్ధియందు నీవుండి ఆర్యులను వహింపుము.

25. భువనములకు పూర్వమేయున్న శక్తిని, యీశ్వరుని తను మధ్యను (భార్యను, ఇంకొక అర్థము శరీరమధ్యమందుండు నాకాశరూపిణిని) భక్తునియొక్క యీ తనుమధ్యావృత్తములు పొందుగాక.

---

1. ఇంద్రాణియొక్క శుభ్రమైన హాసకాంతులు నా హృదయమందు విమలమైన ప్రజ్ఞ నిచ్చుగాక.

2. దుఃఖమును హరించు ఇంద్రాణీ కృపావలోకములు భారత భూమికి క్షేమకరము లగుగాక.

3. వ్యక్తి ర్వ్యోమ తను శ్శక్తిత్వా ద్వనితా ।
జ్ఞాతృత్వా త్పురుషః కేషాంచి ద్విదుషాం ॥

4. వ్యక్తిం వ్యోమతనుం యేప్రాహుః పురుషం ।
తేషాం తత్త్వవిదాం కల్పస్స్యా త్త్రివిధః ॥

5. రుద్రం కేపి జగు శ్శక్రం కేపి విదుః ।
భాషంతే భువన ప్రాణం కేపి విదః ॥

6. వ్యక్తిం వ్యోమతనుం ప్రాహు ర్యే వనితాం ।
తేషాంచ త్రివిధః కల్పశ్శాస్త్ర విదాం ॥

7. దుర్గా నారివరైః కైశ్చిత్సా గదితా ।
శచ్యన్యై ర్విబుధై ర్జ్ఞైరన్యై రదితిః ॥

8. ఏకేషాం విదుషాం వ్యక్తి ర్వ్యోమతనుః ।
నస్త్రీ నో పురుషో బ్రహ్మై తత్సగుణం ॥

9. త్వం విశ్వస్య మహా న్ప్రాణః కః పరమే ।
త్వం రుద్రః ప్రణవ స్త్వం శక్రోఽభ్ర శిఖీ ॥

3. ఆకాశము శరీరముగా గలదొక వ్యక్తియనియు, శక్తిత్వమువలన వనితయనియు, జ్ఞాతృత్వముచే పురుషుడనియు కొందఱు పండితుల యభిప్రాయము.

(ఒకే శరీరము శక్తి పురుషుల కన్వయింపబడెను.)

4. ఎవరు వ్యోమతనువైనది వ్యక్తియనియు, పురుషుడనియు చెప్పుచున్నారో, ఆ తత్త్వవేత్తలు మూడు విధములగు కల్పన తిరుగ చేయుచున్నారు. (ఎట్లనగా,)

5. కొందఱా పురుషుని రుద్రుడనియు, మఱికొందఱు ఇంద్రుడనియు నెఱుగుచున్నారు. ఇంకను కొందఱు లోకములకు ప్రాణమే యావ్యక్తి యందురు.

6. వ్యోమతనువు నెవరు వ్యక్తియనియు, వనితయనియు చెప్పుచున్నారో, ఆ శాస్త్రవేత్తలయందును కల్పన త్రివిధములుగానున్నది. (ఎట్లనగా,)

7. కొందఱిచే ఆ వనిత 'దుర్గ' యనియు, మఱికొందఱిచే 'శచీ' యనియు, నింకను కొందఱిచే 'అదితి' యనియు చెప్పబడుచుండెను.

8. కొందఱా వ్యోమతను వ్యక్తి స్త్రీయు కాదు, పురుషుడు కాదని, అది బ్రహ్మయొక్క సగుణరూప లక్షణ మనిరి.

9. ఓ దేవీ! నీవే విశ్వమునకు మహాప్రాణమవు, నీవే బ్రహ్మవు, రుద్రుడవు, ప్రణవమవు, ఇంద్రుడవు, వైద్యుతాగ్నివి,

10. త్వం కస్యాస్యదితి స్త్వం రుద్రస్య శివా ।
త్వం శక్రస్య శచీ శక్తిస్సర్వ గతే ॥

11. ప్రాణశ్చ ప్రణవో జ్యోతిశ్చాంబరగం ।
వస్త్వేకం త్రిగుణం నోవస్తు త్రితయం ॥

12. శక్తేరంబ పరే శక్తస్యాపి భిదా ।
జ్వాలా పావకవ ద్భాషా భేదకృతా ॥

13. సర్వం దృశ్య మిదం భుంజానే పరమే ।
పుం నామ స్తతయో యుచ్యంతే ఖలు తే ॥

14. కుర్వాణేఽమ్బ సత స్సంతోషం సతతం ।
స్త్రీనామ స్తతయ శ్శోభాం తే దధతే ॥

15. సద్బ్రహ్మ బ్రువతే విద్వాంసో విగుణం ।
త్వం మాత స్సగుణం బ్రహ్మాఽసి ప్రథితే ॥

16. శబ్దాద్యై ర్వియుతం సద్బ్రహ్మాఽమలినం ।
శబ్దాద్యై స్సహితా త్వం దేవ్యార్యహితా ॥

17. సాక్షి బ్రహ్మ పరం త్వం మాతః కురుషే ।
సర్వేషాం జగతాం కార్యం సర్వ విధం ॥

10. ఓ తల్లీ! నీవు కశ్యపబ్రహ్మ కదితివైతివి, రుద్రునకు శివవైతివి, యింద్రునకు శచివైతివి. నీవే శక్తివై యుంటివి.

(పురుషలక్షణమునుగూడ భరించు శక్తివైతివని భావము.)

11. ప్రాణమని, ప్రణవమని, ఆకాశగత తేజస్సని త్రిగుణములతో నున్న దొకే వస్తువు, వస్తువులు మూడుగా లేవు.

12. ఓ యంబా! శక్తికి, శక్తునకు భేదము జ్వాలకు, అగ్నికి గల భేదమువంటిది. మాటయే భేదమును గలిగించుచున్నది. (వస్తుతః లేదని భావము.)

13. కనబడు సర్వము భుజించు నో దేవీ! పురుషనామ స్తోత్రములు నీకు యుక్తమే కదా. (అయినను,)

14. ఓ యంబా! సద్రూపబ్రహ్మకు సంతోషమునిచ్చునట్టి నీకు స్త్రీనామ స్తోత్రములు మాత్రము శోభనిచ్చుచున్నవి.

15. తల్లీ! విద్వాంసులు గుణములేని దానిని సద్బ్రహ్మగా చెప్పుచున్నారు. నీవు సగుణబ్రహ్మ వైతివి. (8వ. శ్లోకముచూడుడు)

16. ఓ దేవీ! శబ్దాదులతో గూడక యున్నది నిర్మల బ్రహ్మమగును. శబ్దాదులతో గూడిన నీ వార్యులకు హితకారిణి వగుచుంటివి. (స్తుతింప వీలగు రూప మిదియే)

17. ఓ తల్లీ! పరబ్రహ్మము సాక్షిగా నుండును. నీవు సకల జగత్తులయొక్క సర్వవిధకార్యములను జేయుదువు.

18. ద్యౌర్మాతా జగతో ద్యౌరేవాస్య పితా ।
దృశ్యం విశ్వ మిదం వ్యాప్తం భాతి దివా ॥

19. ఆకాశాద్రజసో ద్యౌరన్యా విరజాః ।
ఆకాశేఽస్తి పున స్తత్పారేచ పరా ॥

20. తాం లోకస్య మహః రంగే వ్యోమతనుం ।
పారే శుద్ధ తమాం విద్మస్త్వాం పరమే ॥

21. త్వాం పూర్ణామదితిం శక్తిం దేవి శచీం ।
నిత్యం శబ్దవతీం గౌరీం ప్రబ్రువతే ॥

18. జగత్తున కాకాశమే తల్లి, ఆకాశమే తండ్రి. దృష్టిగోచరమగు సర్వము ఆకాశముచే వ్యాప్తమై ప్రకాశించుచున్నది.

19. ధూళిరూపమైన ఆకాశముకంటె ధూళిరహితాకాశము వేఱుగా గలదు. దాని కన్యమైన దింకొకటి యున్నది. ఈ మూడింటి కంత్యమందు పరాకాశము గలదు.

(పరాకాశము నిర్గుణము. అదియే గుణత్రయమును బొంది మూడు స్థితులుగా వ్యాపించెను. 11 వ శ్లోకము చూడుడు. వీనినే భూర్భువస్సువర్లోకము లనిరి. అంత్యమున కేవల మహిమమే పరాకాశమగును. సచ్చిదానంద త్రిరూపాత్మక వస్తు వీ విధముగా మహిమచే రూపత్రయలక్షణమై జ్యోతిరాకృతిగా ప్రకాశించినట్లు భావించవలెను.)

20. దేవీ! లోకముల నెడి మహారంగమందా వ్యోమతనువును, దాని యంత్యమందు శుద్ధతమమైన నిన్నును తెలిసికొను చున్నాము.

(ఆమె పరాకాశ స్వరూపిణియైనను స్థూల - సూక్ష్మ - కారణ శరీరములు గల తనువును మనము పొందినట్లే త్రైవిధ్యమును బొందిన ఆకాశతనువుచే పొంది, యంతటను వ్యాపించెను. ఆ రూపమును ధ్యానించువా రందలి పరదేవతాతత్త్వమును తెలియుదురు.)

21. ఓ దేవీ! పూర్ణమైన నిన్నదితిగాను, శక్తిగాను, శచిగాను, ప్రణవముగాను, గౌరీదేవిగాను వచించుచున్నారు.

22. పుంనామా భవతు స్త్రీనామాఽస్త్వథవా ।
వ్యక్తి ర్వ్యోమ తను ర్లోకం పాత్వఖిలం ॥

23. నాకే సా కిల భా త్యైంద్రీ రాజ్యరమా ।
బిభ్రాణా లలితం స్త్రీరూపం పరమా ॥

24. శక్తాం దేవి విధే హ్యర్థానా మవనే ।
ఇంద్రస్యేవ భుజాం వాసిష్ఠస్య మతిం ॥

25. పూజా శక్రతను ర్న్యైతై స్సిధ్యతు తే ।
గాత్రాణాం వరదే గాయత్రై ర్మకుళైః ॥

---

## 4. వసుమతీస్తబకము

1. మోహం పరిహార న్యోగం వితనుతాం ।
దేవేంద్ర దయితా హాసో మమహృది ॥

2. ఆభాతు కరుణా సా భారత భువి ।
సుత్రామ సుదృశో యద్వన్నిజ దివి ॥

3. వందారు జనతా మందార లతికాం ।
వందే హరిహయ ప్రాణప్రియతమాం ॥

4. శోకస్య దమనీం లోకస్య జననీం ।
గాయామి లలితాం శక్రస్య దయితాం ॥

22. పురుష నామ మగుగాక, స్త్రీ నామ మగుగాక. నోర్యమతిను వ్యక్తియే నిఖిలమును రక్షించుచున్నది.

23. ఆమె లలితమైన స్త్రీరూపమును ధరించి యుత్తమ రాజ్యలక్ష్మి గాను, ఇంద్రాణిగను స్వర్గమున భాసించుచున్నది.

24. ఓ దేవీ! ఆర్తినొందినవారిని రక్షించుట కింద్రుని భుజమున కెట్లు సామర్థ్యమిచ్చితివో, వాసిష్ఠుని మతి కట్లే శక్తినీయుమా. (భారతీయుల ఆర్తిని దొలగించుటకు)

25. నిన్ను గానముచేయువారికి వరములిచ్చు నో యింద్రతరుణీ! ఈ గాయత్త్రీ ఛందస్సంబంధ ముకుళ(వృత్త)ములచే నీకొనర్చు పూజ సిద్ధించుగాక.

---

1. మోహమును పరిహరించు ఇంద్రాణీహాసము నా హృదయ మందు యోగమును జేయుగాక.

2. ఇంద్రాణి తన (నిజ)లోకమందెట్టి కరుణ జూపునో (స్వర్గమందు), అట్టి కరుణనే భారత భూమియందామె చూపుగాక.

3. నమస్కరించువారికి గోర్కెలనిచ్చుచున్న దేవేంద్ర ప్రాణసఖిని నేను కొలుచుచున్నాను.

4. దుఃఖములను శమింప జేయునది, లోకమాతయు, ఇంద్రుని భార్యయు నగు సుందరిని నేను స్తుతింతును.

5. రమ్యా సుమనసాం భూపస్య మహిషీ ।
సౌమ్యా జనిమతాం మాతా విజయతే ॥

6. వీర్యస్యచ ధియ స్త్రైలోక్య భరణే ।
ధాత్రీ మఘవ తే దేవీ విజయతే ॥

7. వ్యాప్తా జగదిదం గుప్తా హృది నృణాం ।
ఆప్తా సుకృతినాం దైవం మమ శచీ ॥

8. ఖేశ క్తి రతులా పారే చిదమలా ।
స్వశ్చారు మహిళా దైవం మమశచీ ॥

9. శస్త్రం మఘవతో వస్త్రం త్రిజగతః ।
శాస్త్ర స్తుతగుణా దైవం మమశచీ ॥

10. యుక్తస్య భజత శ్శర్మాంత రతులం ।
వర్మాపిచ బహి ర్దైవం మమ శచీ ॥

11. వీర్యం బలవతాం బుద్ధి ర్మతిమతాం ।
తేజో ద్యుతిమతాం దైవం మమ శచీ ॥

12. ఏకైవ జనయ త్యేకైవ దధతీ ।
ఏకైవ లయకృ ద్దైవం మమ శచీ ॥

5. రమ్యయు, దేవేంద్రుని పట్టపుదేవియైనది, దేహధారులకు సౌమ్యమైనది యగు మాత ప్రకాశించుచున్నది.

6. త్రిలోకములను భరించుట కింద్రునకు బుద్ధిని, బలమును ఇచ్చు దేవి ప్రకాశించుగాక.

7. ఈ జగత్తునందు వ్యాపించియున్నది, మానవ హృదయము లందు గుప్తమై యున్నది, పుణ్యాత్ముల కాప్తురాలైనదియగు శచీదేవి నా యొక్క దైవము.

8. ఆకాశమందు నిరుపమానశక్తిగా నున్నది, ఆకాశమున కావల నిర్మల చిత్తుగా నున్నది, స్వర్గమందు సుందరస్త్రీగా నున్నది యగు శచీదేవి నా యొక్క దైవము.

9. ఇంద్రునకు శస్త్రము, ముల్లోకములకు వస్త్రము (ఆకాశమే వస్త్రము) అగుచు, శాస్త్రములచే నుతింపబడు గుణములుగల శచీదేవి నా యొక్క దైవము.

10. యోగయుక్తులై భజించువాని యాంతర్యమున నిరుపమాన సుఖము నిచ్చుచు, బాహ్యమున కవచమై రక్షించు శచీదేవి నా యొక్క దైవము. (ఇంద్రాణీ విద్యాఫలమిది)

11. బలవంతులందు వీర్యరూపముగను, మతిమంతులందు బుద్ధి రూపముగను, కాంతిమంతులందు తేజోరూపముగను నున్న శచీదేవి నా దైవము.

12. తానొక్కతెయే సృష్టిచేయుచు, తానే భరించుచు (స్థితి), తానే లయ మొనర్చు శచీదేవి నా దైవము.

13. శక్తీ రవితథాః క్షేత్రేషు దధతీ ।
బీజేషుచ పరా దైవం మమ శచీ ॥

14. చిన్వన్త్యపి పచం త్యేకా పశు గణం ।
ఖాటంత్యపి భవే ద్దైవం మమశచీ ॥

15. దృష్టౌ ధృత చితి ర్ద్రష్ట్యై తతగుణా ।
విశ్వాత్మ మహిషీ దైవం మమశచీ ॥

16. రాకా శశిముఖీ రాజీవ నయనా ।
స్వః కాపి లలనా దైవం మమ శచీ ॥

17. స్థాణావపి చరే సర్వత్ర వితతా ।
సాక్షాద్భవతు మే స్వర్నాథ దయితా ॥

18. యస్మాతరనృతం జుష్టంచ గదితం ।
ధ్యాతంచ హరమే తద్దేవి దురితం ॥

19. మాం మోచయ ఋణా దింద్రాణి సుభుజే ।
మా మల్పమతయో మానిందిషు రజే ॥

20. శత్రుశ్చ శచిమే సఖ్యాయ యతతాం ।
దృప్తశ్చ మనుజో మామంబ భజతాం ॥

21. కష్టం శచి విధూ యేష్టం విదధతీ ।
ఆనందయ జనం ప్రేయాం స మిహామే ॥

13. క్షేత్రములందు, బీజములందుగూడ వ్యర్థముగాని శక్తులను ధరించు పరాదేవియైన శచి నాదైవము.

14. ఒక్కతెయైనను జీవరాసులందు వెతకుట, పచనమొనర్చుట, నాశనమొనర్చుట యను సంసారత్రయముగా నున్న శచీదేవి నాదైవము.

15. దృష్టియందు ధరింపబడు చిత్స్వరూపిణి, దృశ్యములందు గోచరించు గుణరూపిణి యగు దేవేంద్ర భార్యయైన శచి నా దైవము.

16. పూర్ణచంద్రునివంటి ముఖము, పద్మముల బోలు నేత్రములు గలిగి స్వర్గమందుండు నొకానొక స్త్రీ యైన శచి నా దైవము.

17. స్థాణువులందు, చరవస్తువులందు సర్వత్ర వ్యాపించుఇంద్రాణి నాకు ప్రత్యక్ష మగుగాక.

18. ఓ తల్లీ! యే యనృతము (నాచే) పొందబడెనో, పలుకబడెనో, ధ్యానించబడెనో, ఆ నా పాపమును హరింపుము.

19. ఓ యింద్రాణీ! ఋణమునుండి నన్ను విముక్తుని గావింపుము. అల్పబుద్ధులు నన్ను నిందించకుందురుగాక.

20. ఓ యంబా! శత్రువైన వాడు నా సఖ్యమునకు యత్నించుగాక, గర్వితుడు నన్ను సేవించుగాక.

21. ఓ శచీ! కష్టములను తొలగించి, యిష్టముల నిచ్చుదానవై నా కిచ్చుటగల ప్రియజనులను సంతోషబరచుము

22. అస్త్రం మమ భవ ధ్వంసాయ రటతాం ।
సుత్రామ తరుణి శ్రీమాతర సతాం ॥

23. సంపూరయతు మే సర్వం సురనుతా ।
స్వర్గక్షితి పతే శ్శుద్ధాంత వనితా ॥

24. సంవర్ధయ శచి స్వం దేశ మవితుం ।
బాహోరివ హారే ర్బుద్ధేర్మమ బలం ॥

25. ఏతైర్వసుమతీ వృత్తైర్నవ సుమైః ।
భూయాచ్చరణయోః పూజాజనని తే ॥

---

ప్రథమం గాయత్రం శతకమ్ సంపూర్ణమ్.

22. ఓ తల్లీ ! అరచుచున్న దుర్మార్గుల వినాశముకొఱకు నా కస్త్రమగుము.

23. దేవతలచే నుతింపబడు యింద్రాణి నా కోర్కెలనన్నిటిని సంపూర్ణ మొనర్చుగాక.

24. ఓ శచీ ! స్వకీయమైన దేశమును (స్వర్గమును) రక్షించుకొనుట కింద్రుని భుజములకు బలమిచ్చినట్లు, నా బుద్ధిబలమును వృద్ధి జేయుము.

25. ఓ తల్లీ ! ఈ వసుమతీ వృత్తముల నెడి నూత్నకుసుమములచే నీ పాదములకు పూజయగుగాక.

---

ఓం

ద్వితీయం

# ఔష్ణిహం శతకమ్

## 1. కుమారలలితాస్తబకము

1. సురేశ్వర మహిష్యా స్స్మితం శశిసితం మే ।
తనోతు మతి మచ్ఛాం కరోతు బల మగ్ర్యం ॥

2. విధాయ రిపు ఘాతిం నిధాయ సుదశాయాం ।
పులోమ తనుజాతా ధినోతు భరత క్ష్మాం ॥

3. పదప్రణత రక్షా విధాన ధృతదీక్షా ।
జగద్భరణ దక్షా పరా జయతి శక్తిః ॥

4. స్వర త్యవిరతం సా శనై ర్నభసి రంగే ।
జ్వలత్యధిక సూక్ష్మం జగత్ప్రభవ శక్తిః ॥

5. మహ స్తవ సుసూక్ష్మం నిదాన మఖిలానాం ।
భవత్యఖిల మాత ర్జగత్యనుభవానాం ॥

6. జనన్యనుభవానాం మతిత్వపరిణామే ।
స్వరో భవతి మూలం తవాభ్ర హయరామే

7. య ఈశ్వరి నిదానం సమస్త మతి భానే ।
స్వరో గతివిశేషా త్సఏవ ఖలు కాలః ॥

1. ఇంద్రాణియొక్క చంద్రునివంటి ధవళ స్మితము నా బుద్ధికి నైర్మల్యమొసగి శ్రేష్ఠబలము నిచ్చుగాక.

2. శత్రునాశన మొనర్చి, భరత భూమిని మంచిదశకు తెచ్చి యింద్రాణి సంతోషపెట్టుగాక.

3. తన పాదములందు నమ్రులైనవారిని రక్షించు విధానమందు దీక్షబూనినది, జగత్తును భరింప సమర్థురాలైనది యగు పరాశక్తి ప్రకాశించుచున్నది.

4. స్వర్గమందెస తెరపిలేకను, ఆకాశరంగస్థలమందు సూక్ష్మముగాను గల ఆ యింద్రాణీశక్తి యధికముగాను, సూక్ష్మముగాను ప్రకాశించుచున్నది.

(స్వర్గమందు స్పష్టముగా నున్నందున తేజస్సధికము. ఆ తేజము ఆకాశమందు తన సూక్ష్మత్వముచే తిరోధానమై యస్పష్టముగా నుండును.)

5. ఓ తల్లీ! నీ యతిసూక్ష్మ తేజస్సు జగత్తునందు సకలానుభవములకు నిదానము (ఆధారము) అగుచున్నది.

6. ఓ తల్లీ! అనుభవములయొక్క జ్ఞాన పరిణామమునకు నీ స్వరమే మూలమగుచున్నది. (ప్రణవ శబ్దము జ్ఞానమునకు నేతకనుక)

7. ఓ యీశ్వరీ! ఏ స్వరము సమస్త జ్ఞానమునకు మూలమో, ఆ స్వరమే గతివిశేషమువలన కాలమగును గదా!

8. జ్వాలం త్వభిహితా త్వం విహాయసి విశాలే ।
ప్రచండ పదపూర్వా ప్రపంచకరి చండీ ॥

9. స్వరం త్వఖిల బుద్ధి ప్రదా భవసి గౌరీ ।
త్రికాలతను రంబ స్మృతా త్వమిహ కాళీ ॥

10. మహాస్స్వర ఇతీదం ద్వయం తదతిసూక్ష్మం ।
మహేశ్వరి తవాంశ ద్వయం పరమముక్తం ॥

11. మహోఽతిశయ మాప్తం త్వయి త్రిదివ గాయాం ।
స్వరోఽతిశయ మాప్తః సితాద్రి నిలయాయాం ॥

12. దివం నయతి పూర్వా భువం యువతి రన్యా ।
ద్వయోః ప్రకృతి రభ్రం విశాలమతి మానం

8. దేవీ! విశాలమైన ఆకాశమందు నీవు ప్రీతిచే జ్వలించుచు 'ప్రచండ' పదము ముందుగల చండివై ప్రకాశించుచుంటివి. (ఆకాశమందు మహిమచే జ్వలించుశక్తి ప్రచండచండి కనుక నే యీామె వైద్యుత శక్తిస్వరూపిణి.)

9. ఓ యంబా! స్వరరూపిణివై నను యఖిలమునకు బుద్ధి నిచ్చుచు 'గౌరి' వైతివి. త్రికాలములే శరీరముగా గలిగి యిచ్చట 'కాళి'గా స్మరింపబడుచుంటివి.

(అనగా బుద్ధినిచ్చు చిచ్ఛాఖ యొకటి, నాదముచే పరిణామ ములను గల్పించు క్రియాశాఖ యింకొకటి.)

10. ఓ యీశ్వరీ! మహస్సు, స్వరము అను రెండును అతి సూక్ష్మ ములు. అవి యుత్కృష్టమగు నీయొక్క అంశద్వయముగా చెప్పబడుచున్నవి.

11. స్వర్గమును బొందిన నీ మహస్సు అతిశయమును బొంది యున్నది. (ఆకాశముకంటె నివృత్తిచే వేఱైన స్వర్గమందు మహస్సై ఆకాశముతో గూడిన భువనమందది సహస్సనబడును) అట్లే కైలాసమందు వసించు నీ స్వర మతిశయించుచున్నది. (స్వర్గములో మహస్సు విభూతి, కైలాసమందు ప్రణవము విభూతి)

12. మొదట చెప్పబడిన దేవి (అనగా అతిశయించిన మహస్సు కలది) దివమును బొందించుచున్నది, తరువాత చెప్పబడిన దేవి భువమును బొందించుచున్నది. (మొదటిది నివృత్తి స్వరూ పిణి, రెండవది ప్రవృత్తి స్వరూపిణి.) ఈ రెండింటికి మూలము కొలవ శక్యమునుగాని విశాలాకాశమే. (సచ్చిదానందమే)

13. న తే దివి లసంత్యాః పితా తనుభృదన్యః ।
స్వయం భువ మిమాంత్వాం సతామవని విద్మః ॥

14. సురారి కులజన్మా తవేశ్వరి పులోమా ।
పితేతి కవిభాషా పరోక్షగతి రేషా ॥

15. వదంత్యసుర శబ్దై ర్ఘనం సజలమేతం ।
పులోమ పదమేకం పురాణసతి తేషు ॥

16. ప్రకృష్టతర దీప్తి ర్గభీరతర నాదా ।
ఇతో హి భవసి త్వం తటి న్మసి యశోదా ॥

17. అరాతి రసురోఽయం విభో ర్నిగదిత స్తే ।
హాయశ్చ బత గీతః పితా తవ పయోదః ॥

18, ప్రియైః కిల పరే వాం పరోక్ష వచనాఖ్యైః ।
ప్రతారిత మివేలా జగన్మసి గణేన ॥

13. ఓ తల్లీ ! ఆకాశమందు ప్రకాశించు నీ కితర శరీరధారియగు తండ్రి యెవ్వడులేడు. అట్టి నిన్ను మే మందువలన స్వయం భువగా తలచుచుంటిమి.

14. ఓ యీశ్వరీ ! రాక్షసకులమందు బుట్టిన పులోముడు నీ తండ్రి యను కవివచన మప్రమాణమైనది.

(పురాణములలో పులోము డింద్రాణి తండ్రిగా వచింపబడెను)

15. దేవీ ! జలయుక్తమైన మేఘ మీ యసురవాచక శబ్దములతో పిలువబడెను. అట్టి పదములలో 'పులోమ' పద మొకటి.

(ఘనం అనగా మేఘము. నిఘంటువులో 'ఘనం' అను పద మునకున్న 32 పేళ్లలో 'పులోమ' అనునది యొకటి.)

16. ఓ తల్లీ ! మునులకు కీర్తినిచ్చు నీవు అత్యధిక కాంతియు, గంభీరనాదమున్ను గలిగిన మెఱుపు రూపమున యీ మేఘము నుండి పుట్టితివి.

(కనుక పులోము డామెకు తండ్రి యనబడెను. కాని మెఱుపు రూపమైన విద్యుచ్ఛక్తి పులోముడను మేఘునకు బూర్వ మాకాశమందు తల్లివలెనున్న విషయమీ కవులు మరచిరి.)

17. ఈ పులోమ రక్కసుడు నీ విభుని శత్రువుగా వచింపబడు చుండెను. నీ తండ్రియైన యీ మేఘము 'హాయ' మనియు పిలువబడెను.

18. దేవీ ! మీ యుభయులనుగుఱించి (ఇంద్రయింద్రాణీలగురించి) ప్రియమైన గూఢవాగ్జాలముచే మునిగణములీభూమిని వంచించి నట్లున్నది.

19. నికృష్టమపి రమ్యం యది త్రిదివలోకే ।
తవాంబ కిము వాచ్యా రుచి స్త్రిదివ నాథే ॥

20. త్వమంబ రమణీయా వధూ స్త్వమివ నాకే ।
త్వయా క ఇహ తుల్యాం మృదో వదతు లోకే ॥

21. వినీల మివ ఖాంశం విదు స్త్రిదివ మేకే ।
పరస్తు వగతి స్వః కవిః కమల బంధుం ॥

22. అముత్ర గతశోకే మహా మహాసి నాకే ।
నమా మ్యధికృతాం తాం మహేంద్ర కులకాంతాం ॥

23. యదామ ముత పక్వం మదీయ మఘ ముగ్రం ।
తదింద్ర కులకాంతే నివారయ సమగ్రం ॥

24. దదాతు భరత క్ష్మా విషాద హరణాయ ।
అలం బల ముదారా జయంత జననీ మే ॥

25. అతీవ లలితాభిః కుమాగ లలితాభిః ॥
ఇమాభి రమరేశ ప్రియా భజతు మోదం ॥

---

19. ఓ యంబా! నికృష్టమైన వస్తువుకూడ స్వర్గము దు రమ్యమై యున్నప్పు డింక స్వర్గాధీశ్వరివైన నీ కాంతినిగుఱించి చెప్పుట కేమున్నది.

20. తల్లీ! స్వర్గమందు నీవంటి రమణీయస్త్రీవి నీవే. ఈ మట్టిలోక మందింక నీకు సమానస్త్రీ నెవడు చెప్పగలడు?

21. మిక్కిలి నీలమైన ఆకాశము స్వర్గమని కొందఱు భావించు చున్నారు. (నిర్మలాకాశము.) మఱియొక కవి సూర్యుడే స్వర్గ మనుచున్నాడు.

22. ఊర్ధ్వమందున్నది, దుఃఖరహితమైనది, గొప్ప తేజస్సుగలది యగు స్వర్గము నధిష్టించిన ఇంద్రాణికి నేను నమస్కరించు చున్నాను.

(స్వర్గమునకు సరియగు నిర్వచన మీయబడెను. దీనినిబట్టి పైశ్లోకములో పేర్కొనబడిన నిర్వచనములు ఖండింపబడినవగును)

23. ఓ యింద్రాణీ! పచ్చిగానున్నను, పక్వమైనను నాయొక్క ఉగ్రపాపము లేవిగలవో, అధికముగానున్న ఆ పాపములను నీవు నివారింపుము.

24. ఉదార స్వభావురాలైన జయంతుని తల్లి (ఇంద్రాణి) భరత ఖండ విషాదహరణమునకై నా కత్యంత బలము నొసగుగాక.

25. అతి సుందరమైన యీ కుమార లలితా వృత్తములవలన ఇంద్రాణి సంతోష మొందుగాక.

## 2. మదలేఖాస్తబకము

1. పౌలోమ్యాః పరిశుభ్ర జ్యోత్స్నా దృశ్యరుచో మే ।
శ్రీమంతో దరహాసాః కల్పంతాం కుశలాయ ॥

2. కారుణ్యామృత సిక్తా శక్తా శక్ర మహిష్యాః ।
ప్రేక్షా భారత భూమే ర్దౌర్బల్యం విధునోతు ॥

3. వందే నిర్జర రాజ్ఞీం సంకల్పేసతి యస్యాః ।
సాధ్యాసాధ్య విచారో నైవస్యాదణు కోపి ॥

4. సంకల్ప స్తవ కశ్చి చ్చిత్తే చేద్దివ ఈశే ।
స్యా దుల్లంఘ్య నిసర్గం సిద్ధిర్నిష్ఫలతా వా ॥

5. మూఢోప్యుత్తమ రీత్యా సిద్ధ్యే దధ్యయనేషు ।
మేధావీచ నితాంతం నైవస్యా త్కృతకృత్యః ॥

6. ఉత్పద్యేత మహేశ్వ ర్యప్రాజ్ఞాదపి శాస్త్రం ।
యాయాన్మాతరకస్మా ద్విభ్రాంతిం విబుధోపి ॥

7. అల్పానామబలానాం సంగ్రామే విజయస్స్యాత్ ।
శక్తానాం బహుళానాం ఘోరాస్యా త్పరిభూతిః ॥

8. రాజేరస్నృప పీఠే వ్యాఖ్యాతాని కులాని ।
స్యాద్దుర్ధర్ష బలానాం పాతో రాజకులానాం ॥

1. పరిశుభ్రమైన వెన్నెలవలె గన్పట్టు కాంతులు గల్గి ప్రకాశించు ఇంద్రాణీ దరహాసము నాకు క్షేమము కొఱకగుగాక.

2. దయ యనెడి యమృతముచే తడుపబడు నట్టిది, శక్తిమంత మైనది యగు ఇంద్రాణీ వీక్షణము భారతభూమియొక్క దౌర్బ ల్యమును హరించుగాక.

3. ఏ దేవి సంకల్పించినప్పుడు సాధ్యాసాధ్య విచారము లేశమైన నుండదో, అట్టి దేవికి నేను నమస్కరింతును.

4. ఓ స్వర్గాధీశ్వరీ! నీవు సంకల్పించినచో సిద్ధి, నిష్ఫలత యను నవి తమ నైసర్గికస్థితి నతిక్రమించియైనను జరిగితీరును.

5. నీ సంకల్పమునుబట్టి మూఢుడైనను, నుత్తమరీతిని విద్యలందు సిద్ధి బొందును. అత్యంత మేధావియైనను, కృతకృత్యుడు కాజాలడు.

6. ఓ తల్లీ! నీ సంకల్పానుసారము మూఢునివల్ల శాస్త్రముత్ప న్నము కావచ్చును, పండితుడైనను అకస్మాత్తుగా భ్రాంతి బొందవచ్చును.

7. బలహీనులై కొలదిమంది యున్నను సంగ్రామమందు విజయ మొందవచ్చును, చాలమంది యుండి శక్తిమంతులైనను ఘోరాపజయము బొందవచ్చును.

8. కీర్తిలేని వంశములు నృపపీఠమందు ప్రకాశించుచు, మిగుల బలముగల రాజకులములు నశించవచ్చును.

9. నిర్యత్నో౽పి సమాధే ర్వ్యం దేద్దేవి సమృద్ధిం ।
యోగస్యాంబ నపశ్యే దభ్యస్యన్నపి సిద్ధిం ॥

10. అత్యంతం యదసాధ్యం నేదిష్ఠం భవతీదం ।
సాధ్యం సర్వ విధాభి స్త్వ దింద్రాణి దవిష్ఠం ॥

11. గాయామో మునిసంఘై ర్గేయాం కామపి మాయాం ।
ఇంద్రస్యాపి వినేత్రీం త్రైలోక్యస్యచ ధాత్రీం ॥

12. విద్యానామధినాథే కాం విద్యాం శ్రయసే త్వం ।
ఇంద్రం కర్తుమధీశం విశ్వస్మా దధికం తం ॥

13. నిత్యాలిష్ట మనీషే స్త్రీమోహో నవితర్క్యః ।
భ్రూచేష్టానుచరత్వా దన్యాస్యా దనుకంపా ॥

14. సౌందర్యం పరమన్య ద్వ్రాజైశ్వర్యథవా తే ।
హర్తుం యత్సుఖమీష్టే తాదృక్తస్యచ చిత్తం ॥

15. చక్షుర్దర్శన మాత్రా న్నిస్తేజో విదధానం ।
చిత్తంచో జ్ఝితధైర్యం మత్తానాం దనుజానాం ॥

9. ఓ దేవీ! యత్నము జేయనివాడుగూడ పూర్ణసమాధి బొంద వచ్చును, అభ్యసించుచున్నను యోగస్థితి నొకడు పొందక పోవచ్చును.

10. ఓ యింద్రాణీ! ఏది యత్యంత అసాధ్యమో, అది సమీపము గావచ్చును; సర్వవిధముల సాధ్యమైనది దూరము గావచ్చును.

11. ముని సంఘములచే గానము చేయబడునది, యింద్రునిగూడ శాసించునది, త్రిలోకజనని యగు నొకానొక మాయను మేము గానము చేయుచుంటిమి.

12. సకల విద్యాధీశ్వరీ! ఓ తల్లీ! విశ్వముకంటె నధికుడైన ఆ యింద్రుని వశమొనర్చుకొనుటకు నీవే విద్య నాశ్రయించితివి?

13. ఓ దేవీ! స్త్రీమోహ మూహింపనలవిగానిది. నీ కనుబొమ్మల చేష్టల కనుచరుడగుటవలన నీ పతినియందు చెప్పనలవిగాని దయ జూపియుందువు.

14. ఓ యింద్రాణీ! అట్లు గానిచో, నీ సౌందర్య ముత్కృష్ట మైనది, యసాధారణమైనది యని చెప్పవచ్చును. ఏ సౌందర్య మాతని చిత్తమును సులభముగా నపహరించుటకు సమర్థ మగుచున్నదో

(ఆ సౌందర్య మసాధారణోత్కృష్టమైనదని యన్వయము.)

15. ఓ దేవీ! నీ నేత్రము తన వీక్షణ మాత్రముచేతనే మత్తులైన దనుజుల చిత్తములను ధైర్యతేజోవిహీనములుగా చేయుచున్నది.

16. గర్తే దుర్జన దేహే మగ్నాన్పంక విలగ్నాన్ ।
ప్రాణానాత్మ సజాతీ నుద్ధర్తుం ధృతదీక్షం ॥

17. వజ్రం నిర్జరరాజో యద్ధర్తే సమరేషు ।
త్వ చ్ఛక్తే కలయైత స్మన్మాత ర్నిరమాయి ॥

18. రాజ్ఞీ త్వాత్పరమే తే రాజత్వం శతమన్యోః ।
నిశ్శక్తిస్సవినా త్వాం కామాజ్ఞాం కురు శాం నః ॥

19. సర్వం శక్ర నిశాంత స్త్వైశానే తవ హస్తే ।
అస్మాకంతు ధియేదం స్తోత్రం సంగ్రహతస్తే ॥

20. గంతవ్యం స్వరధీశే నిశ్శేషార్పణ శూరం ।
బిభ్రాణా నయసి త్వం మార్జాలీవ కిశోరం ॥

21. గృహ్ణాన్నంబరనాథా మంబామశ్లథ బంధః ।
కీశస్యేవ కిశోరో యోగీ గచ్ఛతి గమ్యం ॥

16 దుర్జన దేహము నెడి గోతిలో మునిగిపోయి, పాపపంకమందు చిక్కుపడిన ఆత్మసంబంధమగు ప్రాణముల నుద్ధరించుటకు దృఢ దీక్ష బూనిన (వాక్యపూర్తికి తరువాత శ్లోకము చూడుడు.)

17. ఇంద్రుడు యుద్ధమున నెట్టి వజ్రాయుధము ధరించెనో అట్టి వజ్రము నీ శక్తియొక్క కళచేతనే నిర్మింపబడెను.

(శరీరములందుండు వెన్నెముకకు వజ్రదండమని పేరు. దాని యందు శరీరవ్యాపారమును శాసించు నాత్మశక్తిప్రవాహము సుషుమ్నానాడి నాశ్రయించి యుండును. ఈ శక్తియే వజ్రాయుధశక్తియై, యింద్రుడైన ఆత్మచే ధరింపబడినట్లుండును. దీని యనుగ్రహము బొందిన యోగికి శరీరమునంటిన పాపములు నశించి, నాడీగ్రంథులు వీడును. కవికి కపాలభిన్నసిద్ధినిచ్చిన దీ శక్తియే.)

18. ఓ దేవీ! నీవు రాజ్ఞివగుటచేతనే ఇంద్రునకు రాజత్వము కలిగెను. నీవు లేనిచో నతడశక్తుడై మమ్ముల నెట్లాజ్ఞాపించగలడు?

19. ఓ తల్లీ! ఇంద్రలోకమందున్న సమస్త విశేషము నీ హస్తమందే కలదు. ఈ స్తోత్రము మాకుండు బుద్ధిచే సంగ్రహముగా చేయబడుచున్నది.

20. ఓ తల్లీ! మార్జాలకిశోరన్యాయమువలె పూర్తిగా నర్పించుకొనిన శూరుని నీవు ధరించుచు గమ్యస్థానము జేర్చుచుంటివి. (భగవాన్ శ్రీ రమణమహర్షి యుద్దేశింపబడెను.)

21. ఆకాశమునకు ప్రభ్వివి, తల్లివి యైన నిన్ను విడువని పట్టుతో గ్రహించుచున్న యోగి మర్కటకిశోర న్యాయమున గమ్యస్థానము చేరుచున్నాడు. (స్వానుభవమును కవి పేర్కొనెను)

22. పూర్ణాత్మార్పణ హీనోఽప్యజ్ఞాతాఽపి సమాధేః ।
నిత్యం యో జగదంబ త్వాం సేవేత జపాద్యైః ॥

23. తం చాఽచంచల భక్తిం కృత్వాపూరిత కామం ।
నిష్ఠాం దాస్యసి తస్మై పౌలోమి క్రమశ స్త్వం ॥

24. భిన్నాం సంఘ సహస్రైః ఖిన్నాం శత్రుభరేణ ।
పాతుం భారత భూమిం మాతర్దేహి బలం నః ॥

25. త్రైలోక్యావన భార శ్రాంతాం వాసవకాంతాం ।
హైరంబ్యో మదలేఖా స్సమ్య క్సమ్మదయంతు ॥

---

## 3. హంసమాలాస్తబకము

1. సురుచి ర్వజ్రపాణే స్సుదృశో మందహాసః ।
హరతా న్మోహమూలం హృదయస్థం తమో మే ॥

2. అమృతం సంకిరంత్యా ప్రసరంత్యేహ దృష్ట్యా ।
సురరాజ్ఞీ బలాఢ్యాం భరతక్ష్మాం కరోతు ॥

3. అమృతాంభః కిరంతీ కరుణాంభో వహంతీ ।
నతరక్షాత్త దీక్షా శచిమాత స్తవేక్షా ॥

22. ఓ తల్లీ! పూర్ణముగా నాత్మార్పణ చేయనివాడైనను, సమాధి యందు జ్ఞానము లేనివాడైనను, యెవడు నిన్ను జపాదులతో నిత్యము సేవించుచుండునో,

23. ఓ యింద్రాణీ, వానిని నీ వచంచలభక్తిగలవానిగా జేసి, సర్వ కామనులను దీర్చి, వానికి క్రమముగా (ఆత్మ) నిష్ఠ నిత్తువు. (ఇదియు స్వానుభవమే)

24. ఓ తల్లీ! వేలకొలది సంఘములుగా విచ్ఛిన్నమై, శత్రు భార ముచే ఖిన్నులైన భారత దేశమును రక్షించుటకు మాకు బల మిమ్ము.

25. ముల్లోకములను భరించుటచే నలసియున్న ఇంద్రాణికి గణపతి యొక్క యీ మదలేఖావృత్తములు లెస్సగా ముదము గూర్చు గాక.

---

1. మిగుల కాంతిమంతములగు ఇంద్రాణీ మందహాసములు మోహ కారణమైయున్న నా హృదయమందలి యజ్ఞానమును నశింపజేయుగాక.

2. అమృతమును జిమ్ముచు, నీ లోకమందు ప్రసరించు ఇంద్రాణీ దృష్టి (వెన్నలతో పోలిక) భారతభూమికి బలమిచ్చుగాక.

3. ఓ తల్లీ! అమృతోదకమును జిమ్మునట్టిది, కారుణ్యోదకమును వహించునట్టిది, నరులను రక్షించుటకు దీక్ష బూనినది నీ చూపగుచున్నది.

4. కృత పీయూష సృష్టి స్తత కళ్యాణ సృష్టిః ।
విహితైనో విసష్టి ర్ధృత విజ్ఞాన పుష్టిః ॥

5. భృత దేవేంద్ర తుష్టి ర్యమినాం దేవ గృష్టిః ।
మమ కామ్యానిదేయా త్తవ విశ్వాంబ దృష్టిః ॥

6. జగతాం చక్రవర్తి న్యసితస్తే కటాక్షః ।
జలదో భక్తిభాజాం శిఖినాం నర్తనాయ ॥

7. సుకృతీ కోపి నాట్యే బహుళే త్వత్ర మాతః ।
జగతే సార భూతా నుపదేశా న్కరోతి ॥

8. అపరో నవ్యకావ్యా న్యనవద్యాని ధన్యః ।
విదధా త్యప్రయత్నా ద్బుధ భోగక్షమాణి ॥

9. ఇతరో భాగ్యశాలీ రమణీయైః ప్రసంగైః ।
వితనోతి స్వజాతిం జగతి శ్రేష్ఠ నీతిం ॥

4. అమృతమును సృష్టించునట్టిది, మంగళములను నిర్మించునది, పాపములను ధ్వంస మొనర్చునది, విజ్ఞానమును బోషించునది,

5. దేవేంద్రునకు సంతుష్టి గలిగించునది, నియమము గలవారికి కామధేనువు (దేవగృష్టి) వంటిదియైన నీ దృష్టి నా కోర్కెలను దీర్చుగాక.

6. ఓ తల్లీ! నీ నల్లనైన కటాక్షము భక్తులనెడి నెమిళ్ల నాట్యము కొఱకు మేఘమగుచున్నది.

(కారుమేఘము నెమిళ్లకు ప్రీతియై నాట్యమునకు ప్రేరేపించును. భక్తులు నెమిళ్లతోడను, దేవీకటాక్షము కాటుక కంటి సంబంధమై కారుమేఘముతోడను పోలిక.)

7. ఓ మాతా! విస్తారమైన ఆ నాట్యములో నొకానొక పుణ్య పురుషుడు జగత్తుకొఱకు శ్రేష్ఠమైన ఉపదేశము జేయును.

(ఇది దేవీ కటాక్షప్రేరణమున చేయబడునని భావము. శ్రీరమ ణోపదేశమును కవి ధ్వనింపజేసెను.)

8. ధన్యుడగు మఱియొకడు పండితుల యాస్వాదము కొఱ కప్రయ త్నముగా ననింద్యమైన నూత్న కావ్యములను రచించును.)

(కవి తనయందా దేవీ కటాక్షము బొందిన కార్యరూపమును బేర్కొనెను.)

9. భాగ్యశాలియైన నింకొకడు రమ్యప్రసంగములచే జగత్తునందు తమ జాతివారిని శ్రేష్ఠమైన నీతిమంతులుగా చేయును.

(కల్నల్ ఆల్కాటుద్వార ధ్వనించుచుండెను.)

10. జగతాం మాతరేకో మహసా పుణ్యశాలీ ।
విధుతారిః స్వదేశం కురుతే వీతపాశం ॥

11. పర ఇంద్రాణి సాధు ర్భత విస్మృత్య విశ్వం ।
రమతే సిక్తగండః ప్రమదాశ్రు ప్రతానైః ॥

12. తవరాగార్ద్ర దృష్ట్యా దివి శక్రస్య నాట్యం ।
కరుణా సిక్త దృష్ట్యా భువి భక్తస్య నాట్యం ॥

13. తవ సప్రేమ దృష్టి ర్బల మింద్రే దధాతి ।
తవ కారుణ్య దృష్టి ర్బల మస్మాసు ధత్తాం ॥

14. తవ వామాః కటాక్షాః ప్రభు మానందయంతు ।
ఉచితో దక్షిణానా మయమ స్త్వీక్షణానాం ॥

15. సుకృతానాం ప్రపోషం దురితానాం విశోషం ।
కరుణార్ద్రా విభాంతీ తవ దృష్టిః క్రియాన్నః ॥

16. కుసుపాదాబ్జ బంధో స్సరణిం నిస్తమస్కాం ।
శచి విజ్ఞాన తేజః కిరతా వీక్షితేన ॥

17. క్రియ యారాధయంతో భువనే తే విభూతీః ।
ఇహ కేచిల్లభంతే తవ మాతః కటాక్షాన్ ॥

10. ఓ మాతా! పుణ్యాత్ముడైన వేఁడొకడు తన తేజస్సుచే శత్రువులను బారదోలి, నిజదేశమును దాస్యబంధమునుండి విడిపించుచున్నాడు. (గాంధీమహాత్ముడు.)

11. ఓ యింద్రాణీ! సాధువైన మఱియొకడు విశ్వమును మరచి యానంద బాష్పములచే తడుపబడిన చెక్కిళ్లతో క్రీడించుచుండును. ఆశ్చర్యము! (అరవిందుడు)

12. ఓ దేవీ! నీ యనురాగ దృష్టిచే స్వర్గమందు దేవేంద్రునకు నాట్యము, నీ కరుణార్ద్ర దృష్టిచే భూమియందు భక్తునకు నాట్యము అగును.

13. నీ దృష్టి ప్రేమతోఁగూడి యింద్రునకు బలమిచ్చును, కారుణ్యముతోఁగూడి మాకు బలమిచ్చునుగాక.

14. నీ వామ (వక్ర, రమ్య) కటాక్షము లింద్రుని యానందపరచును. నీ దక్షిణ (ఉదార) కటాక్షములకు ఈ జను డుచితుడగుగాక.

15. కరుణతోఁ బ్రకాశించు నీ చూపు మా పుణ్యముల నభివృద్ధిపరచి, మా పాపములను క్షయము చేయుగాక.

16. ఓ శచీ! విజ్ఞాన తేజస్సును బ్రసరింపజేయు నీ చూపు నీ పాదాబ్జములను నమ్మియున్న నా మార్గమును తమస్సు లేనిదిగా నొనర్చుగాక.

17. ఓ తల్లీ! భువనమందుగల నీ విభూతులను క్రియచే నారాధించు కొందఱు నీ కటాక్షము నీ లోకములోనే పొందుచున్నారు.

18. స్ఫుట విజ్ఞానపూర్వం ప్రభజే రన్యది త్వాం ।
స్థిరయా దేవి భక్త్యా కిము వక్తవ్య మీశే ॥

19. కువిధే ర్విస్మరంతీ భరతక్ష్మా శచి త్వాం ।
బహుకాలా దభాగ్యే పతితా దేవ్యయోగ్యే ॥

20. అభిషిక్తస్య మాతా తవ తేజోంశ భూతా ।
సుదశాం సేవమానా మనయ త్పశ్చి మాశాం ॥

21. అయి కాలం కియంతం దయసే పశ్చిమస్యాం ।
ఇత ఇంద్రాణి పూర్వా మవలోక స్వ దీనాం ॥

22. న వయం పశ్చిమస్యా శ్శచి యాచామ నాశం ।
కృపయైతాంచ పూర్వాం నిహతాశా మవాశాం ॥

23. సకలం వ్యర్థమాసీ దయి దీనేషు దృష్టా ।
తవ విశ్వస్య మాతః కరుణైకాఽవ శిష్టా ॥

24. సురరాజస్య కాంతే నరసింహాస్యసూనుం ।
బలవంతం కురుత్వం భరతక్ష్మాఽవనాయ ॥

25. రుచిరాభిర్నిజాభి ర్గతిభిర్హ్లాదయంతు ।
మరుతాం భర్తు రేతా స్తరుణీం హంసమాలాః ॥

18. దేవీ ! స్థిర భక్తితో స్ఫుటమైన విజ్ఞానముతో నిన్ను భజించు వారుకూడ నీ కటాక్షమును బొందుదురని వేఱేచెప్ప నేల ?

19. ఓ శచీ ! దురదృష్టమువలన నిన్ను మరచిన భారతభూమి చాల కాలమునుండి అయోగ్యమై, యభాగ్యదశకు పతనమయ్యెను.

20. అభిషిక్తుని తల్లివై (విక్టోరియా రాణి), నీ తేజోంశవలనజన్మించిన యామె తనను సేవించు పశ్చిమవాసులను మంచి దశకు తెచ్చెను.

21. ఓ యింద్రాణీ ! ఎంతకాలము పశ్చిమ దిక్కుపట్ల దయగా నుందువు. ఈ దీనురాలైన పూర్వదిక్కును చూడుమా.

22. ఓ శచీ ! మేము పశ్చిమదిక్కుయొక్క నాశమును యాచించ లేదు. నిరాశజెందియున్న పూర్వదిక్కును కృపతో రక్షింతువని మాయాశ.

23. ఓ తల్లీ ! ఈ దీనుల విషయమై సమస్తము వ్యర్థమైపోయెను. చూడగా, నీ దయయొక్కటి మిగిలియున్నది.

24. ఓ తల్లీ ! నీవు నరసింహ సూనుడగు గణపతిని భరతభూమి రక్షణకొఱకు బలముగలవానిగా జేయుము.

25. ఈ హంసమాలా వృత్తములు మనోహరమగు స్వకీయగతులచే నింద్రాణిని సంతోషపరచుగాక.

## 4. మధుమతీ స్తబకము

1. దిశి దిశి ప్రసర ద్రుచి తమో దమనం ।
హరతు మే దురితం హరి వధూ హసితం ॥

2. హరతు దుఃఖభర ప్రసృత మశ్రుజలం ।
భరత భూసుదృశో బలజితో రమణీ ॥

3. అతితరాం మహితా సురపతే ర్వనితా ।
కరుణయా కలితా మమ శచీ శరణం ॥

4. త్రిభువన క్షితి రా డ్భవన భూషక భా ।
అఖిల భాసక భా మమ శచీ శరణం ॥

5. సతత యుక్త సుధీ హృదయ దీపక భా ।
నిఖిల పాచక భా మమ శచీ శరణం ॥

6. రవి విరోచక భా శశి విరాజక భా ।
భగణ శోభక భా మమ శచీ శరణం ॥

7. గగన ఖేలక భా సకల చాలక భా ।
అమృత దాయక భా మమ శచీ శరణం ॥

1. అన్ని దిక్కులందు ప్రసరించు కాంతి గలిగి, యజ్ఞానమును బోగొట్టు ఇంద్రాణీ మందహాసము నా పాపములను హరించు గాక.

2. దేవేంద్రుని భార్యయైన ఇంద్రాణి భారతభూమియనెడి కాంత యొక్క దుఃఖభారముచే ప్రవహించు కన్నీటిధారలను హరించు గాక.

3. అత్యంత పూజితురాలు, దేవేంద్రునకు భార్యయై దయతో నిండినది యగు శచీదేవి నాకు శరణము.

4. త్రైలోక్యాధిపతియైన ఇంద్రునియొక్క భవనమగు అమరావతి నలంకరింపజేయు కాంతిగలది, నిఖిలమునకు తేజస్సునిచ్చు కాంతిగలది యగు శచీదేవి నాకు శరణము.

5. నిత్యము యోగయుక్తులై యుండు పండితుల హృదయములకు జ్యోతియగుచు, నిఖిలమును పచనమొనర్చు శచీదేవి నాకు శరణము.

6. సూర్యుని ప్రకాశింపజేయు రోచిస్సులుగలది, చంద్రునియందు విరాజమాన కాంతిగలది, నక్షత్రములయందు శోభనిచ్చు కాంతిగలది యైన శచీదేవి నాకు శరణము.

7. గగనమందు క్రీడించు కాంతి, సకలమును చలింపజేయు కాంతి, అమృతమునిచ్చు కాంతిగల శచీదేవి నాకు శరణము.

8. రుచిలవంగతయా య దనఘాంశు నిధేః ।
హృత తమో భవనం భవతి దీపికయా ॥

9. స్ఫురతి చారు యతః కిరణమేక మితా ।
జలద సౌధతలే ముహురియం చపలా ॥

10. భజతి యద్ద్యుతితః కమపి భాగ మితః ।
పవి రరాతి హరః ప్రహరణేశ పదం ॥

11. భవతి యత్సురుచే రణుతమాంశ మితా ।
యువ మనో మదనీ సువదనా స్మితభా ॥

12. వితత సూక్ష్మతను ర్మహతి సా గగనే ।
పరమ పూరుష భా మమశచీ శరణం ॥

13. అమరనాథ సఖీ రుచి నిధాన ముఖీ ।
అమృత వర్షక దృ గ్మమ శచీ శరణం ॥

14. అవిధవా సతతం యువతిరేవ సదా ।
అనఘ వీరసుతా మమశచీ శరణం ॥

8. పాపరహితకిరణములకు నిధియగు నేదేవి తన కాంతిలేశముచే గల్పించిన దీపమువల్ల గృహమునందలి (అనగా విద్యుద్దీపము) చీకటిని నశింపఁజేయుచున్నదో,

9. ఏదేవియొక్క కాంతినుండి యొక్కకిరణమును బొందిన మెఱుపు యీ మేఘమనెడి సౌధతలమందు మాటిమాటికి సొగసును స్ఫురింపజేయుచున్నదో,

10. ఏ దేవియొక్క కాంతినుండి స్వల్పభాగమునుబొందిన వజ్రము శత్రునాశనమొనర్చు నాయుధములలో మేటిపదను బొందు చున్నదో,

11. ఏ దేవియొక్క కాంతిలోని యణుశమాంశనుబొంది, స్త్రీల యొక్క నగవు కాంతి యువకుల మనస్సుల మదింపఁజేయు చున్నదో,

12. గొప్పదైన ఆకాశమందు వ్యాపించిన సూక్ష్మదేహముగలది, పరమపురుషుని బ్రకాశింపజేయు చిద్రూపిణియునగు ఆ శచీదేవి నాకు శరణము.

13. ఇంద్రసఖియు, కాంతులకు నిధియైన ముఖము గలదియు, అమృతమును వర్షింపజేయు చూపులుగలదియైన శచీదేవి నాకు శరణము.

14. నిత్యసువాసిని, సదాయౌవనముగలది, పాపరహితులైన వీరులు పుత్రులుగా గలదియైన శచీదేవి నాకు శరణము.

15. అమృత వత్యధరే సురధరా పతయే ।
చరణయోర్భజతే మమ శచీ శరణం ॥

16. స్మితలవేషు సితా శిరసిజే ష్వసితా ।
చరణయో రరుణా బహిరపి త్రిగుణా ॥

17. కపట చంద్రముఖీ ప్రకృతి రింద్రసఖీ ।
మృతి జరా రహితా మమ శచీ శరణం ॥

18. కృశతమే ప్యుదరే త్రిభువనం దధతీ ।
జనిమతాం జననీ మమ శచీ శరణం ॥

19. స్థిరతరా మనసి స్థిరతమా వచసి ।
నయనయో స్తరళా మమ శచీ శరణం ॥

20. మృదుతరా కరయో ర్మృదుతమా వచసి ।
కఠిన దుగ్ధ ధరా మమ శచీ శరణం ॥

21. మృదుల బాహులతా ప్యమిత భీమ బలా ।
అసుర దర్పహరీ మమ శచీ శరణం ॥

22. అబలయాపి యయా న సదృశోఽస్తి బలే ।
జగతి కశ్చన సా మమ శచీ శరణం ॥

15. ఇంద్రుని కొఱకు అధరమునందును, భక్తునికొఱకు పాదములందు నమృతమును ధరించిన శచీదేవి నాకు శరణము.

16. మందహాసమందు తెల్లగాను, కేశములందు నల్లగాను, పాదములం దెఱ్ఱగాను బాహ్యమందుగూడ నిట్లు త్రిగుణ యగుచున్నది.

17. చంద్రముఖియును, ఇంద్రసఖియు, జనన మరణములులేని మూలప్రకృతియు నగు శచీదేవి నాకు శరణము.

18. మిక్కిలి చిన్న ఉదరమందైనను త్రిభువనములను ధరించుచు జీవకోటికి తల్లియగు శచీదేవి నాకు శరణము.

19. మనస్సునం దతి స్థిరమైనది, వాక్కునం దత్యంత స్థిరమైనది, నేత్రములందు మాత్రము చాంచల్యము గలదియైన శచీదేవి నాకు శరణము.

20. అతి మృదుకరములు, అత్యంత మృదువాక్కులు, కఠిన కుచములు గల శచీదేవి నాకు శరణము.

21. మృదుహస్తములైనను, నమిత బలపరాక్రమములు గలిగి యసురుల గర్వము నణచిన శచీదేవి నాకు శరణము.

22. అబలయైనను, బలమునకే దేవి కీజగత్తులో నెవ్వడు సాటి కాడో. అట్టి శచీదేవి నాకు శరణము.

23. అతితరాం సదయా పదరతే మనుజే ।
ఖలజనే పరుషా మమశచీ శరణం ॥

24. అమర భూమిపతి ప్రియతమే కురు మే ।
భరత భూమ్యవన క్షమతమాం ధిషణాం ॥

25. మధుర శబ్దవతీ ర్మధుమతీ రజరా ।
గణపతే శ్శృణుయా త్సురపతే స్తరుణీ ॥

---

23. తన పాదములం దాసక్తిగల మనుజులయందతి దయగలది, దుర్మార్గుల కతి కఠినురాలు నగు శచీదేవి నాకు శరణము.

24. ఓ తల్లీ! నాకు భారత భూమిని రక్షించుటకు మిగుల సమర్థమైన బుద్ధి నిమ్ము.

25. ముసలితనము లేని యింద్రాణి మధురశబ్దములతో కూర్చబడిన గణపతి సంబంధమగు నీ మధుమతీ వృత్తములను వినుగాక.

---

ద్వితీయం ఔష్ణిహం శతకమ్ సంపూర్ణమ్.

ఓం

తృతీయం

# అనుష్టుభం శతకమ్

## 1. పథ్యావక్త్రస్తబకము

1. హసితం తన్మహాశక్తే రస్మాకం హరతు భ్రమం ।
యత ఏవ మహాచ్చిత్రం విశ్వ మేత ద్విజృంభతే ॥

2. రాజంతీ సర్వభూతేషు సర్వావస్థాసు సర్వదా ।
మాతా సర్గస్య చిత్పాయాత్ పౌలోమీ భారతక్షితిం ॥

3. ధర్మిజ్ఞానం విభో స్తత్త్వం ధర్మజ్ఞానం సవిత్రి తే ।
వ్యవహృత్యై విభాగోఽయం వస్త్వేకం తత్త్వతో యువాం ॥

4. ఇంద్రేశ వాసుదేవాద్యైః పదైస్సంకీర్త్యతే విభుః ।
శచీ శివా మహాలక్ష్మీ ప్రముఖై ర్భవతీ పదైః ॥

5. అంతరం వస్తునోజ్ఞాతృ తచ్ఛక్తం పరిచక్షతే ।
శాఖా స్సమంతతో జ్ఞానం శక్తిం సంకీర్తయంతి తాం ॥

1. మహాశక్తియొక్క మందహాసము మా భ్రమను హరించుగాక. ఏ మందహాసమువలన గొప్పదైన, చిత్రమైన యీ విశ్వము ప్రకాశించుచున్నదో (ఆ మందహాసమని భావము).

2. సర్వభూతములందు, సర్వావస్థలందు, సర్వకాలమందు రాజిల్లునది, ప్రపంచమునకు జనని, చిత్స్వరూపిణియగు ఇంద్రాణి భారత భూమిని రక్షించుగాక.

3. ఓ తల్లీ ! ధర్మిభూతమైన ప్రజ్ఞానము ప్రభువుయొక్క తత్వమనియు, దాని ధర్మమనెడి జ్ఞానము నీ యొక్క తత్వమనియు చేయబడు విభాగము వ్యవహారమునకు మాత్రమొప్పును. తత్వరీత్యా మీరుభయులు నొకే వస్తువు.

4. ఆ ప్రభువు ఇంద్రుడు, ఈశ్వరుడు, వాసుదేవుడు మొదలుగాగల పదములచే కీర్తింపబడుచుండెను. నీవు శచీ, శివా, మహాలక్ష్మి మొదలగు పదములచే కీర్తింపబడు చుంటివి.

5. వస్తువుయొక్క ఆంతర్యము జ్ఞాత, వానిని 'శక్త'డనియు; వ్యాప్తమైన శాఖలు జ్ఞానము, దానిని 'శక్తి' యనియు కీర్తింతురు. (ఉభయుల స్వరూపము జ్ఞానమే యైనను, ప్రవృత్తిచే సర్వవ్యాప్తము నెఱుగు జ్ఞానము శక్తిసంబంధమనియు, నివృత్తిచే కేంద్రము నెఱుగునది శక్తసంబంధమనియు కీర్తింతురు. క్రియాజ్ఞాన మొకటి, కర్తృజ్ఞాన మింకొకటి. మహిమయొక్క వ్యాప్తము వలన జ్ఞాన మిట్లు విభాగమయ్యెను.)

6. అంతరస్యచ శాఖానా మైక్యం నిర్విషయస్థితౌ ।
విషయ గ్రహణేష్వేవ స విభాగః ప్రదృశ్యతే ॥

7. స్యాదేవం విషయాపేక్షీ శాఖానామంతరస్యచ ।
అవిభక్తైక రూపాణాం విభాగో హరితామివ ॥

8. లక్ష్యమంతర్వయం చక్రే ధ్యాయామో యత్ర నిష్ఠితాః ।
అంతరీభావత స్తస్య నాంతరంతు విలక్షణం ॥

9. అహంకృతే ర్వయం నాన్యే యత్రాహంకృతి సంభవః ।
సంపద్యేతాంతరం తత్ర జ్ఞానస్య జ్ఞాతృతావహం ॥

6. అంతర్యామునకు, శాఖలకు నైక్యము నిర్విషయస్థితిలోనే కలదు. విషయములను గ్రహించునప్పుడు మాత్రము వాని విభాగము గోచరించుచున్నది.

(చిత్తవృత్తి యను విషయము జనించినప్పుడు వృత్తిజ్ఞానము, విషయిగా 'నే' నను పుట్టు జ్ఞానము నొకదానివెనుక నింకొకటిగా కలుగును.)

7. శాఖలకును, అంతర్యామునకును విభాగము విషయముల నపేక్షించియుండును (విషయజ్ఞానమని, విషయిజ్ఞానమని విభాగము). విభజింపనలవిగాని యేకరూపమును (అంతర్యామును) విభజించుట దిక్కులను విభజించినట్లుండును.

(విషయస్ఫూర్తి లేనప్పుడు విషయిస్ఫూర్తియునుండక మిగులునది యవిభాజ్యమని తాత్పర్యము.)

8. ఏ చక్రమందు నిష్ఠ గలిగి (మూలాధారము) నేమంతర్లక్ష్యమును ధ్యానించుచుంటిమో, దానియొక్క అంతరీభావము వలన నాంతర్యమందు విలక్షణమగుటలేదు.

(విషయత్వదశ మొదట మూలాధారమందగును. స్థూల శరీర సంపర్కముచే)

9. ఎచ్చట 'అహంకృతి' పుట్టుచున్నదో, అచ్చట అహంకృతివలన మేము పుట్టుచున్నాము. అన్యులము కాదు. జ్ఞానమునకు జ్ఞాతృత్వమొందించు నాంతర్యమచ్చటనే సంభవించుచున్నది.

(అహంకృతి యనగా శరీరము తానను భావము. ఇది పుట్టు చోటనే 'అహం' మూలము నెఱుగు వారి కాంతర్యముగూడ తెలియబడుచున్నది.)

10. అంతరావర్త భూయస్త్వా దేకస్మిన్ బోధసాగరే ।
బోద్ధారో బహవోఽభూవ న్వస్తు నైవతు భిద్యతే ॥

11. చిద్రూపే మాతరేవం త్వం పరస్మాద్బ్రహ్మణో యథా ।
నదేవి దేవతాత్మభ్యో జీవాత్మభ్యశ్చ భిద్యతే ॥

12. సమస్త భూతబీజానాం గూఢానామంతరాత్మని ।
తవోద్గారోఽయ మాకాశో మాతనూన్సూక్ష్మరజోమయః ॥

13. న సర్వభూత బీజాని వస్తూని స్యుః పృథక్ పృథక్ ।
త్వయి ప్రాగవిభక్తాని బభూవురితి విశ్రుతిః ॥

14. యథాంబ స్మృతి బీజానాం ప్రజ్ఞాయా మవిశేషతః ।
తథాస్యా ద్భూతబీజానా మవిభక్త స్థితి స్త్వయి ॥

10. ఒక్కటైన జ్ఞానసముద్రమం దాంతర్యముల నెడి సుడులయొక్క బాహుళ్యముచే పెక్కుమంది జ్ఞానులు పుట్టుచున్నారు. వస్తువు మాత్రము భిన్నము కాలేదు.

(సుడియం దాకారభానముచే వస్తువు వేఱైనట్లుండును. త్రిపుటియు సంభవించును. నిజమునకు సుడియందు సముద్రము కంటె వేఱు వస్తువు లేదు )

11. ఓ దేవి ! ఈ విధముగా నీవు పరబ్రహ్మనలెనే దేవతాత్మల కంటె, జీవాత్మలకంటె భిన్నము గావని తెలియుచున్నది.

12. ఓ తల్లీ ! గూఢములైన సకల భూత బీజములయొక్క అంత రాత్మలందు సూక్ష్మరజోమయమైన ఈ యాకాశము నీవల్లనే పుట్టెను.

(బీజరూపములు కూడ వాసనాస్మృతులవలె సూక్ష్మములైనను, ఆకారములుగలవి; వాని కాంతర్యమున నున్న యాకాశము రజస్సుచే వ్యక్తస్థితి బొందినను నిరాకారము)

13. భూతబీజవస్తువులు వేఱ్వేఱుగా లేవు. వస్తుసృష్టికి పూర్వమవి నీయందవిభక్తముగా నున్నవని శ్రుతి వచించుచున్నది.

(బీజస్మృతి రూపములు తొలగినప్పుడు బీజవస్తు వేకమై, దేవి కవిభక్త మగును.)

14. ఓ యంబా ! ఏ విధముగా స్మృతి బీజములస్థితి ప్రజ్ఞానమందు విశేషము జెందుటలేదో, ఆ విధముగా భూత బీజములస్థితి నీ యందవిభక్తమై యుండును.

(మనయందున్న వ్యష్టిస్మృతులకు, సమిష్టియందు గోళాదుల సూక్ష్మస్మృతులకు నిద్రస్థితియందు పోలిక. వ్యక్తముగాని

15. నాఃఙాని భూతబీజాని ప్రాక్సర్గా త్త్వయి సంస్థితౌ ।
చితిశక్త్యాత్మకాన్యేవ నిరాకారాణి సర్వదా ॥

16. అనాది చేదిదం విశ్వం స్మరణాత్తవ సర్జనం ।
సాదిచే దాదిమ స్సర్గో వక్తవ్య స్తవ కల్పనాత్ ॥

17. విధాతుం శక్నుయా త్వంవి దభూతస్యాపి కల్పనమ్ ॥
కల్పితస్యైకదా భూయ స్సర్జనావసరే స్మృతిః ॥

స్థితియందు స్మృతులు మన ప్రజ్ఞానమందు లీనమై, భేదము జెందక యున్న స్థితి యిది.)

15. అణువుల క్రింద విభజింపబడని భూతబీజములు సృష్టికిపూర్వము నీ యందు చిచ్ఛక్తి రూపముతో నుండి యన్నివిధముల నిరాకారమైయున్నవి.

(అనగా బీజద్రవ్యము వాసనలుగా నేర్పడక పూర్వము శక్తి స్వరూపమై యుండెనని భావము.)

16. ఓ దేవీ! ఈ విశ్వమనాది యనినచో, నీ స్మృతి వలన సృష్టి కలిగి యుండవలెను. విశ్వమున కాదిగలదనిచో, ప్రథమసృష్టి నీ కల్పనవల్లనే వ్యక్తమై యుండవలెను.

(అనాదియనువారు విశ్వస్మృతులు వ్యక్తావ్యక్తస్థితులుగామారి సృష్టిస్థితి లయములకు కారణమగుచు నిరంతరమిట్లే యవస్థా భేదముచే నున్నవందురు. అవి యెప్పుడు రూపములుగా మొట్ట మొదట కల్పింపబడునో చెప్పశక్యముగాదనియు, వానియొక్క స్మృతి దేవి కైనపుడెల్ల క్రొత్తగా వచ్చినట్లు పాతవిశ్వమే పునర్వ్యక్తమగుననియు చెప్పుదురు.)

17. పుట్టుకను కల్పించుశక్తిగలిగి సంవిత్తున్నది. కల్పితమైన దానిని తిరుగసృష్టింప నవసరమైనప్పుడు శక్తి స్మృతిరూపిణి యగును.

(ఒకటి క్రొత్తసృష్టి చేయగలదు, ఇంకొకటి పాత విశ్వవాసనలను ధరించి వ్యక్తపరచుచుండును. మొదటిదైన సంవిత్తు కేవలశక్తి, రెండవది విశ్వసంబంధమగు విద్యుత్తు.)

18. చితే రస్మా దృశాం వీర్యం స్వప్నేచే ద్విశ్వకారణం ।
చితే స్సమష్టి భూతాయాః ప్రభావే సంశయః కుతః ॥

19. మాత స్సమష్టి చిద్రూపే విభూతిర్భువనం తవ ।
ఇహ వ్యష్టి శరీరేషు భాంతీ తదను పశ్యసి ॥

20. త్వం బ్రహ్మ త్వం పరాశక్తి స్త్వం సర్వా అపి దేవతాః ।
త్వం జీవా స్త్వం జగత్సర్వం త్వదన్యన్నాస్తి కించన ॥

21. సతీచిదంబ నైవ త్వం భావ భావ విలక్షణా ।
శక్తి శక్తి మతో ర్భేద దర్శనా దేవ విభ్రమః ॥

22. తవాంబ జగతశ్చాస్య మృత్తికా ఘటయోరివ ।
సంబంధో వేదితవ్యస్స్యా న్న రజ్జుఫణినో రివ ॥

18. మావంటివారల చిత్తముయొక్క బలమే స్వప్నమందు విశ్వ నిర్మాణమునకు కారణము కాగలిగినప్పుడు (క్రొత్తరూపములను నిర్మించ గలిగినప్పుడు), సమష్టి భూతముగానున్న చిత్తముయొక్క ప్రభావమును గుఱించి సంశయమేల ?

(ప్రతిజన్మయందు మనమొనర్పగల్గునది ప్రారబ్ధవశమువల్లనే యను మాటకూడ దీనివలన ఖండింపబడినట్లగును.)

19. ఓ తల్లీ ! అందువలన భువనము నీ విభూతియే (కల్పనమే). ఇచ్చట వ్యష్టి శరీరములందు నీవు ప్రకాశించుచు, దానిని (భువనమును) అనుసరించి చూచుచుంటివి.

(సమష్టి విశ్వము సంవిత్కల్పనము ; వ్యష్టిశరీరమందు ప్రత్యేక స్మృతియున్నను, సంవిత్తున్నది. అది సమష్టియందువలెనే కల్పించగలదని భావము.)

20. ఓ దేవీ ! నీవే బ్రహ్మవు, నీవే పరాశక్తివి, నీవే సర్వదేవతా స్వరూపిణివి. జీవుల స్వరూపము నీవే, సర్వజగత్తు నీవే. నీకంటె భిన్నముగా నేదియు లేదు.

21. ఓ యంబా ! చిద్రూపిణివైన నీవు భావభావమందు భిన్నముగా లేవు. శక్తి, శక్తిమంతుడు అను భేదదృష్టివలన ఈ భ్రమ గలుగుచున్నది.

22. ఓ తల్లీ ! నీకు, జగత్తుకు మృత్తికాఘట సంబంధ మూహింప దగునుగాని రజ్జు సర్ప భ్రాంతివంటి సంబంధము తగదు.

(భ్రాంతిగల మనకీ సంబంధము కొన్నింట వర్తింపజేయవచ్చును గాని దేవికి జగత్తుకు చెప్పుట దేవికి భ్రాంతి చెప్పుట యగును.)

23. త్వం శక్తిరస్య విచ్ఛిన్నా భాన్త్యై రాత్మ విభూతిభిః ।
అంతరాస్తు మహేంద్రస్య శక్తస్య ప్రతిబింబవత్ ॥

24. శక్తిర్గణపతేః కాయే ప్రవహంతీ సనాతనీ ।
భారతస్య క్రియాదస్య బాధ్యమానస్య రక్షణం ॥

25. ఇమాని తత్త్వవాదీని వాసిష్ఠస్య మహామునేః ।
పథ్యా వక్త్రాణి సేవంతా మనంతా మభవాం చితిం ॥

---

## 2. మాణవక స్తబకము

1. శక్తతమా శక్రవధూ హాసవిభా మే హరతు ।
మానస మార్గావరకం జేతు మశక్యం తిమిరం ॥

2. భారత భూ పద్మదృశో దుర్దశయా క్షీణతనోః ।
బాష్ప మజస్రం విగళ ద్వాసవ భామా హరతు ॥

3. దండిత రక్షో జనతా పండిత గీతా వనితా ।
మండిత మాహేంద్రగృహా ఖండిత పాపా జయతి ॥

4. సద్గుణ సమ్పత్కలితం సర్వశరీరే లలితం ।
దేవపతేః పుణ్యఫలం పుష్యతు మే బుద్ధిబలం ॥

23. ఓ తల్లీ ! నీ యాత్మవిభూతులే యగు మనోభావములతో నీవు కూడి శక్తివై యుంటివి. శక్తుడైన మహేంద్రునకీ విభూతులు ప్రతిబింబములవలె అంతరమున నున్నవి.

24. గణపతిముని శరీరమందు ప్రవహించు సనాతనమైన శక్తి బాధపడుచున్న భారతభూమిని రక్షించుగాక.

25. వాసిష్ఠమునియొక్క తత్త్వవాదములగు నీ 'పథ్యావక్త్ర' వృత్తము లనంతమైనట్టి, పుట్టుకలేనట్టి చిత్తును సేవించుగాక.

---

1. అత్యంత సామర్థ్యముగల ఇంద్రాణీ మందహాసకాంతి నామనః పథము నావరించి జయింపనలవిగాక యున్న అజ్ఞానాంధకారమును హరించుగాక.

2. దుర్దశచే క్షీణించిన శరీరముగల భరతభూమి యను కాంతయొక్క యేకధారగా స్రవించు కన్నీటి నింద్రాణి హరించుగాక.

3. రాక్షస సమూహమును దండించునది, పండితులచే కీర్తింపబడునది, యింద్రుని గృహమున కలంకారమైనది, పాపములను ఖండించునదియైన వనిత ప్రకాశించుచున్నది.

4. సద్గుణసంపత్తికలది, సర్వశరీరమునందు సుందరమైనది, ఇంద్రుని పుణ్యఫలమగునదియైన దేవి నా బుద్ధిబలమును వృద్ధి జేయుగాక.

5. హాస విశేషైరలసై ర్దిక్షు కిరం త్యచ్ఛ సుధాం ।
ఇంద్ర దృగానందకరీ చంద్రముఖీ మామవతు ॥

6. ప్రేమతరంగ ప్రతిమై శ్శీతల దృష్టిప్రకరైః ః ।
శక్రమనో మోహకరీ వక్రకచా మామవతు ॥

7. గాఢరసై శ్చారుపదై ర్గూఢతరార్థై ర్వచనైః ।
కామకరీ వృత్రజితో హేమతను ర్మామవతు ॥

8. మృత్యుతనుః కాలతనో ర్విశ్వపతేః పార్శ్వచరీ ।
ప్రేత జగద్రక్షతి యా సా తరుణీ మామవతు ॥

9. ప్రేత జగత్కేచి దధో లోక మపుణ్యాం బ్రువతే ।
శీత రుచేర్నాన్యదిదం తత్త్వవిదన్యో వదతి ॥

10. భూరియ మూర్వీవసుధా వారిజవై ర్యేష భువః ।
స్వర్మహసాం రాశి రసా మేషు నరప్రేత సురాః ॥

5. మందమైన నగవుయొక్క విశేషముచే దిక్కులందు నిర్మల సుధను జిమ్మునది, యింద్రుని నేత్రముల కానంద మిచ్చునది యైన చంద్రముఖి నన్ను రక్షించుగాక.

6. ప్రేమ తరంగములతో సమమగు శీతలదృష్టులచే నింద్రుని మనస్సును మోహింపజేయునది, వక్రమైన కొప్పు గలదియైన దేవి నన్ను రక్షించుగాక.

7. గాఢరసము, మనోహరపదములు, గూఢతరమైన అర్థములుగల వాక్కులచే దేవేంద్రునకు కామము గలిగించు హేమతను దేవి నన్ను రక్షించుగాక.

8. కాలమే శరీరముగాగల ఇంద్రునకు పార్శ్వవర్తినియై, మృత్యు రూపిణియై యే దేవి ప్రేతలోకమును రక్షించుచున్నదో, ఆ స్త్రీ నన్ను రక్షించుగాక.

(కాళీరూపలక్షణము. స్థూలమును నశింపజేసి, సూక్ష్మమును గాపాడునది యని భావము.)

9. కొందఱు ప్రేతజగత్తును పాపభూయిష్ఠమగు నధోలోక మందురు. మఱియొక తత్త్వవేత్త యిది చంద్రునికంటె వేఱుకాదను చున్నాడు.

10. ఈ భూలోకము నుర్వి, వసుధయనియు, భువర్లోకమును పద్మ ములకు శత్రువైన చంద్రుడనియు, తేజోరాశియైన సూర్యుని సువర్లోకమనియు, భూలోకములో నరులు, భువర్లోకములో ప్రేతలు, సువర్లోకములో సురలు వసింతురనియు చెప్పబడును.

11. రాజతశైలం శశినః కేచిదభిన్నం బ్రువతే ।
మృత్యు యమావేవ శివా వీశ్వరి తేషాంతు మతే ॥

12. రాజతశైలః పితృభూ రోషధిరాడేష యది ।
కాంచనశైల స్సురభూ ర్బంధురసౌ వారిరుహాం ॥

13. పావయ భూమిం దధతః పావకకాయస్య విభోః ।
భామిని భావానుగుణే సేవక మగ్నాయి తవ ॥

14. యస్య యమో భూతపతి ర్బుద్ధిమతస్తస్య మతేః ।
అగ్నిరుపేంద్రో మఘవా కాంచనగర్భో భగవాన్ ॥

15. యస్య మహాకాలవపూ ర్మృత్యురపి ద్వే న విదః ।
త్వం శచి మేధాఽస్యమతే పావకశక్తిః కమలా ॥

16. నామసు భేదోఽస్తు ధియా మీశ్వరి నిష్కృష్ట మిదం ।
సూర్యధరేందు ష్వజరే త్వం త్రితను ర్భాసి పరే ॥

17. సాత్త్వికశక్తి స్సవిత ర్యాదిమరామే భవసి ।
రాజసశక్తిర్భువి న స్తామసశక్తి శ్శశిని ॥

11. ఓ యీశ్వరీ! కొందఱు కైలాసము చంద్రునికంటె వేఱు కాదందురు. వారి మతములో పార్వతి మృత్యురూపిణి, శివుడు యముడు (కాలరూపుడు) అగుదురు.

12. కైలాసము పితృభూమియనియు (శ్మశానము), అదియే చంద్రుడనియు చెప్పుదురు. మేరువు దేవతల భూమియనియు, నది సూర్యుడే యనియు చెప్పుదురు.

13. భూమిని ధరించుచు, అగ్నియే శరీరముగాగల విభుని భావముల కనుగుణమైన యో స్వాహాదేవీ! నీ సేవకుని పవిత్రునిఁ జేయుము. (అగ్నాయి=అగ్నిపత్ని)

14. ఎవని మతములో భూతపతియైన యీశ్వరుడు యముడో, ఆబుద్ధిమంతుని మతములో అగ్నియే ఉపేంద్రుడగును (విష్ణువు), హిరణ్యగర్భుడే యింద్రుడగును. (జిష్ణువు. అనగా సూర్యాధిష్ఠాన పురుషుడు)

15. ఎవని మతములో మహాకాలుని భార్య మృత్యువైనను ద్వివిధముగా లేదో (సంహార నిర్మాణములకు రెండు రూపములు గలదిగా లేదో), వాని మతమందో శచీ! నీవు తెలివిగాను, నీవే యగ్ని శక్తిగాను, లక్ష్మిగాను చెప్పబడుచుంటివి.

16. ఓ జననీ! నామభేదములుండుగాక. ఇది మాత్రము నిశ్చయము- నీవే సూర్య, భూ, చంద్రులందు మూడు శరీరములలో ప్రకాశించుట (నిశ్చయమని అన్వయము.)

17. ఓ తల్లీ! నీవు సూర్యునియందు సాత్వికశక్తిగాను, మా భూమియందు రాజసశక్తిగాను, చంద్రునియందు తామసశక్తిగా నుంటివి.

18. సర్వగుణా సర్వవిభా సర్వబలా సర్వరసా ।
సర్వమిదం వ్యాప్యజగ త్కాఽపి విభాంతీ పరమా ॥

19. వ్యోమతను ర్నిర్వపుషో దేవి సత స్త్వం దయితా ।
అస్యభియుక్తై ర్విబుధై రంబ మహేశ్వర్యుదితా ॥

20. సా ఖలు మాయా పరమా కాగణమీశం వదతాం ।
సా ప్రకృతి స్సాంఖ్యవిదాం సా యమినాం కుండలినీ ॥

21. సా లలితా పంచదశీ ముత్తమ విద్యాం జపతాం ।
సా ఖలు చండీ జననీ సాధు నవార్ణః భజతాం ॥

22. సా మమ శచ్యాః పరమం కారణరూపం భవతి ।
కార్య తను ర్దివి శక్రం సమ్మదయంతీ లసతి ॥

23. వ్యోమతనో స్సర్వజగ చ్చాలన సూత్రంతు వశే ।
నిర్వహణే తస్య పున ర్దివ్య తను స్త్రీ త్రితయం ॥

24. పాతుమిమం స్వం విషయం హంత చిరాన్నిర్విజయం ।
కింకర మీశే విభయం మాం కురు పర్యాప్తశయం ॥

18. సర్వగుణములు, సర్వ తేజస్సులు, సర్వబలములు గల్గి యీ సర్వ జగత్తును వ్యాపించి, ప్రకాశించు నొకానొక ఉత్కృష్టమైన దానవు నీవు.

19. ఓ తల్లీ! ఆకాశ శరీరిణివైన నీవు శరీరము లేని సద్వస్తువునకు భార్యవైతివి. యుక్తిగల పండితులచే నీవు మహేశ్వరివని చెప్ప బడుచుంటివి.

20. ఈశ్వరుడే కారణమని చెప్పువారి కామె పరమమైన మాయ యగుచున్నది. సాంఖ్యవాదుల కామె ప్రకృతియై, యోగులకు కుండలినీ యగుచున్నది.

21. 'పంచదశి' యను నుత్తమ విద్యను జపించువారి కామె లలిత యగుచున్నది. శ్రేష్ఠమైన నవార్ణమంత్రమును భజించువారి కామె చండి యగుచున్నది. (నవార్ణమంత్రములో 9 అక్షరము లుండును. అర్ణము అనగా వర్ణము.)

22. ఆ చండి శచీదేవియొక్క ఉత్తమమైన కారణరూపమై నా సంతోషముకొఱకును, కార్యశరీరమై స్వర్గమం దింద్రుని సంతోషముకొఱకును ప్రకాశించుచున్నది.

23. వ్యోమమే శరీరముగాగల యీమె సర్వజగత్తులయొక్క చాలన సూత్రమును వశమొనర్చుకొని తిరుగ (సృష్టి) నిర్వహించుటకై దివ్యతనువులుగల స్త్రీత్రయమగుచున్నది.

24. ఓ తల్లీ! చిరకాలమునుండి జయము లేని ఈ స్వకీయ దేశమును రక్షించుటకు యీ సేవకుని భయరహితునిగాను, సమర్థునిగాను జేయుము.

25. చారుపద క్రీడనకై ర్మాతరిమై ర్మాణవకైః ।
చేతసి తే దేవనుతే ప్రీతి రమోఘా భవతు ॥

---

## 3. చిత్రపదాస్తబకము

1. అప్యలసో హరిదంత ధ్వాంత తతేరపి హర్తా ।
అస్తు మహేంద్ర పురంధ్రీ హాసలవ శ్శుభకర్తా ॥

2. పాహి పరైర్హృతసారాం నేత్రగళ జ్జలధారాం ।
భారతభూమి మనాథాం దేవి విధాయ సనాథాం ॥

3. చాలయతా సురరాజం పాలయతా భువనాని ।
శీలయతా సతరక్షాం కాలయతా వృజినాని ॥

4. లాలయతా మునిసంఘం కీలయతా దివి భద్రం ।
పావయ మాం సకృదీశే భాసుర దృక్ప్రసరేణ ॥

5. సర్వ రుచామపి శాలాం త్వాం శచి మంగళ లీలాం ।
కాలకచా ముతకాళీం పద్మముఖీ ముత పద్మాం ॥

6. యస్స్మరతి ప్రతికల్యం భక్తి భరేణ పరేణ ।
తస్య సురేశ్వరి సాధ్వో రస్మి పదాబ్జ భజిష్యః ॥

25. ఓ తల్లీ! సొగసైన పదక్రీడనగల యీ 'మాణవక' వృత్తములచే నీ హృదయమం దమోఘప్రీతి గలుగుగాక.

---

1. మందమైనను, దిక్కుల మూలమూలలనుండు చీకట్లను నశింప జేయు ఇంద్రాణీహాసలవము నాకు శుభ మొనర్చుగాక.

2. ఓ దేవీ! శత్రువులచే సారము హరింపబడి, నేత్రములనుండి నీటిధారలను స్రవించు భారతభూమియను ననాథను సనాథగా జేసి రక్షింపుము.

3. దేవేంద్రుని చలింపజేయునది, భువనములను పాలించునది, నమ్రులను రక్షించు శీలముగలది, పాపములను ధ్వంస మొనర్చునది,

4. మునులను లాలించునది, స్వర్గమందు మంగళములను నెల కొల్పునదియునైన నీ దృక్ప్రసారముచే నొక్కసారి నన్ను (చూచి) యీశ్వరీ! పవిత్రము గావింపుము.

5. ఓ శచీ! సకలకాంతులకు నిలయమై, మంగళప్రదమగు లీలలు గలదానవై, నల్లని కొప్పుగలిగి 'కాళీ' యనియు, పద్మమువంటి ముఖముగలిగి లక్ష్మియనియు చెప్పబడునిన్ను
(తరువాత శ్లోకము చూడుడు)

6. ఓ దేవీ! యెవడు ప్రతిదినము నుదయమందతి భక్తితో స్మరించునో, సాధువైన అతని పాదపద్మములకు నేను సేవ చేయుదును.

7\. యస్తవనామ పవిత్రం కీర్తయతే సుకృతీ నా ।
వాసవ సుందరి దాస స్త్వచ్చరణస్య సదాఽహం ॥

8\. యస్తవ మంత్ర ముదార ప్రాభవ మాగమ సారం ।
పావని కూర్చముపాస్తే తస్య నమశ్చరణాయ ॥

9\. పావక సాగర కోణం యస్తవ పావన యంత్రం ।
పూజయతి ప్రతి ఘస్రం దేవి భజామి తదంఘ్రిం ॥

10\. శాంత ధియేతరచింతా సంతతి మంబ విహాయ ।
చింతయతాం తవపాదా వస్మిసతా మనుయాయీ ॥

11\. శోధయతాం నిజతత్వం సాధయతాం మహిమానం ।
భావయతాం చరణం తే దేవి పదానుచరోఽహం ॥

12\. యోఽనుభవే న్నిజదేహే త్వామజరే ప్రవహంతీం ।
సంతత చింతన యోగా త్తస్య నమామి పదాబ్జం ॥

13\. బోధయతే భవతీం యః ప్రాణగతా గతదర్శీ ।
కుండలినీ కులకుండా త్తంత్రి దివేశ్వరి వందే ॥

7. ఓ తల్లీ! పవిత్రమైన నీ నామమును సుకృతియైన యేమనుజుడు కీర్తనచేయునో వాని చరణములకు నే నెల్లప్పుడును దాసుడను.

8. ఓ పావనీ! గొప్ప ప్రభావముగల ఆగమసారమైన నీ మంత్రమ నెడి కూర్చ నెవడుపాసించునో, వాని చరణములకు నేను నమస్కరింతును.

9. ఓ దేవీ! అగ్ని, సముద్రములు కోణములుగా గల్గిన నీ పావన యంత్రము నెవడు ప్రతిదినము పూజించునో, వాని పాదములను నేను భజింతును.

10. ఓ యంబా! శాంతబుద్ధిచే నితర సంకల్పసమూహామును నశింపజేసి నీ పాదములనే చింతించు సత్పురుషులను నే ననుస రింతును.

11. ఓ దేవీ! నిజతత్త్వమును శోధించువారియొక్క, మహిమను సాధించువారియొక్క, నీ పాదములను ధ్యానించువారియొక్క పాదములయొద్ద నేను చరింతును.

12. ఓ దేవీ! ఎవడు తన దేహమందు ప్రవహించు నిన్ను సంతత చింతనయోగముచే ననుభవించునో, వాని పాదములను నేను సేవింతును.

13. ఓ యీశ్వరీ! ప్రాణముయొక్క యాతాయాతముల నెవడు చూచుచు కుండలినీ కులకుండమునుండి నిన్ను మేలుకొలుపునో వానికి నా వందనములు.

14. లోచనమండల సౌధాం లోకన మూల విచారీ ।
విందతి యః పరమే త్వాం వందన మస్య కరోమి ॥

15. మానిని జంభజితస్త్వాం మానసమూల వితర్కీ ।
వేద హృదంబుకుసే యః పాదమముష్య నమామి ॥

16. అంతరనాద విమర్శీ పశ్యతి యస్సుకృతీ తే ।
వైభవ మంబ విశుద్ధే తేన వయం పరవంతః ॥

17. ఇంద్రపద స్థిత చిత్త శ్శీర్ష సుధారస మత్తః ।
యో భజతే జనని త్వాం తచ్చరణం ప్రణమామి ॥

18. రాస నవాఙణే లగ్నః సమ్మద వీచిషు మగ్నః ।
ధ్యాయతి యః పరమే త్వాం తస్యపదం మమ వంద్యం ॥

19. త్వాం సదహంకృతి రూపాం యోగినుతే హతపాపాం ।
ధారయతే హృదయే య స్తస్య సదాఽస్మి విధేయః ॥

20. ధూత సమస్త వికల్పో య స్తవ పావన లీలాం ।
శోధయతి స్వగుహాయాం తస్య భవా మ్యనుజీవీ ॥

21. యో భజతే నిజదృష్టిం రూప పరిగ్రహణేషు ।
తామపి దేవి కళాం తే తస్యపదే నిపతేయం ॥

14. ఓ తల్లీ! దృష్టిమూలమును విచారించు నెవడు నిన్ను నేత్ర మండలమే నివాసముగలదానివిగా తెలిసికొనునో, వానికి నేను నమస్కరింతును.

15. ఓ తల్లీ! మనస్సు మూలమును వితర్కించు నెవడు నిన్ను హృదయ కమలమందున్నట్లు తెలియునో, వాని పాదములకు నేను నమస్కరింతును.

16. ఓ తల్లీ! అంతర నాదమును విమర్శించు పుణ్యాత్ముడైన యెవడు నీ వైభవము జూచుచుండునో, వానికి మేము పరాధీనులము.

17. ఓ తల్లీ! ఇంద్ర పాదమందే చిత్తముంచి, శీర్షసుధారసమందు మత్తుడైన యెవడు నిన్ను భజించునో, వాని చరణములకు నమస్కరింతును.

18. ఓ తల్లీ! నాలుకయందుండు లాలాజలమందు లగ్నుడై, సంతోష తరంగములందెవడు మగ్నుడై నిన్ను ధ్యానించునో, వాని పాదములకు నమస్కారము.

19. ఓ తల్లీ! సదహంకార నే రూపముగా గల్గి పాపములేని నిన్నెవడు హృదయమందు ధరించునో, వానికి నే నెల్లప్పుడు విధేయుడను.

20. సందేహ నివృత్తియైన యెవడు నీ పావన చరిత్రములను నిజ గుహాయందు (హృద్గుహ) శోధించునో, వానికి నే ననుచరుడను.

21. ఓ తల్లీ! ఎవడు రూపమును గ్రహించునప్పుడు తన దృష్టియందున్న నీ యనిర్వాచ్య కళను భజించునో, వాని పాదములను నేను సేవింతును.

22. కర్మణి కర్మణి చేష్టా మంబ తవైవ విభూతిం ।
యాశ్శ్రిత బుద్ధి రుపాస్తే తత్పద మేష ఉపాస్తే ॥

23. వస్తుని వస్తుని సత్తాం యోఽభవతీం సముపాస్తే ।
మాత రముష్య వహేయం పాదయుగం శిరసాఽహం ॥

24. పాతు మిమం నిజదేశం సర్వదిశాసు సపాశం ।
అంబ విధాయ సమర్థం మాం కురు దేవి కృతార్థం ॥

25. చిత్ర పదాభిరిమాభి శ్చిత్ర విచిత్ర చరిత్రా ।
సమ్మద మేతు మఘోనః ప్రాణ సఖీ మృగనేత్రా ॥

---

## 4. నారాచికాస్తబకము

1. అంతర్విధున్వతా తమః ప్రాణస్య తన్వతా బలం ।
మందస్మితేన దేవతారాజ్ఞీ తనోతు మే శివం ॥

2. ఉత్థాప్య పుణ్య సంచయం సంమర్ద్య పాప సంహతిం ।
సా భారతస్య సంపదే భూయా ద్బలారి భామినీ ॥

3. లీలాసఖీ బిడౌజస స్స్వర్వాటికా సుఖేలనే ।
పీయూష భానుజిన్ముఖీ దేవీ శచీ విరాజతే ॥

4. పక్షః పరో మరుత్వతో రక్షః ప్రవీర మర్దనే ।
భామాలి భాసురాననా దేవీ శచీ విరాజతే ॥

22. ఓ తల్లీ! తీక్ష్ణబుద్ధిగల యెవడు ప్రతికర్మయందుండు వ్యాపారమును నీ విభూతిగా నుపాసించునో, వాని పాదములను నేనుపాసింతును.

23. ఓ తల్లీ! ఎవడు ప్రతి వస్తువునందుగల సత్ నీవేయని యుపాసించునో, వాని పాదయుగమును నేను శిరస్సున బెట్టుకొందును.

24. ఓ తల్లీ! సర్వదిక్కులందు పాశబద్ధమై యున్న నా దేశమును రక్షించుటకు నన్ను సమర్థునిగా జేసి కృతార్థుని జేయుమా.

25. చిత్రవిచిత్ర చరితముగలిగి, లేడి నేత్రములను గలిగిన యింద్రాణి యీ 'చిత్రపదా' వృత్తములవలన సంతోషించుగాక.

---

1. అంతర్గతమస్సులను నశింపజేయునది, ప్రాణమునకు బలమిచ్చునది యగు మందస్మితముచే ఇంద్రాణి నాకు మంగళముల నొడగూర్చుగాక.

2. ఆ యింద్రాణి పుణ్యసంచయము నుద్దీపన మొనర్చి, పాపములను ధ్వంస మొనర్చి, భారతభూమికి సంపద నిచ్చుగాక.

3. స్వర్గవాటికలందు క్రీడించుటలో దేవేంద్రునకు లీలాసఖియు, చంద్రునిజయించు ముఖముగలదియు నగు శచీదేవి విరాజిల్లుచున్నది.

4. రాక్షసవీరులను మర్దించుటలో నింద్రునకు సహాయభూతురాలు, సూర్యునివలె ప్రకాశించు ముఖముగలది యైన శచీదేవి విరాజిల్లు చున్నది. ("భామాలి" అంశుమాలివంటిది. సూర్య

5. భీతిం నిశాట సంహతేః ప్రీతిం సుపర్వణాం తతేః ।
జ్యాటంకృతై ర్వితన్వతీ దేవీ శచీ విరాజతే ॥

6. దేవేంద్ర శక్తి ధారిణీ శత్రు ప్రసక్తి వారిణీ ।
మానీంద్ర ముక్తికారిణీ దేవీ శచీ గతిర్మమ ॥

7. సన్న స్వదేశ దర్శనా ద్భిన్న స్వజాతి వీక్షణాత్ ।
ఖిన్నస్య సంశ్రితావనీ దేవీ శచీ గతిర్మమ ॥

8. సంఘే సహస్రధా కృతే దేశే నికృష్టతాం గతే ।
శోకాకులస్య లోకభృ ద్దేవీ శచీ గతిర్మమ ॥

9. సా సంవిదోఽధి దేవతా తస్యాస్స్వరః పరోవశే ।
సర్వం విధీయతే తయా తస్మాత్పరామతా శచీ ।

10. సాయాతి సూక్ష్మమప్యలం సాభాతి సర్వవస్తుషు ।
సా మాతి ఖంచ నిస్తులం తస్మాత్పరామతా శచీ ॥

డనుటయే యుక్తము. పై శ్లోకమున భర్తతో విహరించు నపుడు చంద్రముఖియనియు, నిందులో శత్రువులతో యుద్ధము చేయునపుడు సూర్యునివలె జ్వలించు ముఖముకలది యనియు చమత్కరించెను. "రాకేందు బింబమై రవిబింబమై" అను పోతనగారిపద్యము స్మరింపఁదగును.)

5. నారిటంకారములచే రక్కసులకు భీతి గలిగించుచు దేవతలకు ప్రీతినిచ్చు శచీదేవి విరాజిల్లుచున్నది.

6. దేవేంద్రునిశక్తిని ధరించునది, శత్రువుల ఆడంబరమును నివారించునది, మునులకు ముక్తినిచ్చునది యగు శచీదేవి నాకుశరణము

7. కృశించిన స్వదేశమును దర్శించుటవలన, భిన్నమైన స్వజాతిని వీక్షించుటవలన ఖిన్నుడనైయున్న నాకు సంశ్రితులను రక్షించు శచీదేవి గతి యగుగాక.

8. సంఘము వెయ్యివిధములుకాగా, దేశము హీనస్థితినిబొంది యుండగా శోకమందు మునిగియున్న నాకు లోకములను కాపాడు శచీదేవి గతి యగుగాక.

9. ఆమె జ్ఞానమున కధిదేవత. పరమైన స్వరమామెకు వశమై, ఆమెచేతనే సర్వము విధింపబడుచున్నది గనుక శచి పరాదేవిగా వచింపబడుచున్నది.

10. ఆమె యత్యంత సూక్ష్మరూపిణియైనను సర్వవస్తువులందు ప్రకాశించుచున్నది. ఆమె నిరూపమానమైన ఆకాశమును కొలత చేయుచున్నది. కనుకనే పరాదేవియని శచి వచింపబడుచున్నది.

11. సా సర్వలోక నాయికా సా సర్వగోళ పాలికా ।
సా సర్వదేహ చాలికా తస్మాత్పరామతా శచీ ॥

12. యస్యాః కృతిర్జగత్త్రయం యా తద్బిభర్తి లీలయా ।
యస్యాం ప్రయాతి తల్లయం సా విశ్వనాయికా శచీ ॥

13. ధర్మే పరీక్షయం గతే యాఽవిశ్వ నిర్మలం జనం ।
తద్రక్షణాయ జాయతే సా విశ్వనాయికా శచీ ॥

14. వేధా ఋతస్య మోదితా మంత్రేణ సత్యవాదినా ।
బాధా నివారిణీ సతాం సా విశ్వనాయికా శచీ ॥

15. యక్ష్మో యయా వినీయతే యుద్ధం తథా పృథగ్విధం ।
తాం దేవరాజ మోహినీం నారీం నుమః పురాతనీం ॥

16. యస్యాస్సుతో వృషాకపి ర్దేవో సతాం ప్రశాసితా ।
తాం సర్వదా సువాసినీం నారీం నుమః పురాతనీం ॥

11. ఆమె సర్వలోకనాయిక, సర్వగోళములను పాలించునది, సర్వ దేహములను చలింపజేయునదికనుక శచిపరాదేవియగుచున్నది.

12. ముల్లోకము లే దేవియొక్క కల్పనమో, యెవరి లీలవలన నవి భరింపబడుచున్నవో, తిరుగి నవి యెవరియందు లయమగు చున్నవో, విశ్వనాయికయైన ఆ శచి ప్రకాశించుగాక.

13. ధర్మము నశించుచుండగా నే దేవత విశ్వమందున్న సాధుజను లను రక్షించుటకై పుట్టుచున్నదో, ఆ విశ్వనాయికయైన శచి ప్రకాశించుగాక.

14. సత్యమునుబల్కు మంత్రముచే ఋతమున కే దేవి (ఋతము= మానసిక సత్యము) సృష్టి కర్త్రియని కీర్తింపబడుచున్నదో (మంత్రము మనస్సంబంధము. మంత్రమువలన ప్రతిపాదింపబడు ఋతము అనిర్వచనీయ సత్యమును నిరూపించును. అట్టి ప్రతిరూపమును సృష్టించినది), సత్పురుషుల బాధలను నివారించు విశ్వనాయికయై ఆ శచి ప్రకాశించుగాక.

15. దేవివలన యజ్ఞము లెట్లు నివర్తింప బడుచున్నవో, అట్లే యామెచే నింకొక విధముగా యుద్ధములుగూడ చేయబడు చున్నవి. ఇంద్రుని మోహింపజేయు పురాతనమైన ఆ స్త్రీకి మేము నమస్కరింతుము.

16. దేవుడైన వృషాకపి యేదేవతకు పుత్రుడై, సత్పురుషులకు రక్షకుడగుచుండెనో, సర్వకాల సువాసినియు, పురాతనియునైన ఆ స్త్రీకి మేము నమస్కరింతుము.

17. యస్యాస్సమా నితంబినీ కాచిన్న విష్టపత్రయే ।
తాం నిత్యచారు యౌవనాం నారీం నుమః పురాతనీం ॥

18. యచ్చారుతా నదృశ్యతే మందార పల్లవేష్వపి ।
తత్సుందరాచ్చ సుందరం శచ్యాః పదాంబుజంశ్రయే ॥

19. యస్యప్రభా నవిద్యతే మాణిక్య తల్లజేష్వపి ।
తద్భాసురాచ్చ భాసురం శచ్యాః పదాంబుజంశ్రయే ॥

20. నస్యాదఘైస్తిరస్కృతో యచ్చింతకో నరః కృతీ ।
తత్పావనాచ్చ పావనం శచ్యాః పదాంబుజంశ్రయే ॥

21. రాజన్నఖేందు భానుభి స్సర్వం తమో విధూన్వతే ।
బృందారకేంద్ర సుందరీ పాదాంబుజాయ మంగళం ॥

22. గీర్వాణమౌళి రత్నభా సంక్షాళితాయ దీప్యతే ।
స్వర్గాధినాథ భామినీ పాదాంబుజాయ మంగళం ॥

23. బాలార్క బింబ రోచిషే యోగీంద్ర హృద్గుహాజుషే ।
పాకారి జీవితేశ్వరీ పాదాంబుజాయ మంగళం ॥

17. ఏదేవికి సమానమగు స్త్రీ ముల్లోకములందు లేదో, అట్టి సుందరి, నిత్య యౌవన, పురాతని యైన స్త్రీకి మేము నమస్కరింతుము.

18. ఏదేవి పాదములకు గల సౌందర్యము మందార పల్లవములకు గూడ లేదో, అట్టి సుందరాతిసుందరములైన శచీదేవి పాదములను నే నాశ్రయింతును.

19. ఏదేవి పదకాంతులు ప్రశస్త మాణిక్యములందైన లేవో, భాసురమైన వానికంటె భాసురమైన యా శచీ పాదములను నే నాశ్రయింతును.

20. ఏదేవిపాదములను చింతించుటవలన నరుడు పాపములచే తిరస్కరింపబడడో, అట్టి పవిత్రమైన వానికంటె పవిత్రమైన శచీపాదములను నే నాశ్రయింతును.

21. ఏదేవియొక్క నఖములందు రాజిల్లు చంద్రకాంతులు తమస్సును బారద్రోలుచున్నవో, అట్టి యింద్రాణీ పాదములకు మంగళమగుగాక.

22. దేవతల కిరీట రత్నకాంతులచే కడగబడుచు ప్రకాశించుచున్న ఇంద్రాణీ పాదములకు మంగళమగుగాక.

23. బాలసూర్య బింబమువలె భాసించునది, యోగీంద్రుల హృదయ గుహలందు దీపించునది యైన ఇంద్రాణియొక్క పాదపద్మమునకు మంగళమగుగాక.

24. ఆత్మీయ దేశరక్షణే శక్తం కరోతు సర్వథా ।
పాప ద్విషాం ప్రియంకరీ వాసిష్ఠ మింద్ర సుందరీ ॥

25. వాసిష్ఠ వాక్ప్రదీప్తిభి ర్నారాచికాభి రీశ్వరీ ।
గీర్వాణ చక్రవర్తి న స్సమ్మోద మేతు సుందరీ ॥

---

తృతీయం. అనుష్టుభం శతకమ్ సంపూర్ణమ్.

24. పాపములకు శత్రువులైనవారికి ప్రియమొనర్చు ఇంద్రాణి ఆత్మీయ దేశరక్షణమందు వాసిష్ఠగణపతిమునిని సర్వథా శక్తి మంతుని చేయుగాక.

25. ఈశ్వరియగు నింద్రాణీదేవి వాసిష్ఠవాక్కులచే ప్రకాశించు 'నారాచికా' వృత్తముల వలన సంతోషము బొందుగాక.

---

ఓం

చతుర్థం

# బార్హతం శతకమ్

# 1. హలముఖీ స్తబకము

1. క్షీరవీచి పృషతసితం ప్రేమధారి దరహసితం ।
నాకరాజ నళిన దృశ శ్శోకహారి మమ భవతు ॥

2. అధ్వనో గళిత చరణా మధ్వర క్షితి మవిభవాం ।
ఆ దధాతు పథి విమలే నైభవేచ హారి తరుణీ ॥

3. బ్రహ్మణ శ్చితి రథ నభః కాయభా గవగతి మతీ ।
యా తదా పృథగివ బభౌ ధర్మితాం స్వయమపి గతా ॥

4. మోద బోధ విభవకృత ప్రాకృతేతర వరతను ।
సర్వ సద్గుణగణయుతం యా ససర్జ సురమిథునం ॥

5. పుంసి దీప్త వపుషి తయో ర్బ్రహ్మ సోఽహమితి లసతి ।
యోషితే కిల ధియమదా త్తస్య శక్తి రహమితి యా ॥

6. యాభిమానబలవశత స్తాముదారతమ విభవాం ।
మన్యతేస్మ వరవనితాం స్వాధిదైవిక తను రితి ॥

1. క్షీరతరంగ బిందువులవలె స్వచ్ఛమైన ప్రేమను ధరించు ఇంద్రాణీ దరహసితము నా శోకమును హరించుగాక.

2. మార్గమునుండి చరణములు జారి, వైభవమును గోల్పోయిన యీ యజ్ఞభూమిని తిరుగ ఆ మార్గమునకు, వైభవమునకు గూడ ఇంద్రాణి తెచ్చుగాక.

3. బ్రహ్మకు చైతన్యమై, పిదప నాకాశశరీరిణియగుచు నంతటను గమనము గలిగిన దేవి తన ధర్మిత్వమును (చిత్తత్త్వమును) స్వయముగా బొందియున్నను వేఱుగా ప్రకాశించుచున్నది. (విద్యుద్రూపిణియై, లేదా 'అహం' స్ఫురణరూపిణియై)

4. చిదానంద తత్త్వములతో గూడిన శ్రేష్ఠమైన దివ్యశరీరము గలిగి, సర్వ సద్గుణములతో గూడిన దైవమిథునము నేదేవి సృజించెనో, (అనగా సగుణదైవ మిథునమును)

5. ఆ మిథునమందు బ్రకాశించు పురుషునియందు 'సోఽహం బ్రహ్మ'యని యేదేవి ప్రకాశించుచు, స్త్రీ భాగమునకు "ఆ బ్రహ్మయొక్క శక్తిని నేను" అను బుద్ధిని గలిగించు చున్నదో.

6. ఏశక్తి యభిమాన బలవశముచేత నధిక వైభవము గలిగియున్న ఆ స్త్రీమూర్తిని తానే యధిదేవతగాగల శరీరిణిగా భావించు చున్నదో, (మూలశక్తి యీశ్వరాభిమానశక్తి, ఆ మెలక్షణమే 'అహమ్మహ'మ్మను ప్రత్యేక భాసమానము.)

7. ఆదిపుంసి గగనతను ర్యా తనోతి తనుజ మతిం ।
ఆ దధాతి యువతి తనుః ప్రాణనాయక ఇతి రతిం ॥

8. తాం పరాం భువన జననీం సర్వపాపతతి శమనీం ।
తంత్రజాల వినుత బలాం స్తౌమి సర్వమతి మమలాం ॥

9. సా మతి ర్విదిత విషయా సా రుచి ర్వితత విషయా ।
సా రతి ర్వినుత విషయా సా స్థితి ర్విధుత విషయా ॥

10. యత్ర యత్ర మమధిషణా గ్రాహ్యవస్తుని గతిమతీ ।
తత్ర తత్ర విలసతు సా సర్వగా సకల చరితా ॥

11. దుర్బలస్య బహుళ బలై రర్దితస్య జగతి ఖలైః ।
ఆదిదేవి తవ చరణం పావనం భవతి శరణం ॥

12. పౌరుషే భవతి విఫలే త్వా మయం జనని భజతే ।
కింను తే యది విముఖతా పౌరుషం కథయ భజతాం ॥

7. ఏ యాకాశశరీరిణి యీ ఆదిపురుషుని (సగుణదైవరూపమును) పుత్రభావముతో కల్పించి, తాను స్త్రీ తనువును బొంది యతనిలో ప్రాణనాయకుని యందువలె రతి సల్పుచున్నదో.

8. జగన్మాతయు, సర్వపాపములను శమింపజేయునదియు, తంత్రజాలముచే (శాస్త్రముచే) పొగడబడునదియు, సర్వమునకు బుద్ధిరూపిణియు, అమలయు, పరమమైనదియు నగు ఆమెను స్తుతించుచుంటిని.

9. విషయములను దెలియు బుద్ధియామెయే, విషయములందు వ్యాపించు కాంతియునామెయే, విషయములందు ప్రసిద్ధమైన ప్రీతి (యభిమానము) యామెయే. (విషయాభిమానముతో గూడిన వృత్తి చెప్పబడెను. అభిమానము వృత్తినుండి తొలగి మూలగతమైనప్పుడు విషయము లణగును). విషయముల నణచు స్థితికూడ నామెయే యగును.

10. ఎచ్చటెచ్చట గ్రహింపదగిన వస్తువునందు నా బుద్ధి వ్యాపించుచుండునో, అచ్చటంతటను సకల చరితమైన నామె వ్యాపించి విలసిల్లుగాక.

11. ఓ దేవీ! జగత్తునం దధిక బలముగల దుర్మార్గులచే పీడింపబడు దుర్బలులకు నీ పవిత్ర చరణమే శరణము.

12. ఓ తల్లీ! పౌరుషము విఫలమైనప్పుడు నిన్ను సేవించుచుందుము. నీ కిష్టము లేనప్పుడు సేవించువాని పౌరుష మేమగునో చెప్పుము.

13. కర్తు రప్రతిహత గిరః పౌరుషా చ్ఛతగుణమిదం ।
ధ్యాతు రస్ఖలిత మనసః కార్యసిద్ధిషు తవ పదం ॥

14. పౌరుషం విదితమఫలం కాంక్షితే మమ సురనుతే ।
శక్తి మీదృశితు సమయే శ్రద్దధామి తవ చరణం ।

15. పౌరుషం యది కవిమతం దేవి తేపి పద భజనం ।
దైవవాదపటు వచసో మూకతైవ మమ శరణం ॥

16. పూర్వజన్మ సుకృతబలం దైవమంబ నిగదతి యః ।
భక్తిపౌరుష విరహిణో భావితస్య రిపు దయితం ॥

17. ఉద్యతస్య తవ చరణం సంశ్రితస్యచ సురనుతే ।
పూర్వజన్మ సుకృతబల శ్రద్ధయాఽలమహృదయయా ॥

13. వాక్కు లప్రతిహతముగా నుండువాని పౌరుషముకంటె నస్ఖలిత మనస్సుగల ధ్యానికి కార్యసిద్ధి యీ నీ పాదము శతగుణాధికముగా నిచ్చును.

(అనగా పౌరుషముతో గూడిన వాక్సిద్ధికంటె నిశ్చలమనస్సున కధికబలమని)

14. ఓ దేవీ! నా యభిలాష విషయమై పౌరుషమువలన లాభము లేదని తెలియుచున్నది. ఇట్టి సమయమందు నీ చరణమే సమర్థమని నేను శ్రద్ధతో నమ్ముచుంటిని.

15. ఓ దేవీ! నీ పాదభజనముకూడ బౌరుషమే యన్నచో దైవవాదినగు నాకు మౌనమే శరణము.

16. ఓ తల్లీ! ఎవడు పూర్వజన్మ సుకృతబలమే దైవమని చెప్పునో భక్తి పౌరుషములులేని (పౌరుషము = పురుషయత్నము) వాని యొక్క- కాబోవు దైవము తనకు శత్రువగును.

(పూర్వజన్మ కర్మయే తన కిహమందు ప్రేరేపించు దైవ మనుకొనువారికి దైవము జడమగును. ఏల ననగా కర్మజడము కనుక. ఆ జడదైవము తా ననుకొనినట్లు ప్రేరేపింపజాలదు గనుక తన కది శత్రువగును. కనుక 'బుద్ధిః కర్మానుసారిణీ' అను వాక్యము తప్పు. 'కర్మబుద్ధ్యనుసారి స్యాత్'=బుద్ధి ననుసరించి కర్మయుండును. అని సవరించుకొనవలెను.)

17. ఓ తల్లీ! నీ చరణముల నాశ్రయించుచు పురుషప్రయత్నము చేయుచున్నప్పుడు, నమ్మదగని పూర్వజన్మ సుకృతబలమునుగూర్చి శ్రద్ధ యవసరములేదు. (ఈ జన్మలో చేయు కర్మకుత్తరజన్మలోగాని ఫలము రాదనువారికిది జవాబు.)

18. అస్తు పూర్వభవ సుకృతం మాస్తువా జనని జగతాం ।
సాంప్రతం తవపదయుగం సంశ్రితోఽస్మ్యవ విసృజవా ॥

19. నాస్తి సంప్రతి కిమపి కిం భూతిమాప్స్యసి కిము తతః ।
అన్య జన్మని వితరణే క్వాపస క్తి రమర నుతే ॥

20. నాన్య జన్మని బహుశివం నాపి నాకభువన సుఖం ।
కామయే ఫల మభిమతం దేహి సంప్రతి శచి నవా ॥

21. మేదినీ భువన తలతో నిస్తులాదుత గగనతః ।
భాస్కరా దుత రుచినిధేః కామ్య మీశ్వరి వితర మే ॥

22. విష్టపే క్వచన వరదే దాతు మీశ్వరి కృతమతిం ।
వారయే జ్జనని న పర స్త్వాం జన స్తవ పతి మివ ॥

23. దేహివా భగవతి నవా పాహివా శశిముఖి నవా ।
పావనం తవ పదయుగం నత్యజామి హరిదయి తే ॥

18. ఓ తల్లీ! పూర్వజన్మ సుకృతబల ముండుగాక, లేకపోవుగాక. ఇప్పుడు నీ పదయుగము నే నాశ్రయించుతును. రక్షింపుము, మానుము.

(ప్రేరేపించునది బుద్ధి యగునుగాని జడమైన కర్మ కాజాలదు. కనుక బుద్ధిని సవ్యమొనర్చుకొని, జడమైన కర్మఫలము నారాధించుట మాని, చిద్రూపిణి యగు దేవత నాశ్రయించవలెను.)

19. ఓ తల్లీ! ఇప్పు డేమియు లేదు. (పూర్వజన్మ కర్మఫలముచే నొప్పున నైశ్వర్య మిప్పు డేమియు లేదు). ఐశ్వర్యమును (ప్రస్తుత కర్మ ఫలముగా) పొందగోరినచో తరువాత ఏమిటి? (ఈ జన్మలోని కర్మకు ఫలము) మఱియొక జన్మలో నివ్వడమనెడి ప్రసక్తియేల?

20. ఓ శచీ! ఇతర జన్మలం దెక్కువ మంగళములు నేను కోరుట లేదు, స్వర్గసుఖమైన కోరుట లేదు. నా కభిమతమగు ఫలమును ఇప్పుడు నేను కోరుచుంటిని. ఇచ్చిన నిమ్ము, లేదా మానుము. (ఫల మిచ్చునది దైవము కనుక నిప్పటి పుణ్యకర్మకు దైవ మిప్పుడైన నీయగలదని భావము.)

21. ఓ దేవీ! భూలోకమునుండి కాని, నిరుపమానమగు నాకాశము నుండి కాని, కాంతినిధియగు సూర్యునినుండిగాని నా కోర్కెను నెరవేర్పుము.

22. ఓ తల్లీ! నీవు సర్వేశ్వరివి కనుక నీవీయఁదలఁచినచో నిన్ను ఏలోకమునందును నీ భర్తనువలె నడ్డగింపగలవాడు లేడు.

23. ఓ దేవీ! ఇచ్చిన నిమ్ము, లేదా మానుము. రక్షింపుము, మానుము. పావనమైన నీ పాదములుమాత్రము నేనువిడువను.

24. రక్షితుం భరత విషయం శక్త మింద్ర హృదయ సఖి ।
చంద్రబింబ రుచిర ముఖి సా క్రియా ద్భువి గణపతిం ॥

25. సంప్రహృష్యతు హాలముఖీ ర్వ్యాసవతీ ర్గణపతి మునేః ।
సా నిశమ్య సురనృపతే ర్మోహినీ సదయ హృదయా ॥

---

## 2. భుజగశిశుభృతా స్తబకము

1. మరుదధిప మనోనాథా మధుకర చికురాస్మాకం ।
వృజిన విధుతి మాధత్తాం విశద హాసిత లేశేన ॥

2. అఖిల నిగమ సిద్ధాంతో బహు మునివర బుద్ధాంతః ।
సుర పరిబృఢ శుద్ధాంతో భరత వసుమతీ మవ్యాత్ ॥

3. భగవతి భవతీ చేతో రతి కృదభవ దింద్రస్య ।
సతవ జనని సంతాన ద్రుమవన మతి రమ్యం వా ॥

4. పతి రఖిల యువశ్రేష్ఠః కిమపి యువతి రత్నం త్వం ।
వన విహృతిషు వాంఛేతో హరణ మభవ దన్యోన్యం ॥

5. మధుర లలిత గంభీరై స్తవ హృదయ ముపన్యాసైః ।
వన విహరణ లీలాయా మహరదయి దివోరాజా ॥

24. చంద్రబింబముఖియైన ఇంద్రాణి భరతభూమిని రక్షించుటకు గణపతిని భూలోకమందు శక్తిమంతునిగా జేయుగాక.

25. దయతోఁగూడిన ఇంద్రాణి ప్రకాశించుచున్న యీ గణపతి మునియొక్క 'హాలముఖి' వృత్తములను విని సంతోషించుగాక.

---

1. తుమ్మెదలనుబోలు ముంగురులుగల ఇంద్రాణి తన నిర్మల మందహాసముచే మాయొక్క పాపములను నాశన మొనర్చు గాక.

2. సకల వేదములందు కొనియాడబడి, బహుమునివరులచే తెలియ బడు నంతముగలిగి, యింద్రుని యంతఃపురస్త్రీయై యున్న దేవి భారతభూమిని రక్షించుగాక.

3. ఓ తల్లీ! ఇంద్రుని మనస్సునకు రతిగూర్చుదానవు నీవు, నీ మన స్సునకు రతిగూర్చువాడా యింద్రుడు. రమ్యమైన కల్పక వనము మీ యుభయులకు రతిగూర్చునదయ్యెను.

4. నీ పతి యఖిల యువకులలో శ్రేష్ఠుడు, నీ వొకానొక యువతీ రత్నమవు. వనవిహారములందు మీ యన్యోన్యత్వమే మీ మనస్సు లొకదానిచే నొకటి హరింపబడుటకు తోడ్పడు చున్నది.

5. దేవి! ఇంద్రుడు వనవిహార లీలలందు మధుర, లలిత, గంభీర వాక్కులచే నీ హృదయము నాకర్షించెను.

6. కలవచన విలాసేన ప్రగుణ ముఖ వికాసేన ।
భువనపతి మనోఽహర్షి గ్గనని వన విహారే త్వం ॥

7. కనక కమల కాంతాస్యా ధవళ కిరణ వక్త్రేణ ।
అసిత జలజ పత్రాక్షీ సిత నళిన దళాక్షేణ ॥

8. అళిచయ నిజధమ్మిల్లా నవజలధర కేశేన ।
మృదులతమ భుజావల్లీ ధృఢ తమ భుజదండేన ॥

9. అమృతనిలయ బింబోష్ఠీ రుచిర ధవళ దంతేన ।
అతి ముకుర లసద్గండా వికచ జలజ హస్తేన ॥

10. యువతి రతితరాం రమ్యా సులలిత వపుషాయూనా ।
భగవతి శచి యుక్తా త్వం త్రిభువన విభు నేంద్రేణ ॥

11. వికచ కుసుమ మందార ద్రుమ వన వరవాటీషు ।
విహరణ మయి కుర్వాణా మనసిజ మనుగృహ్ణాసి ॥

12. తవశచి చికురేరాజ త్కుసుమ మమర వృక్షస్య ।
నవ సలిల భృతో మధ్యే స్ఫురదివ నవ నక్షత్రం ॥

13. అభజత తరు రౌదార్యం విధవ మహాంతం సః ।
వికచ కుసుమ సంపత్త్యా భగవతి భజతే యస్త్వాం ॥

6. ఓ తల్లీ ! వనవిహారమందు నీవు మధుర వాగ్విలాసములచేతను, మిగుల గుణములుగల ముఖవిలాసము చేతను ఇంద్రుని మనస్సాకర్షించితివి.

7. బంగారుపద్మమువలె సొగసైన ముఖము, నల్లకలువ రేకులవంటి నేత్రములుగలది దేవి. తెల్లని కాంతులుగల ముఖము, తెల్లని తమ్మి రేకులవంటి కనులు గలిగినవాడు విభుడు.

8. తుమ్మెదలగుంపువంటి కొప్పు, మిక్కిలి మృదువైన భుజములు గల్గినది దేవి. వర్షకాలమేఘమువంటి జుట్టు, మిక్కిలి దృఢమైన భుజదండములు గలవాడు విభుడు.

9. అమృతమునకు నిలయమైన బింబోష్ఠము, అద్దములను మించి ప్రకాశించు చెక్కిళ్లు గల్గినది దేవి. కాంతిగల తెల్లని దంతములు, వికసించిన పద్మములవంటి హస్తముగలవాడు విభుడు.

10. ఓ శచీ ! అత్యంత రమ్యమైన యువతివై నీవు సుందరశరీరము గలిగి యౌవనవంతుడై, త్రిభువనపతియైన నింద్రునితో గూడితివి.

11. ఓ దేవీ ! వికసించిన పుష్పములుగల మందార వృక్షవనపంక్తులందు విహరించుచు నీవు మన్మథు ననుగ్రహించుచుంటివి.

12. ఓ శచీ ! నీ ముంగురులందు ప్రకాశించు కల్పకపుష్పము నూత్నమేఘ మధ్యమందు ప్రకాశించు నూత్ననక్షత్రము వలె భాసించుచున్నది.

13. ఓ దేవీ ! ఏ యమరవృక్షము వికసించిన పుష్ప సంపత్తితో నిన్ను భజించునో, అతడువు ఔదార్యమును, ఐశ్వర్యమును గూడ (నీ వలన) బొందుచున్నది.

14. అమర నృపతి నాసాకం కుసుమిత వనవాటీషు ।
భగవతి తవ విశ్రాంతే స్సజయతి సమయః కోపి ॥

15. అమర తరువర చ్ఛాయా స్వయి ముహురుపవిశ్య త్వం ।
శచి కృతి జన రక్షాయై మనసి వితనుషే చర్చాం ॥

16. కిము వసు వితరాణ్యస్మై సుమతి ముత దదాన్యస్మై ।
క్రమతమ మిథవాముష్మి స్బలమురు ఘటయానీతి ॥

17. హరి తరుణి కదావామే వినమదవన చర్చాసు ।
స్మరణ సమయ ఆయాస్య త్యమల హృదయరంగే తే ॥

18. శచి భగవతి సాక్షాత్తే చరణ కమల దాసోఽహం ।
ఇహతు వసుమతీలోకే స్మర మమ విషయం పూర్వం ॥

19. నయది తవ మనోదాతుం స్వయమయి లఘు వే మహ్యాం ।
ఉపవన తరు కర్ణేవా వదమ దభిమతం కర్తుం ॥

20. నిజ విషయ మతిశ్రేష్ఠం విపది నిపతి తంత్రాతుం ।
స్వకులమపి సదధ్యానం గమయితు మపథే శ్రాంతం ॥

21. అఖిల భువన సమ్రాజః ప్రియ తరుణి భవత్యైవ ।
మతిబల పరిపూర్ణోఽయం గణపతిముని రాధేయః ॥

14. ఓ తల్లీ! పుష్పవన వాటికలందు ఇంద్రునితో గూడి నీవు విశ్రాంతి బొందు నొకానొక సమయము సర్వోత్కృష్టము.

15. ఓ శచీ! అమర వృక్షచ్ఛాయలందు నీవు మాటి మాటికి గూర్చుని పుణ్యజనరక్షణము గుఱించి మనస్సున చర్చించుకొను చుంటివి (కాబోలు).

16. ఆ పుణ్యజనులకు 'ధనమిత్తునా, జ్ఞానమిత్తునా, లేక అధిక బలమిత్తునా?' అని చర్చించుచుంటివా?

17. ఓ తల్లీ! విశేష నమ్రులైన వారి రక్షణవిషయమై చేయు చర్చలందు నీ నిర్మల హృదయరంగమందు నన్ను స్మరించు కాల మెప్పుడు వచ్చును?

18. ఓ దేవీ! నేను సాక్షాత్తు నీ చరణకమల దాసుడనై యుంటిని. ఈ భూలోకమందు నా విషయమును మొదట స్మరింపుము.

19. ఓ దేవీ! అల్పుడనైన నాకు స్వయముగా నిచ్చుటకు నీకు మనస్సు లేనిచో ఉపవనమందున్న యీ చెట్టు చెవిలోనైన నా యభిమతమును దీర్చెదనని చెప్పుము.

20. విపత్తులో పడిన నతిశ్రేష్ఠమగు నా దేశమును రక్షించుటకును, తప్పుమార్గమునబడి యలసిపోయిన స్వకులమును సన్మార్గము బొందించుటకును,

21. ఓ దేవీ! నీ చేతనే యీ గణపతిముని బుద్ధిబలపూర్ణుడు గావింపబడుగాక.

22. నకిము భవతి శం దేశే గతివతి కలుషే కాలే ।
తవ భజన మఘం సద్యో హరిహయ లలనే జేతుం ॥

23. త్రిజగతి సకలం యస్య ప్రభవతి పృథులే హస్తే ।
స బహుళ మహిమా కాలో మమ జనని విభూతిస్తే ॥

24. అనవరత గళ ద్బాష్పాం భరత వసుమతీం త్రాతుం ।
వితరతు దయితా జిష్ణో ర్గణపతి మునయే శక్తిం ॥

25. భుజగ శిశుభృతా ఏతాః కవి గణపతినాగీతాః ।
విదధతు ముదితాం దేవీం విబుధపతి మనోనాథాం ॥

---

## 3. మణిమధ్యాస్తబకము

1. మంగళదాయీ పుణ్యవతాం మన్మథ దాయీ దేవపతేః ।
విష్టపరాజ్ఞీ హాసలవో విక్రమదాయీ మే భవతు ॥

2. దృష్టి విశేషై శ్శీతవరై ర్భూర్యనుకంపైః పుణ్యాత్మైః ।
భారత భూమేస్తాపతతిం వాసవకాంతా సా హరతు ॥

3. పావన దృష్టి ర్యోగిహితా భాసురదృష్టి ర్దేవహితా ।
శీతలదృష్టి ర్భక్తహితా మోహనదృష్టి శ్శక్రహితా ॥

22. ఓ తల్లీ ! సుఖప్రదమగు దేశమం దీ కలుషకాలములో నీ భజన వలన పాపములు వెంటనే జయింపబడవా యేమి ?

23. ఓ జననీ ! ఏ కాలముయొక్క గొప్పహస్తములో ముల్లోకము లిమిడి యుండునో, బహుళ మహిమగల ఆ కాలము నీ యొక్క విభూతియే కదా. (కాళి)

24. ఎల్లప్పుడు కన్నీరుకార్చు భారత భూరక్షణకై గణపతిముని కింద్రాణి శక్తి నిచ్చుగాక.

25. గణపతి కవిచే గానము చేయబడిన యీ 'భుజగశిశుభృతా' వృత్తము లింద్రసఖికి ప్రీతి నిచ్చుగాక.

---

1. పుణ్యాత్ములకు మంగళములనిచ్చునది, ఇంద్రుని మోహింపజేయునది యగు ఇంద్రాణీహాసలవము నాకు విక్రమము నిచ్చుగాక.

2. ఆ యింద్రాణి విశేషదయకలిగి, మిక్కిలి పవిత్రములై, అత్యంత శీతలములైన దృష్టివిశేషములచే భారత భూతాపములను హరించుగాక.

3. పావనదృష్టి కలదు గనుక యోగులకు హితురాలు, ప్రకాశించు దృష్టి యుండుటచే దేవతలకు హితురాలు, శీతలదృష్టివలన భక్తులకు హితురాలు, మోహనదృష్టిచే నామె యింద్రునకు హితురాలగుచున్నది.

4. ఉజ్జ్వలవాణీ విక్రమదా వత్సలవాణీ సాంత్వనదా ।
మంజులవాణీ సమ్మదదా పన్నగవేణీ సా జయతు ॥

5. శారదరాకా చంద్రముఖీ తోయదమాలాకార కచా ।
మేచక పాథో జాతదళ శ్రీహార చక్షుర్వ్యాసి కృపా ॥

6. చంపక నాసా గండ విభా మండల ఖేల త్కుండల భా ।
ఉక్తిషు వీణా బింబఫల శ్రీహార దంత ప్రావరణా ॥

7. నిర్మల హాస ఝ్ఝాళి తది గ్భిత్తి సమూహా మోహాహారీ ।
కాంచనమాలా శోభిగళా సంతతలీలా బుద్ధికళా ॥

8. విష్టపధారి క్షీరధర స్వర్ణఘట శ్రీహారి కుచా ।
కాపి బిడౌజోరాజ్యరమా చేతసి మాతా భాతు మమ ॥

9. దివ్యసుధోర్మి ర్భక్తిమతాం పావక లీలా పాపకృతాం ।
వ్యోమ్ని చరంతీ శక్రసఖీ శక్తిరమోఘా మామవతు ॥

10. సమ్మదయంతీ సర్వతనుం సంశమయంతీ పాపతతిం ।
సంప్రథయంతీ సర్వమతీ స్సంఘటయంతీ ప్రాణబలం ॥

4. ఉజ్జ్వలవాక్కులు గలది కనుక నామె విక్రమమిచ్చును, ప్రేమ పూరితవాక్కులు గలదియై యోదార్చును, మంజులవాక్కులచే సంతోషమిచ్చును. ఇట్టి పన్నగవేణియగు ఇంద్రాణి ప్రకాశించు గాక.

5. శరచ్చంద్రునిబోలు ముఖము, మేఘపంక్తివంటి కొప్పుగల్గి నల్లని కలువరేకులతో సమమగు చక్షువులందు వసించు దయ గల ఇంద్రాణి ప్రకాశించుగాక.

6. సంపెంగవంటి నాసిక, చెక్కిళ్లకాంతి మండలముతో క్రీడించు కుండల కాంతులు, వీణానాదమువంటి పల్కులు, దొండపండు శోభను హరించు నధరోష్ఠముగల యింద్రాణి ప్రకాశించుగాక.

7. నిర్మలములైన నగవులచే దిక్కులనెడి గోడల సమూహమును కడుగుచున్నది, మోహమును హరించునది, స్వర్ణమాలచే ప్రకాశించు కంఠముగలది, సంతత లీలలతో గూడిన బుద్ధి కళలుగలది,

8. ప్రపంచమును బోషించు క్షీరభారమును ధరించు సువర్ణఘట ములవలె ప్రకాశించు కుచములుగల మాతయైన నాకానాక దేవేంద్ర రాజ్యలక్ష్మి నా చిత్తమందు ప్రకాశించుగాక.

9. భక్తులకు దివ్యామృతము వంటిది, పాపాత్ముల కగ్నివంటిది, ఆకాశమందు సంచరించు నింద్రసఖి యను నమోఘశక్తి నన్ను రక్షించుగాక.

10. అందరిని సంతోషపరచునది, పాపసమూహమును నాశన మొనర్చునది, అందరి బుద్ధులను ప్రకటించునది, ప్రాణబల మును సమకూర్చునది.

11. నిర్జితశోకా ధూత తమా స్సంస్కృత చిత్తా శుద్ధ తమా ।
వాసవశక్తే ర్వ్యోమజుషః కాచన వీచిర్మాం విశతు ॥

12. ఉద్గత కీలం మూలమిదం భిన్నకపాలం శీర్షమిదం ।
ఉజ్ఝితమోహం చిత్తమిదం వాసవ శక్తిర్మాం విశతు ॥

13. దృశ్య విరక్తం చక్షురిదం భోగవిరక్తం కాయమిదం ।
ధ్యేయ విరక్తా బుద్ధిరియం వాసవశక్తి ర్మాం విశతు ॥

14. చక్షు రదృశ్య జ్వాలభృతా వ్యాపక ఖేన ప్రోల్లసతా ।
విస్తృతకాయం సందధతీ వాసవశక్తి ర్మాం విశతు ॥

15. కాయ మజస్రం వజ్రదృఢం బుద్ధి మశేషం వ్యాప్తిమతీ ।
దివ్యతరంగై రాదధతీ వాసవశక్తి ర్మాం విశతు ॥

16. మూర్ధ్ని పతంతీ వ్యోమతలా త్సంతతమంత స్సర్వతనౌ ।
సంప్రవహంతీ దివ్యఝరై ర్వాసవశక్తిర్మాం విశతు ॥

17. భానువిభాయాం భాసకతా దివ్యసుధాయాం మోదకతా ॥
కాపి సురాయాం మాదకతా వాసవశక్తి ర్మాం విశతు ॥

18. భాసయతాన్మే సమ్యగృతం మోదముదారం పుష్యతు మే ।
సాధుమదం మే వర్ధయతా న్నిర్జర భర్తుశ్శక్తిరజా ॥

11. శోకమును బోగొట్టునది, తమస్సును దొలగించునది, చిత్తమును సంస్కరించునది, పరిశుద్ధ వ్యోమశరీరము బొందినది యగు ఇంద్రాణియొక్క వీచిక యొక్కటి నన్ను బ్రవేశించుగాక.

12. కిరణములు వెడలుచున్న యీ మూలాధారము, కపాలభిన్నమైన యీ శిరస్సు, మోహవర్జితమైన యీ చిత్తముగల నన్ను వాసవశక్తి యావేశించుగాక.

13. ప్రపంచమునుండి విరక్తమైన యీ కన్ను, భోగమునుండి విరక్తమైన యీ దేహము, ధ్యేయవస్తువునుండి విరక్తమైన యీ బుద్ధిగల నన్నింద్రాణి ప్రవేశించుగాక.

14. కంటి కదృశ్యమైన జ్వాలలను ధరించుచు, మిక్కిలి ప్రకాశించుచు విస్తరించిన ఆకాశముచే విస్తృతమైన శరరమును ధరించిన యింద్రాణి నన్ను ప్రవేశించుగాక.

15. పూర్ణ బుద్ధిని వ్యాపింపజేయుచు నెల్లప్పుడు శరీరమును వజ్రదృఢముగా నొనర్చు ఇంద్రాణి నన్ను ప్రవేశించుగాక.

16. ఆకాశమునుండి శిరస్సుపైబడుచు, సర్వశరీరమునందును సంతత దివ్యప్రవాహముగానున్న యింద్రాణి నన్ను ప్రవేశించుగాక.

17. సూర్యునియందుగల ప్రకాశకత్వము, అమృతమందుగల మోదకత్వము, సురయందుగల మాదకత్వము-యీ మూడు వాసవశక్తియందున్నవి. ఆమె నాలో బ్రవేశించుగాక.

18. ఇంద్రాణీశక్తి నాయొక్క మానసిక సత్యమును లెస్సగా బ్రకాశింపజేయుగాక, నా కుదారసంతోషము నిచ్చుగాక, సాత్త్వికబల మిచ్చుగాక.

19. కశ్చన శక్తిం యోగబలా దాత్మశరీరే వర్ధయతి ।
ఏపి. వివృద్ధిం భక్తిమతః కస్య చిదీశే త్వం వపుషి ॥

20. సాధయతాంవా యోగవిదాం కీర్తయతాంవా భక్తిమతాం ।
వత్సల భావాదింద్రవధూ ర్గర్భభువాంవా యాతివశం ॥

21. యస్య సమాధిఃకోపి భవే దాత్మమనీషా తస్యబలం ।
యస్తవ పాదాంభోజరత స్తస్య ఖలు త్వం దేవి బలం ॥

22. ద్వాదశవర్షీ యోగబలా ద్వ్యాఖలు శక్తిర్వ్యక్త మతేః ।
తాం శచి దాతుం భక్తిమతే కాపి ఘటే తే మాతరలం ॥

23. యోగబలాద్వా ధ్యానకృతో భక్తిబలాద్వా కీర్తయతః ।
యాతు వివృద్ధిం విశ్వహితా వాసవశక్తిర్మే వపుషి ॥

24. దుఃఖిత మేత ఛ్ఛిద్రహితం భారతఖండం సర్వహితం ।
త్రాతు మధీశా స్వర్జగత స్సూక్ష్మబుద్ధిం మాం కురుతాం ॥

25. సంతు కవీనాం భర్తురిమే సుందర బంధా శ్శుద్ధతమాః ।
సన్మణి మధ్యా స్వర్జగతో రాజ మహిష్యాః కర్ణ సుఖాః ॥

19. ఓ తల్లీ! ఒకడు యోగబలముచే దన శరీరమందు శక్తిని వృద్ధి పొందించుకొనును. ఇంకొకని శరీరమున నీవే వృద్ధినొందుదువు.

20. సాధించు యోగవేత్తలకు, కీర్తనసల్పు భక్తులకుగూడ వాత్సల్యముతో గర్భమందుబుట్టినవారికి వశమైనట్లింద్రాణి వశమగును.

21. ఓ దేవీ! ఎవడు సమాధిజెందునో, వానికి తన బుద్ధియే బలము. ఎవడు నీ పాదముల నాశ్రయించునో వానికి నీవే బలముగాదా.

22. ఓ తల్లీ! ద్వాదశవర్షములు యోగబలయుక్తుడైనవాని కేశక్తి కలిగెనో (శ్రీ రమణమహర్షి యుద్దేశింపబడెను), నీయందు భక్తునకుగూడ (కవికి) నట్టిశక్తి నిచ్చుటకు నీకు ఒక్క గడియ చాలును.

23. యోగబలముచే ధ్యానించువానికి, భక్తిబలముచే కీర్తించువానికి నేశక్తి వృద్ధిబొందునో, అట్టి యింద్రాణీ సంబంధశక్తి నా శరీరము బొందుగాక.

24. దుఃఖించునట్టి, ఐశ్వర్యము గోల్పోయినట్టి, సర్వహితమైనట్టి యీ భరతఖండమును రక్షించుట కింద్రాణి నాకు సమర్థబుద్ధి నిచ్చుగాక.

25. కవిభర్తయైన గణపతియొక్క సుందరమైన, పరిశుద్ధమైన యీ సన్మణిమధ్యావృత్తము లింద్రాణికి కర్ణసుఖము నిచ్చుగాక.

## 4. మాత్రాసమకస్తబకము

1. శుక్లజ్యోతిః ప్రకరై ర్వ్యాప్త
స్సూక్ష్మోప్యంతాన్ హరితాం హాసః ।
జిష్ణోః పత్న్యా స్తిమిరారాతి
ర్నిశ్శేషం మే హరతాన్మోహం ॥

2. శృణ్వత్కర్ణా సదయాలోకా
లోకేంద్రస్య ప్రియనారీ సా ।
నిత్యాక్రోశై ర్విరుదద్వాణీం
పాయాదేతాం భరతక్షోణీం ॥

3. దేవేషు స్వః పరిదీప్యంతీ
భూతేష్వింద్రా పరిఖేలంతీ ।
శక్తిర్జిష్ణో ర్ద్విపదాం సంఘే
హంతై తస్యాం భువి నిద్రాతి ॥

4. నిద్రాణాయా అపి తేజ్యోతి
ర్గ్రంథా దేతే ధరణీలోకే ।
మర్త్యాః కించిత్ప్రభవంతీశే
త్వం బుద్ధాచే త్కిము వక్తవ్యం ॥

5. మేఘచ్ఛన్నోఽప్యరుణ స్తేజో
దద్యాదేవ ప్రమదే జిష్ణోః ।
అత్ర స్థానా భవతీ గ్రంథి
చ్ఛన్నాప్యేవం కురుతే ప్రజ్ఞాం ॥

1. సూక్ష్మమైనను తెల్లని కాంతిచే దిక్కులందు వ్యాపించునది, తిమిరమునకు శత్రువైనది యగు ఇంద్రాణీహాసము నా యజ్ఞానమును బూర్తిగా హరించుగాక.

2. చెవులతో వినుచున్నదై (యీ స్తుతిని) దయగల యింద్రాణి నిత్యశోకముచే విశేషముగా రోదనమొనర్చు వాణి గల్గిన భారతభూమిని రక్షించుగాక.

3. స్వర్గములో దేవతలందు ప్రకాశించుచు, చంద్రలోకములో భూతములయందు క్రీడించు ఇంద్రాణి యీ భూమిలో మానవులందు నిద్రించుచున్నది. ఆశ్చర్యము!
(మూలాధారమందజ్ఞానులలో నిద్రించుచుండునని చెప్పబడును)

4. దేవీ! నిద్రించుచున్నను, నీ తేజోగంధమువలన ఈ మనుజులు భూలోకమందు కొంతవఱకు సమర్థులగుచునే యుండిరి. నీవు మనుజునియందు మేల్కాంచి తెలియబడినచో నింక చెప్పుటకే మున్నది!

5. ఓ తల్లీ! సూర్యుడు మేఘములచే గప్పబడినను వెల్తురునిచ్చుచుండెను. నీవు గ్రంథులచే గప్పబడియు నీ లోకములోని వారికి (భూలోకస్థులకు) ప్రజ్ఞ నిచ్చుచుంటివి.

6. ధ్యాయామో యత్కథయామో య
త్పశ్యామో యచ్ఛృణుమో యచ్చ ।
జీవామోవా తదిదం సర్వం
నిద్రాణాయా అపితే భాసా ॥

7. నాడీ బంధా దభిమానాచ్ఛ
చ్ఛిన్నామాంతర్భవతీ దేహే ।
ఏకాపాయా దితరో నశ్యే
త్తస్మా ద్ద్వేధా తపసః పంథాః ॥

8. చిత్తం యస్య స్వజని స్థానే
ప్రజ్ఞా బాహ్యే నభవేద్యస్య ।
అథత్సే త్వం భువనాధీశే
బుద్ధా క్రీడాం హృదయే తస్య ॥

9. వాణీ యస్య స్వజనిస్థానే
దూరేకృత్వా మనసా సంగం ।
మాత స్తత్ర ప్రతి బుద్ధా త్వం
శ్లోకైర్లోకం కురుషే బుద్ధమ్ ॥

10. హిత్వా దృశ్యాన్యతి సూక్ష్మాయాం
చక్షుర్యస్య స్వమహోవృత్తౌ ।
విశ్వా లిప్తా జగతాం మాత
ర్జాగ్రత్యస్మిన్ అచలాభాసి ॥

6. మేను ధ్యానించుట, పల్కుట, చూచుట, వినుట, జీవించుట- ఈ సర్వము నీవు నిద్రించుచున్నను నీ కాంతివల్లనే జరుగుచున్నవి.

7. ఓ తల్లీ! నాడీబంధమువలన, అభిమానమువలన గూడ నీవు దేహమందు గప్పబడియుంటివి. (కనుకనే వీటిని గ్రంథులనిరి). ఒకదాని కషాయముగల్గినచో, రెండవది నశించును. అందువల్ల తపస్సునకు రెండు మార్గములు సంభవించెను.

(ప్రాణము లేదా శబ్దసంబంధ మొకటి, మనస్సు లేదా రూపాభిమాన సంబంధ మొకటి.)

8. ఓ దేవీ! ఎవని చిత్తము స్వస్థానమందుండునో, యెవని ప్రజ్ఞ బాహ్యాగతముకాదో, వానిహృదయమందు తెలివివై నీవుంటివి.

(అనగా మనస్సును తన మూలమైన హృదయమందణచి, శిరస్సునకు బాహ్యాగత మగుటకై రానీకుండుట. ఇది శ్రీరమణ మహర్షియుపదేశములో నొకభాగము.)

9. ఓ తల్లీ! ఎవని వాక్కు మనస్సుతో కలియకుండ తన స్వస్థానమందుండునో (ప్రాణము తన మూలమం దనగియుండుట - మూలాధారమున) వానియందు నీవు జాగరూకురాలవై లోకములో కీర్తిజ్ఞానములు గలవానిగా నీ వొనర్చుచుంటివి.

10. ఓ తల్లీ! ఎవని కన్ను దృశ్యములను విడచి, తన యతి సూక్ష్మ అంతస్తేజో వృత్తియందుండునో (నిర్విషయాలోచన), విశ్వము నుండి యలిప్తవై (విశ్వవ్యాపారమునుండి విడి) నీ వాతనియందు మేల్కొని, యచలవై ప్రకాశింతువు.

11. శృణ్వత్కర్ణో దయితే జిష్ణో
రంతశ్శబ్దం ధ్రియతే యస్య ।
బుద్ధ్వా భూత్వా వియతా సార్ధో
రేకేభావం కురుషే తస్య ॥

12. యాతాయాతం సతతం పశ్యే
ద్యః ప్రాణస్య ప్రయతో మర్త్యః ।
విశ్వస్యేష్టాం తనుషే క్రీడాం
తస్మిన్ బుద్ధ్వా తరుణీంద్రస్య ॥

13. స్వాంతం యస్య ప్రభవేత్కార్యే
ష్వంబై తస్మిన్నయి నిద్రాసి ।
ఆత్మా యస్య ప్రభవేత్కార్యే
ష్వంబై తస్మిన్నయి జాగర్షి ॥

14. యస్యాఽహంతా భవతి స్వాంతే
తస్య స్వాంతం ప్రభవేత్కర్తుం ।
యస్యాఽహంతా భవతి స్వాత్మ
న్యాత్మా తస్య ప్రభవేత్కర్తుం ॥

15. స్వాంతం యస్య ప్రభవేత్కర్తుం
తత్కర్మాల్పం భవతి వ్యష్టేః ।
ఆత్మా యస్య ప్రభవేత్కర్తుం
తచ్ఛ్లాఘ్యం తే బలజిత్కాంతే ॥

11. ఓ తల్లీ! ఎవడు తన వినే చెవిలోని యంతశ్శబ్దమును గ్రహించునో, నీవా సాధకునిలో మేల్కాంచి యాకాశముతో నైక్యభావము నిత్తువు. (శబ్దమూలము నెఱుగుట యిదే.)

12. పవిత్రుడైన యెవడు ప్రాణముయొక్క యాతాయాతముల జూచునో. వానియందు మేల్కాంచిన యింద్రాణివై విశ్వమునకు ప్రియమైన క్రీడ సల్పుదువు.

13. ఓ యంబా! ఎవని చిత్తము కార్యములందు సమర్థమైనదో, వానియందు నీవు నిద్రించియుందువు. ఎవని యాత్మకార్యములందు సమర్థమైనదో వానియందు నీవు మేల్కాంచియుందువు. (చిత్తమే కర్తయని యహంకరించువాడొకడు, కర్త స్థానమాత్మయని తెలిసినవాడింకొకడు.)

14. ఎవని యహంకారము మనస్సునందుండునో, వాని మనస్సు చేయుటకు సామర్థ్యము బొందును (కాని వానియందు నీవు నిద్రింతువు. అనగా ఆత్మ కప్పబడును). ఎవని యహమాత్మయందుండునో, వాని యాత్మ చేయుటకు సామర్థ్యము బొందును. (అనగా దేవియే వానియందు చేయుచుండును.)

15. ఓ దేవీ! ఎవని మనస్సు చేయు సామర్థ్యము బొందునో, వాని యందా కర్మ యల్పమగును. ఎవని యాత్మ క్రియా సామర్థ్యమొందునో, వాని కర్మ శ్లాఘ్యము.
(అనగా వాని కర్మ కీర్తిమంతమగును.)

16. ఏతత్స్వాంతం హృదయా జ్జాతం
శీర్షేవాసం పృథగాధాయ
హార్దా హంతాం స్వయమాక్రమ్య ।
భ్రాంతానస్మాన్కురుతే మాతః ॥

17. అస్మాకం భోః కురుతే బాధా
మస్మజ్జ్యోతిర్జనని ప్రాప్య ।
స్వాంతే న్వైతత్కృత మన్యాయ్యం
కాంతేజిష్ణో శ్శృణు రాజ్ఞీ త్వం ॥

18. స్వాంతే తేజో హృదయాదాయా
చ్చంద్రే తేజో దినభర్తుర్వా ।
అశ్రాంతం యో మనుతే ధీర
స్తస్యస్వాంతం హృదిలీనం స్యాత్ ॥

19. మూలాన్వేషి స్ఫురదావృత్తం
నీ చైరాయా త్కబళీకృత్య ।
జానం త్యేకా హృదయస్థానే
యుంజానానాం జ్వలసీశానే ॥

20. శీర్షేచంద్రో హృదమేభాను
ర్నేత్రే విద్యు త్కులకుండేగ్నిః ।
సంపద్యంతే మహాసోంశై స్తే
జిష్ణోఃకాంతే సుతరాంశస్తే ॥

16. ఓ తల్లీ! హృదయమునుండి పుట్టిన ఆ చిత్తము శిరస్సునందు ప్రత్యేకముగా (వేఱొక కర్తగా) వాసముచేసి, హృదయమందుండు 'అహం'స్ఫురణను స్వయముగా నాక్రమించి (శిరస్సునుండి హృదయమునకు ప్రతిఫలించుటద్వారా), మమ్ములను భ్రాంతియందు ముంచుచున్నది.

(చిత్తము మనస్సగుట, చిత్తాకాశము భూతాకాశమగుటయి ట్లే)

17. ఓ తల్లీ! ఆ చిత్తము మా తేజస్సును బొంది మాకే యధిక బాధలు కలిగించుచున్నది. మనస్సుచే నిట్టి యన్యాయము చేయబడెను. ఓ దేవీ! రాణివైన నీవు వినువు.

(ఆత్మయందహమ్మహమ్మను భాసమానము సహజమైయున్నది. ఈ భాసమానమును బొంది చిత్తము ప్రకాశించినప్పు డహం చైతన్య మూలముగుఱించి సందేహము రావచ్చును, మానవచ్చును. చిత్తమే మూలమనిపించుట అహంకారము.)

18. సూర్యుని తేజస్సు చంద్రున కెట్లో, హృదయ తేజస్సు మనస్సున కట్లు. ఎవ డిట్లు తెలిసి నిత్యము తలచునో, వాని చిత్తము హృదయమందు లీనమగును.

19. ఓ దేవీ! ఆ చిత్తము హృదయమందు లీనమై, మూలాన్వేషియగుచు, మాటిమాటికి స్ఫురించుచు, గ్రంథులను కబళించి, క్రిందకు వచ్చును. అట్టి యోగుల హృదయమందు నీ వొక్కతెవే ప్రకాశింతువు.

20. ఓ తల్లీ! శిరస్సునందు చంద్రుడు, హృదయమందు భానుడు, నేత్రమందు విద్యుత్తు, కుండలినియం దగ్ని - ఇట్లు నీ తేజస్సు యొక్క అంశలతో గూడి యున్నవి.

21\. మన్వానాం త్వాం శిరసిస్థానే
పశ్యంతీంవా నయన స్థానే।
చేతంతీంవా హృదయస్థానే
రాజంతీంవా జ్వలనస్థానే॥

22\. యోనా ధ్యాయే జ్జగతాం మాతః
కశ్చిచ్ఛ్రేయానవసానాఽతః।
పూతం వంద్యం చరణం తస్య
శ్రేష్ఠం వర్ణ్యం చరితం తస్య॥

23\. దోగ్ధ్రీం మాయాం రసనాంవా యో
మంత్రం మాత ర్జపతి ప్రాజ్ఞః
సోఽయం పాత్రం కరుణాయా స్తే
సర్వంకామ్యం లభతే హస్తే॥

24\. ఛిన్నాంభిన్నాం సుతరాంసన్నా
మన్నాభావాదభితః ఖిన్నాం।
ఏతాం పాతుం భరతక్షోణీం
జాయేజిష్ణోః కురుమాం శక్తః॥

25\. క్లృప్తై స్సమ్యగ్బృహతీ ఛంద స్యై
తై ర్మాత్రాసమకై ర్వ్యలప్తైః।
కర్ణా ధ్వానం ప్రవిశద్భి స్సా
పౌలోమ్యంబా పరితృప్తాస్తు॥

---

చతుర్థం ద్వార్థతం శతకమ్ సంపూర్ణమ్.

21. శీర్షస్థానమందు నిన్నాలోచనరూపముగాను, నేత్రస్థానమందు చూపుగాను, హృదయస్థానమందు చైతన్యముగాను, కుండలినీ స్థానమందు దీప్తనుగాను, (ముందటి శ్లోకములో నన్వయము)

22. ఓ తల్లీ! ఎవడీలోకములో నిన్నట్లు ధ్యానించునో, వానికంటె శ్రీమంతు డింకొకడుండడు. వాని చరణము పవిత్రమై కొలువ దగినదగును. వాని చరిత్ర శ్రేష్ఠమై, వర్ణింపదగినదగును.

23. ఓ దేవీ! మాయాబీజముగాని, దోర్ఘ్రిబీజముగాని, రసనా బీజముగాని యే ప్రాజ్ఞుడు మంత్రముతో జపించునో, వాడు నీ కరుణకు పాత్రుడగును. వానికి సర్వకార్యములు హస్తగత మగును.

మాయాబీజము=హ్రీం
రసనా ,, =క్రీం
దోర్ఘ్రి ,, =హూం

24. ఓ దేవీ! ఛిన్నభిన్నమై క్షీణించుచు, అన్నములేక అంతటను దుఃఖించు భారతభూమిని రక్షించుటకు నాకు శక్తినిమ్ము.

25. లెస్సగా రచింపబడిన బృహతీ ఛందస్సు గల 'మాత్రా సమక' వృత్తము లింద్రాణి కర్ణమార్గమున ప్రవేశించి, యామెకు తృప్తినిచ్చుగాక.

---

ఓం

పంచమం

# పాంక్తం శతకమ్

## 1. మయూరసారిణీ స్తబకము

1. ప్రేమవాస భూమిరచ్ఛభావ
స్థానమాన మజ్జనాఘహా మే ।
ఇంద్రసుందరీ ముఖాబ్జభాసీ
మందహాస ఆపదం ధునోతు ॥

2. వీక్షితైః కృపాన్వితై ర్హరంతీ
పాతకాని మంగళం భణంతీ ।
జంభభేది జీవితేశ్వరీ మే
జన్మదేశముజ్జ్వలం కరోతు ॥

3. అంబరంచ దేవతానతభ్రూ
రంబతే తనుద్వయం యదుక్తం
ఆదిమా తయోర్వృషాకపిం తం
దేవ్యజీజన త్పరం జయంతం ॥

4. ఏతమేవ దేవి లోకబంధుం
సూరయో వృషాకపిం భణంతి ।
వర్షహేతు దీథితి ర్వృషాయం
కం పిబన్కరైః కపిర్నిరుక్తః ॥

5. కేచిదింద్రనారి చంద్రరేఖా
శేఖరం వృషాకపిం గదంతి ।
పండితాః పరేతు శేషశయ్యా
శాయినం వృషాకపిం తమాహుః ॥

6. బ్రహ్మణస్పతింతు వైద్యుతాగ్నే
రంశజం మరుద్గణేషుముఖ్యం ।
విశ్వరాజ్ఞి విఘ్నరాజమేకే
విశ్రుతం వృషాకపిం వదంతి ॥

1. ప్రేమకు వాసస్థలమై, నైర్మల్యమునకు నిలయమై, నిత్యము నమ్రజనుల పాపముల నంతముజేయు ఇంద్రాణీ మందహాసము నా యాపదలను తొలగించుగాక.

2. దయతోఁగూడిన చూపులచే పాతకములను హరించి, మంగళములనిచ్చి, యింద్రాణి నాజన్మదేశము నుజ్జ్వల మొనర్చుగాక.

3. ఓ యంబా! ఆకాశమనియు, నమ్రమైన భ్రూలతలుగల దేవతయనియు నీ రూపములు రెండుగా చెప్పబడుచున్నది. మొదటిది వృషాకపిని (సూర్యుని) కనెను, రెండవది జయంతుని కనెను.

4. ఓ దేవీ! పండితులీ వృషాకపిని లోకబాంధవుడనుచున్నారు. వర్షములకు హేతువగు కిరణములు గలవాడు గనుక 'వృషా' యనియు, కిరణములచే నుదకములను త్రాగును గనుక 'కపి' యనియు నిరుక్తము.

5. ఓ యింద్రాణీ! కొందఱు పండితులు వృషాకపి యనగా చంద్రరేఖ శిరోభూషణముగా గలవాడని (శివుడని) చెప్పుదురు. మఱికొందఱు వృషాకపిని శేషశయ్యాశాయి (విష్ణువని) యనుచున్నారు.

6. ఓ దేవీ! మఱికొందఱు వృషాకపిని వైద్యుతాంశకు బుట్టి, మరుద్గణములకు ముఖ్యుడై, వేదమంత్రముల కధిపతియైన బ్రహ్మణస్పతియనియు, విశ్రుతిగాంచిన విఘ్నేశ్వరుడనియు చెప్పుదురు.

7. భాస్కరశ్చ శంకరశ్చ మాత
ర్మాధవశ్చ మంత్రనాయకశ్చ ।
ఆత్మజేషు తేన సంతి నాంత
ర్వ్యాప కాంతరిక్ష విగ్రహాయాః ॥

8. వాసవోఽపి దేవి దేవతాత్మ
వల్లభ స్తవ చ్ఛలాంగనాయాః ।
ఆత్మజాతఏవ కీర్తనీయో
దేవతాపథేన దేహవత్యాః ॥

9. సా శవ స్యుదీరితాసి ధీరై
ర్దేహినీ విహాయసేంద్రసూ స్త్వం ।
లింగభేదతోఽనురూపత స్త
త్కీర్తనం శవోహి శక్తివాచీ ॥

10. నాదితి ర్విభిద్యతే శవస్యా
స్సర్వదేవమాతరం విదుర్యాం ।
యా మరుత్ప్రసూ రభాణి పృశ్ని
స్సాపి భిద్యతే తతోన దేవ్యాః ॥

11. శక్తిరేవ సా న్యగాది పృశ్ని
శ్శక్తిరేవ సాఽదితి ర్న్యభాణి ।
శక్తిరేవ సాఽభ్యధాయి భద్రా
శక్తిరేవ సా శవ స్యవాది ॥

12. విజ్జనః ప్రకృష్ట శక్తిభాగం
శబ్దమేవ పృశ్నిమాహ ధేనుం ।
యా పరైర్బుధై రభాణి గౌరీ
మానవేష్ట భాషయైవ నారీ ॥

7. ఓ తల్లీ! భాస్కర, శంకర, మాధవ విష్ణ్వీశ్వరులు (వృషా కపి నామధేయులు) అంతర్వ్యాప్తమైన అంతరిక్షమే శరీరముగా గలిగిన నీకు పుత్రులు కారను మాటలేదు.

8. ఓ దేవీ! దేవతాస్వరూపుడైన దేవేంద్రుడు కపట స్త్రీరూప మును దాల్చిన నీకు వల్లభుడు. ఆ యింద్రుడును ఆకాశశరీరవగు నీకు సుతుఁడనియే చెప్పఁదగును.

9. ఆ నీవు పండితులచే 'శవసి' యనబడుచుంటివి. ఆకాశ శరీరిణి వైన నీవు 'ఇంద్రసూః' (ఇంద్రునికనినది) యనియు పిలువబడు చుంటివి (ఇంద్రునకు మాత్రము వృషాకపినామము చెప్పబడ లేదు). లింగభేదమువలన, సాదృశ్యమువలన శవసి యని కీర్తింపబడితివి. 'శవ' శబ్దము శక్తివాచకము.

10. అదితి యనినను, శవసి యనినను నొక్కటే. ఎవతెను సర్వ దేవతలకు తల్లిగా తెలియుచుండిరో, యెవతె మరుత్తులకు తల్లియై 'పృశ్ని' యని పిలువబడుచున్నదో, ఆమె యీ శవసి కంటె వేఱుకాదు.

11. శక్తియే పృశ్నిగాను, అదితిగాను, భద్రగాను, శవసిగాను చెప్పబడుచున్నది.

12. పండితులచే గొప్పదిగా నెంచబడిన శక్తి భాగము 'పృశ్ని'. 'ధేను' అను శబ్దములతో పిలువబడెను. ఆ శక్తిభాగమునే యితర పండితులు మనుజుల కిష్టమైన భావముతో 'గౌరి' యని యు, స్త్రీ యనియు చెప్పిరి.

13. వ్యాపకత్వ కల్పితం విశాలం
దేశమేవ శక్తిభాగ మాహుః ।
బుద్ధిశాలి నోఽదితిం సవిత్రీం
యాపరైర్విచక్షణైః స్మృతా ద్యౌః ॥

14. నిత్యమోద రూపశక్తిభాగం
పండితాః ప్రకీర్తయంతి భద్రాం ।
ఉక్తిభేద చాతురీ ప్రలుబ్ధాః
సూరయః పరే శివాం జగుర్యాం ॥

15. వీర్యరూపభాగ ఏవ గణ్యః
పండితైః శవస్యభాణిశక్తేః ।
ఓజసో న సోఽతిరిచ్యతేంశో
భిద్యతే తతో న వజ్ర ముగ్రం ॥

16. వజ్రమేవ భాషయా పరేషా
ముచ్యతే ప్రచండ చండికేతి ।
యద్విభూతిలేశ చుంబితాత్మా
జీయతే న కేనచి త్పృథివ్యాం ॥

17. సర్వతోగతి శ్శచీతి శక్తిః
కీర్త్యతే బుధై రుదారకీర్తిః ।
సర్వభాగ వాచకం పదం తే
పావనం పురాతనం ప్రియం నః ॥

18. యశ్శచీతి నామకీర్తయే న్నా
పుష్కరేణ తే శరీరవత్యాః ।
దివ్యసుందరీ తనో రుతాహో
తం పరాభవేన్న దేవి పాపం ॥

13. బుద్ధిశాలులు వ్యాపకత్వముతో గూడిన విశాల దేశమును శక్తి భాగముగా చెప్పుచున్నారు. విచక్షణులైన మతికొందఱేది యాకాశమని చెప్పబడుచున్నదో, దానిని 'సవిత్ర' యనియు, 'అదితి' యనియు పిలచిరి.

14. నిత్యమోదరూపమైన శక్తి భాగమును పండితులు 'భద్ర'యనుచున్నారు. చతురోక్తిమంతులామెనే 'శివ' మ్మనుచున్నారు.

15. పండితులచే గణింపబడు శక్తియొక్క వీర్యరూప భాగమే'శవసి" యని చెప్పబడుచున్నది. ఆ వీర్యాంశ ఓజస్సుకంటె మించి వేఱుగాలేదు. ఈయుగ్రమగు వజ్రాయుధము కూడ దానికంటె వేఱుగాలేదు.

16. గూఢభాషలో వజ్రమే ప్రచండచండికయని చెప్పబడుచున్నది. ఏ చండికయొక్క విభూతి లేశముచే చుంబితుడైన పురుషుడు పృథ్విలో నెవరిచేతను జయింపబడజాలడో
(అట్టి చండికయని ముందు వాక్యముతో నన్వయము)

17. ఉదారకీర్తిగలిగి సర్వవ్యాపినియైన శక్తి పండితులచే శచీదేవిగా చెప్పబడెను. సర్వము నిరూపించు నామముగలది, పావనమైనది, పురాతనమైనదియైన యీ పేరు మాకు ప్రియమైనది. (శచీనామము)

18. ఓ దేవీ! ఏ మనుజు డాకాశశరీరము దాల్చినట్టి, దివ్యస్త్రీ తనువును బొందినట్టి నీ శచీనామమును కీర్తించునో, వానిని పాపము పొందదు.

19. అంబరం వరం తావాంబ కాయం
యస్సదా విలోకయన్నుపాస్తే ।
లోకజాల చక్రవర్తి జాయే
తం పరాభవేన్న దేవి పాపం ॥

20. పూర్ణిమా సుధాంశు బింబవక్త్రం
ఫుల్లవారిజాతపత్ర నేత్రం ।
శుభ్రతా నిధాన మందహాసం
కాలమేఘకల్ప కేశపాశం ॥

21. రత్నదర్పణాభ మంజుగండం
చంపకప్రసూనచారు నాసం ।
కుందకుట్మలాభ కాంత దంతం ।
కల్పపల్లవాభ దంతచేలం ॥

22. సద్వరాఽభయ ప్రదాయి హస్తం
సర్వదేవవంద్య పాదకంజం ।
దివ్యరత్నభూషణై రనర్ఘై
ర్భూషితం కనత్సువర్ణవర్ణం ॥

23. దివ్య శుక్లవస్త్రయుగ్మ ధారి
స్వర్గసార్వభౌమ నేత్రహారి ।
యస్మరే ద్వరాంగనావపు స్తే
తంపరాభవేన్న దేవి పాపం ॥

19. ఓ తల్లీ ! ఎవడు శ్రేష్ఠమైన నీ యాకాశరూపమును జూచుచు, సదా యుపాసన జేయుచుండునో, వానిని పాపము తాకదు.

20. పున్నమచంద్రుని బోలు ముఖము, వికసించిన పద్మదళములు వంటి నేత్రములు, నైర్మల్యమునకు నిధియైన మందహాసము, వర్షాకాల మేఘమువంటి కొప్పు,

21. రత్నఖచితమైన అద్దమువంటి చెక్కిళ్లు, చంపకమువంటి సొంపైన నాసిక, మల్లిమొగ్గలవంటి యందమైన పలువరుస, కల్పవృక్షముయొక్క చిగురువంటి రంగుగల యధరోష్ఠము,

22. ఇష్టమైన వరములను, అభయమునిచ్చు హస్తములు, సర్వదేవతలచే నమస్కరింపబడు పాదములు, విలువలేని దివ్యరత్నభూషణములచే నలంకృతమై బంగారుఛాయవంటి వర్ణముగలిగి,

23. దివ్యమైన తెల్లనివస్త్రములు (రెండు-లోవస్త్రము, పైవస్త్రము( ధరించునది. యింద్రుని నేత్రముల కింపయినదియగు వరాంగనయొక్క శరీరము నెవడు స్మరించునో, వానిని పాపములు తాకవు.

24. భారతక్షితే రిదం జనన్యా
శోకజన్య బాష్పవారిహర్తుం ।
దేహి శక్తి మాశ్రితాయ మహ్యాం
పాహి ధర్మ మింద్రచిత్తనాథే ॥

25. సద్వసిష్ఠ సంతతే రివాభి
స్సత్కవే ర్మయూరసారిణీభిః ।
సమ్మదం ప్రయాతు శక్రచేత
స్సంప్రమోహినీ సరోజనేత్రా ॥

---

## 2. మనోరమాస్తబకము

1. హసిత మాతతాయి పాతక
ప్రమథన ప్రసిద్ధ విక్రమం ।
అమరభూమి పాల యోషితో
మమ కరోతు భూరిమంగళం ।

2. కరుణయా ప్రచోదితా క్రియా
ద్భరతభూమి మక్షయశ్రియం ।
చరణ కంజరాజి దిందిరా
సురనరేశ్వరస్య సుందరీ ॥

3. న భవనం నవా జగత్పృథ
జ్నివసనాయితే సురార్చితే ।
యదఖిలాని విష్టపాని తే
వపుషి సర్వమందిరాణిచ ॥

24. ఓ దేవీ ! భారతభూమాత యొక్క- కన్నీటి నాపుట కాశ్రితుడ నైన నాకు శక్తినిమ్ము, ధర్మమును రక్షింపుము.

25. వాసిష్ఠగోత్రమందు బుట్టిన సత్కవియొక్క యీ మయూర సారిణీ వృత్తములచే నింద్రాణి సంతోషము బొందుగాక.

---

1. మర్త్యగుల పాపములను శిక్షించుటకు ప్రసిద్ధ పరాక్రమముగల యింద్రాణీ మందహాసము నాకధిక మంగళముల నిచ్చుగాక.

2. చరణకంజములందు లక్ష్మి ప్రకాశించుచున్న ఇంద్రాణీదేవి యొక్క దయచే ప్రేరేపింపబడి భారతభూమి యక్షయ సంపద లను బొందుగాక.

3. ఓ దేవీ ! నివసించుటకు నీకిల్లులేదు. జగత్తే నీకు గృహమని నచో, ఆ సమస్తము నీకు శరీరమైపోవుచు, నందున్న సర్వ భువనములు సర్వమందిరము లగుచున్నవి.
(ఆమె యొక్క యాకాశశరీరమందున్న భువనము లామెకు తిరుగ

4. మతి దవిష్ఠసీమ భాసురం
తవశరీర మేవ పుష్కరం ।
పరమ పూరుషస్య వల్లభే
భువనమేక ముచ్యతే బుధైః ॥

5. తరణ యస్సుధాంశవ స్తథా
సహభువా గ్రహా స్సహస్రశః ।
అయి జగంతి విస్తృతాని తే
వపుషి పుష్కరే జగత్యజే ॥

6. బహుభి రుష్ణ భానుభి ర్వృతాత్
బహుభిరిందుభి ర్వశీ కృతాత్ ।
వియతి లోకజాలధాత్రి తే
శతగుణం బలం ప్రశిష్యతే ॥

7. న విభు రేకకస్య భాస్వతో
విభవమేవ నా ప్రభాషితుం ।
కిముత తే దధాసి యోఽదరే
ద్యుతిమతాం శతాని తాదృశాం ॥

8. ఇహ విహాయసా శరీరిణీ
మతి సమీపవాసినీ మపి ।
న ఖలు కోపిలోకితుం ప్రభు
ర్భగవతీం పరామయుక్త ధీః ॥

గృహములగుట చమత్కారము. ఆమె శరీరము భువనముల కంటె సూక్ష్మము గనుక వాని యంతరమున నాకాశము నివసించి యుండును. ఆ విధముగా నామె కవి గృహము లగుచున్నవి.)

4. ఓ దేవీ! బుద్ధికి దూరమై ప్రకాశించు ఆకాశమును (ఆకాశము నాల్గు విధములని శ. 1, స్త. 3, శ్లో. 19 లో చెప్పబడెను. వానిలో ఆమెకు శరీరమగు పరమాకాశము నిచ్చట గ్రహించవలెను) పండితులాకలోకముగా చెప్పుచున్నారు.

5. ఓ దేవీ! ఆ యాకాశమనెడి నీ శరీరమున సూర్యులు, చంద్రులు భూమితో సహ వేలకొలది గ్రహములు, మఱియు ననేక జగత్తులు నివసించుచున్నవి.

6. ఓ తల్లీ! అనేక సూర్యులచే దహించబడు నుష్ణశక్తికంటె, ననేక చంద్రుల వశీకరణశక్తికంటె నాకాశమందున్న నీబలము నూరురెట్లధికము.

7. ఓ దేవీ! ఒక్క సూర్యుని వైభవము చెప్పుటకే పురుషు డసమర్థుడైనప్పుడు, నూర్లకొలది యట్టి సూర్యులు నీ యుదరమందున్న నీ వైభవము నెట్లు పురుషునకు చెప్పశక్యమగును.

8. ఈ యాకాశమును శరీరముగా గొని యెల్లరకు సమీపముగానున్న పరాదేవి చపలబుద్ధిగలవారిచే చూడబడలేదుగదా.

9. తదిద ముచ్యతే జనోఽజగ
ద్వపురమేయ మాదిదేవి తే ।
జనయతే యతోఽఖిలం దృశో
ర్విషయః భూతమేత దాతతం ॥

10. బహుళశ్శారకా గణైర్యుతం
కిమపి ఖం తవేహ వర్ష్మణి ।
శచి విభజ్య భావమైకయా
సుకవయో మహూంజగద్విదుః ॥

11. ఇద మినేందు భూమిలక్షై
ర్దినకరై స్సుధాకరై ర్గ్రహైః ।
బహుజగద్భిరన్వితం మహో
జగ దశేషధాత్రి నైకకం ॥

9. ఓ దేవీ! అట్టి యచింత్యమైన నీ శరీరము జనోలోకమనబడు చున్నది. అఖిలవ్యాప్తమైన యీ విశ్వభూత మేవిధముగా(మన) దృష్టికి జనించుచున్నట్లున్నదో,

(అవిధముగా జనోలోకమనబడుచున్నదని భావము. జననములను గలిగించు జనయితృత్వ ధర్మముచే లోకవాదినులా యాకాశశరీరమును జనోలోకమనిరి. ఇక్కడ ఆకాశనామావళి, లోక నామావళి - యీ రెండింటికి గల సంబంధము చెప్పబడెను. ఆకాశములు నాల్గని పూర్వము చెప్పబడెను. (1) ధూళిరూపమైనది, (2) ధూళిరహితమైనది (3) దానికంటె వేరైనది (4) పరాకాశము. నిజమున కాకాశమంతయు నొక్కటియైన సూక్ష్మరజోభూతమైనను, వ్యాపకత్వ పరిణామమునందా రజస్సు సాంద్రతవ్యత్యాసములను బొంది తేజోఽబన్నము లనబడు త్రివిధములైన అణువులు గలది యయ్యెను. ఈ త్రివిధాకాశములను లోకవాదినులు భూర్భువస్సువర్లోకములనిరి. దీనిని వ్యాప్తమొనర్చిన మహిమను మహర్లోకమనిరి. ఆ మహిమను బొందిన సచ్చిదానంద స్వరూపమఖండమైనను దాని సత్తత్వమును సత్యలోకమనియు, చిత్తత్త్వము తపస్తత్త్వము గనుక తపోలోకమనియు, విశ్వముల నెన్నింటినైన పుట్టించుటకు వస్తుసమృద్ధిచే నానందమనబడు తత్త్వమును జనోలోకమనియు పిలచిరి. ఈవిధముగా లోకనామావళి యున్నను సచ్చిదానంద స్వరూపమంతయు నలోక మనియు, ఆకాశము మాత్రము లోకసంబంధమనియు, మహర్లోకమనబడిన మహిమ లోకాలోకమనియు నెఱుగ వలెను. ఈ మహిమ జనోలోకమునుండి వికసించినందున దీనిచే వికసించిన జనయితృత్వ ధర్మము మహద్వ్యక్త జనోలోకమై మహోజ్జనోలోకమని యీ కవిచేతనే ఉమాసహస్రమను గ్రంథమందు పేర్కొనబడెను. కేవలమహిమనుగాక అట్టి మహోజ్జనోలోకమును జనోలోకమునుండి వేఱుచేసి మహర్లోకమనినట్లు తరువాత శ్లోకమునుండి తెలియగలదు. కాని యాకాశ నామావళియందు మహిమను వేఱుచేయక పరాకాశముగా వికసించిన జనోలోకమును గైకొనినట్లవగతమగును. సృష్టికొఱకు వికసించిన జనయితృత్వ ధర్మమువల్లనే చిత్సత్తులు జననీ జనకులయిరి.)

10. ఓ శచీ! బహు తారకాగణములతో గూడిన యొకానొక ఆకాశమును నీ యాకాశశరీరమునుండి విభజించి సుకవులు కొందఱు మహర్లోకమని వచించిరి.

11. ఓ దేవీ! సూర్య, చంద్ర, భూలక్షణములతో గూడిన (అనగా తైజస, అప్, అన్నమాణు భూతతత్వములుగల) సూర్యులు, చంద్రులు, గ్రహములుగల బహుళ జగత్తులతో నిండిన యీ మహర్లోకమంతయు నొక్కటికాదు.
(సువర్లోక, భువర్లోక, భూలోకసహితమని భావము.)

12. అజరమవ్యయం సనాతనం
మునిజనైక వేద్య వైభవం ।
న భవతీం వినా తపో జగ
త్పృథ గశేషనాథ నాయికే ॥

13. సకల దృశ్యమూలకారణం
తవచ సంశ్రయో నిరాశ్రయః ॥
జనని సత్యలోకసంజ్ఞయా
పరమ పూరుషోఽభిధీయతే ॥

14. అయిపురాతనర్షి భాషయా
గగనమేతదాప ఈరితాః ।
అథ యదాసు వీర్యముజ్ఝితం
భగవత స్త్వమేవ తత్పరే ॥

15. శచివిరాడ్భవత్యభాషత
శ్రుతి రపీదమేవ నామ తే ।
వితత విశ్వ విగ్రహాత్మని
ప్రథిత మేతదాహ్వయం పరం ॥

16. ఉపనిషద్గిరా విరాడ్వపూః
పురుష ఏషభాషయాన్యయా ।
ఉభయథాపి సాధు తత్పదం
భవతి తేన సంశయాస్పదం ॥

17. న వనితా నవా పుమాన్భవే
జ్జగతి యోఽంతరశ్శరీరిణాం ।
తనుషు లింగభేద దర్శనా
తనుమతశ్చ లింగముచ్యతే ॥

12. ఓ దేవీ! ముసలితనము, నాశనములేక సనాతనమై, ముని జనులచే తెలియబడు వైభవముగల తపోలోకము నీ కంటె వేఱుగా నుండదు.

13. ఓ తల్లీ! సకలదృశ్య (ప్రపంచ) మునకు మూలకారణమగునది, నీ కాధారమగునది, యితరము నాశ్రయించనిది యగు పరమ పురుషవస్తువే సత్యలోక సంజ్ఞచే తెలియబడుచుండెను.

14. ఓ దేవీ! పురాతన ఋషులభాషయందీ గగనముదకమని (కం=ఆకాశము, ఉదకము) చెప్పబడుచున్నది. పిమ్మట భగవంతుని వీర్యమా యుదకములో ప్రవేశపెట్టబడెననియు, ఆవీర్యము భరించినది నీవేయనియు పల్కుదురు.

15. ఓ శచీ! ఈ నీ పేరును (వీర్యయుక్తజలోలోకము లేదా జనయిత్ర్యాకాశమును) 'విరాట్' యనియు శ్రుతి చెప్పుచున్నది. విస్తారమైన విశ్వము స్వరూపముగాగల శరీరమునకు (గర్భమందు విశ్వముగల నీ శరీరమునకు) 'విరాట్' పదము ప్రసిద్ధము.

16. ఉపనిషద్భాషలో చెప్పబడిన 'విరాట్' వధూస్వరూపము నితర భాషలలో (శ్రుతిభాష గాక పౌరాణిక కావ్యాది భాషలలో) పురుషుడని చెప్పబడెను (విరాట్పురుషుడని). స్త్రీ పుంలింగములలో రెండు విధముల 'విరాట్' పదము సాధువగుటచే సంశయాస్పదముగా నున్నది.

17. (ఎట్లనగా) లోకములో శరీరమున కాంతర్యమునను్న వీర్య వస్తువు స్త్రీయుగాదు, పురుషుడు కాదు. స్థూలశరీరమునకు గల లింగభేద దర్శనమువలన శరీరమతమునను సరించి అంతరాత్మకు లింగము చెప్పబడెను. (విరాట్టునకు)

18. అఖిలనాథ వీర్యధారణా
ద్గగనభూమిరంగసామతా ।
సకలలోక బీజ భృత్త్వతో
గగనదేశ ఏవ పూరుషః ॥

19. స్ఫుట విభక్తగాత్రలక్ష్మణాం
నియతవాదినా మదర్శనాత్ ।
న పురుషో వియద్యథా వయం
న వనితా వియద్యథైవ నః ॥

20. అభివిమానతో ౽థవా శచీ
విబుధరాజయో ర్విలక్షణాత్ ।
వరవిలాసినీ వియత్తను
స్సదవికార ముత్తమః పుమాన్ ॥

21. హృదయమల్పమ ప్యదో జన
న్యనవమం విశాల పుష్కరాత్ ।
విమలదేహ దుర్గమధ్యగం
సకలరాజ్ఞి సౌధమస్తు తే ॥

22. వికసితం నిజాంశు వీచిభి
ర్హృదయ మాలయం విశాంబ మే ।
వికచ ముష్ణభానుభానుభి
ర్దశశత చ్ఛదం యథా రమా ॥

18. సర్వేశ్వరుని వీర్యము ధరించుటచే ఆకాశము స్త్రీ యనబడెను. సర్వలోకకారణబీజమును ధరించియుండుటచే నాకాశము పురుషుడని వచింపబడెను.

19. నియత వాదినులు (అనగా కంటికి గోచరమగునదియే నమ్ము వారు) స్ఫుట శరీరలక్షణము లాకాశమందు గోచరించనందున, దానిని మనవలె పురుషుడుగాగాని, స్త్రీగాగాని లేదనిరి.

20. ఆలాగున కాకున్నను, సర్వవ్యాప్తమైన అవికార సద్వస్తువు శచీంద్రుల యభేదముచే శ్రేష్ఠ స్త్రీలక్షణమును, ఆకాశశరీరమును బొందినట్టి యుత్తమ పురుషునివలె గణింపబడవచ్చును.

21. ఓ తల్లీ ! నిర్మలమైన దేహమను దుర్గమునకు మధ్యముననుండి విశాలాకాశముకంటె స్వల్పమైనను శ్రేష్ఠత్వమందు తీసిపోని యీ హృదయము నీకు సౌధమగుగాక.

(ఆకాశమందుంచబడిన సద్రూపలక్షణమగు వీర్యమే హృదయమైనట్లు ధ్వనించును. సత్తే ఆకాశమునకు వీర్యలక్షణమైనదని భావము. 'అయితిని' అను నర్థముగల హృదయము(హృత్ + అయం) ఆకాశమునుబొందిన సచ్చిత్ లక్షణము.)

22. ఓ యంబా ! స్వకీయకిరణములచే వికసించిన నా హృదయమనెడి యాలయమును, వేడి కిరణములుగల సూర్యునిచే వికసింపబడిన సహస్రదళపద్మమును లక్ష్మీదేవివలె ప్రవేశింపుము. (హృదయవస్తువు సూర్యునకు సామ్యము. ఈ యాలయమున

23. హృదయ సాధు సౌధశాయినీం
నయన రమ్యహర్మ్య చారిణీం ।
భువనరాజచిత్తమోహినీం
నమత తాం పరాం విలాసినీం ॥

24. తవ పరే మరీచివీచయ
స్తనుగుహాం ప్రవిశ్య విశ్రుతే ।
భరతభూమి రక్షణోద్యతం
గణపతిం క్రియాసు రుజ్జ్వలం ॥

25. గణపతే ర్మనోరమా ఇమా
స్స్వగుణ వేదినాం మనోరమాః ।
అవహితా శృణోతు సాదరం
సురమహీపతే ర్మనోరమా ॥

---

## 3. మణిరాగస్తబకము

1. జ్యోతిషాం నృపతిస్సకలానాం
శాంతిమేవ సదాభిదధానః ।
నిర్మలో హరతా త్సురరాజ్ఞీ
మందహాసలవో మమపాపం ॥

కావరణము లక్ష్మీనివాసమునకు పద్మమువలె సహస్రార కమలము కనుక లక్ష్మి యాహ్వానింపబడెను.)

23. హృదయమనెడి యోగ్యభవనమందు శయనించునది, నేత్రములనెడి మేడభాగములందు సంచరించునది, ఇంద్రచిత్తమును మోహింప జేయునదియైన ఆ పరాదేవికి నమస్కరింపుడు. (హృదయమందున్న ప్రజ్ఞయే నేత్రములందు దృశ్యమగునని భావము.)

24. ఓ దేవీ! నీ కాంతితరంగములు శరీరగుహను జొచ్చి (హృదయమును) భరతభూమిని రక్షించుట కుద్యుక్తుడైన గణపతిని ప్రజ్వలింప జేయుగాక.

25. సుగుణములను దెలియు పండితులను సంతోషపరచు గణపతి యొక్క యీ 'మనోరమా' వృత్తముల నింద్రాణి జాగ్రత్ప్రేమలతో వినుగాక.

---

1. సకలకాంతులకు ప్రభువై, సదా శాంతిని సమకూర్చుచు, నిర్మలమైయుండు ఇంద్రాణీ మందహాసలేశము నా పాపములను హరించుగాక.

2. దుష్టలోక దవిష్ఠపదాబ్జా
శిష్టలోక నివారణదక్షా ।
నాకలోక మహీపతిరామా
భారతస్య ధునోత్వసుఖాని ॥

3. దేవమాళిమణీ కిరణేభ్యో
విక్రమం స్వయమేవ దదనా ।
దేవరాజ వధూపద పద్మ
శ్రీస్తనోతు సదా మమ భద్రం ॥

4. దేవి తే వదనం బాహుకాంతం
సాక్షితత్ర పురందర చేతః ।
అంబ తే చరణావతికాంతా
వత్రసాక్షి మనస్స్మరతాం నమః

5. భాసురం సురసంహతి వంద్యం
సుందరం హరి లోచన హారి ।
పావనం నతపాప విధారి
స్వర్గరాజ్ఞి పదం తవసేవే ॥

6. జంఘికే జయతస్తవమాతః
సంఘ ఏవరుచాం యదధీనః ।
వాసవస్య దృశాంచ సహస్రం
యద్విలోకన లోభవిస్రమం ॥

7. సక్థినీ తవ వాసవకాంతే
రామణీయక సార నిశాంతే ।
వందతే వినయే సమయేయే
వందితస్తవ పావని వాణీ ॥

2. దుష్టసమూహమున కందరానిది, శిష్టులశోకమును నివారించు సామర్థ్యముగలది, స్వర్గమునకు రాణియునగు ఇంద్రాణి భారత దేశ కష్టములను దొలగించుగాక.

3. దేవతల కిరీటములందుండు మణుల కాంతులకు స్వయముగా మఱింత కాంతినొసగు ఇంద్రాణి పాదపద్మశోభ సదా నాకు క్షేమమిచ్చుగాక.

4. ఓ దేవి! నీ ముఖము బహు కాంతిమంతము. అందుల కింద్రుని మనస్సే సాక్షి. ఓ తల్లీ! నీ చరణము లతి కాంతిమంతములు. వానిని స్మరించు మా మనస్సే యందులకు సాక్షి.

5. ఓ తల్లీ! దేవతలచే నమస్కరింపబడును గనుక ప్రకాశవంత మైనవి, యింద్రుని నేత్రముల నాకర్షించును గనుక సుందర మైనవి, నమ్రుల పాపములను ఖండించును గనుక పావనమైనవి యగు నీ పాదములను నేను సేవించుచుంటిని.

6. ఓ తల్లీ! కాంతుల సమూహమంతయు నే పిక్కలయందు ఘనీభ వించెనో, ఇంద్రుని వేయి కన్నులు నే పిక్కలను జూచుటకు లోభించుచున్నవో, అట్టి నీ పిక్కలు ప్రకాశించుచున్నవి.

7. ఓ తల్లీ! వినయసమయమందే నీ తొడలను వాణీదేవి కూడ వందిజనమువలె నమస్కరించుచుండెనో, అట్టి నీ తొడలు సౌందర్య సారమునకు నిలయములు.

8. ఇంద్రనారి కటిస్తవ పృథ్వీ
మండల స్యతులా మహనీయే ।
మధ్యమం నభసః ప్రతిమానం
భోగినాం భువనస్యచ నాభిః ॥

9. ధీరతాం కురుతే విగతాసుం
యా సుపర్వ పతేర్నిశితాగ్రా ।
సా తవాంబ మనోభవశస్త్రీ
రోమరాజిరఘం మమహంతు ॥

10. రోమరాజి భుజంగశిశుస్తే
దేవి దేవపతేర్హృదయస్య ।
దంశనేన కరోత్యయి మోహం
జీవితాయ చిరాయ విచిత్రం ॥

11. పూర్ణహేమ ఘటావివ శక్రా
వాహితాం దధతావయి శక్తిం ।
విశ్వపోషణ కర్మణి దక్షా
వంబదుగ్ధ ధరౌ జయతస్తే ॥

12. లోకమాత రుణోరుహ పూర్ణ
స్వర్ణకుంభగతా తవ శక్తిః ।
లోకపాలన కర్మణి వీర్యం
దేవి వజ్రధరస్య బిభర్తి ।

13. అక్షయామృత పూర్ణఘటౌ తే
శక్రపత్ని కుచౌ తవపీత్వా ।
లోక బాధక భీకర రక్షో
ధూననే ప్రబభూవ జయంతః ॥

8. ఓ దేవీ! నీ కటి పృథ్వీమండలమువలె నున్నది, నడు మాకా శమువలె నున్నది, నాభి పాతాళమువలె నున్నది.

9. ఓ తల్లీ! ఏ నీ రోమరాజి దేవేంద్రుని ధైర్యమును గూడ హరించుచున్నదో, మన్మథుని శస్త్రమైన ఆ రోమరాజి నా పాప ములను హరించుగాక.

10. ఓ దేవీ! నీ రోమరాజి యనెడి పాముపిల్ల యింద్రహృదయ మును కరచి, యతనితో చిరాయుర్జీవితముకొఱకు వాని హృద యమునకు మోహమును గలిగించుచున్నది. విచిత్రము!

11. ఓ జననీ! జలపూర్ణములైన స్వర్ణఘటములవలెనుండి దేవేం ద్రునిచే నుంచబడిన శక్తిని ధరించు నీ కుచములు విశ్వపోషణ కర్మయందు సమర్థములై ప్రకాశించుచున్నవి.

12. ఓ తల్లీ! స్వర్ణకుంభములనెడి స్తనములందు నీ శక్తిపూర్ణమై యింద్రునితోగూడి లోకపానమందు (అతనికొఱకు) వీర్యమును భరించుచున్నవి.
(అనగా నామె కుచము లింద్రునకు పాలకశక్తినిచ్చుచు నితరు లకు పోషణశక్తి నిచ్చుచున్నవని)

13. ఓ దేవీ! అక్షయమగు నమృతపూర్ణఘటములనెడి కుచములను పానముజేసి జయంతుడు లోకములను బాధించిన భీకరరాక్షసు లను సంహరించుటకు సమర్థుడయ్యెను.

14. హస్తయోస్తవ మార్దవ మింద్రో
భాషతాం సుషమామపి దేవః ।
దాతృతా మనయో ర్మని వర్గో
వర్ణయత్యజరే పటుతాంచ ॥

15. పుష్పమాల్య మృదోరపి బాహో
శ్శక్తి రుగ్రతమా శరనాశే ।
దృశ్యతే జగతా మధిపే తే
భాషతాం తవక స్తను తత్త్వం ॥

16. కంబుకంఠి తవేశ్వరి కంఠ
స్తారహార వితాన విరాజీ ।
దేవరాడ్భుజ లోచన పథ్యో
దేవి మే భణతా ద్బహుభద్రం ॥

17. ఆననస్య గభస్తి నిధేస్తే
రామణీయక మద్భుత మిష్టే ।
అప్యమర్త్య నుతాఖిల సిద్ధే
ర్వాసవస్య వశీకరణాయ ॥

18. సప్రసన్న మలం రవిబింబం
చంద్రబింబ మతీవ నభాతి ।
సుప్రసన్న మహోజ్జ్వల మాస్యం
కేన పావని తే తులయామః ॥

14. ఓ తల్లీ! నీ హస్తముల మార్దవమును గుఱించి కాంతినిగూర్చి యింద్రుడే పల్కుగాక. మును లా హస్తదాతృత్వ పటుత్వము లను మాత్రము వర్ణింపగల్గిరి.

15. ఓ తల్లీ! పుష్పమాలికలవంటి నీ మృదుబాహువులశక్తి రాక్షస సంహారమందుగ్రమై గన్పట్టెను. నీ శరీరతత్త్వ మెవడు చెప్ప గలడు?

16. ఓ దేవీ! ముత్యాలహారముతో బ్రకాశించుచు, దేవేంద్రుని లోచనముల కింపైయున్న నీ కంఠము నాకుబహు భద్రము లను బల్కుగాక.

17. ఓ దేవీ! కాంతులకు నిధియైన నీ ముఖముయొక్క అద్భుత రామణీయకమునకు దేవతలచే నుతింపబడు సర్వసిద్ధులు గల యింద్రుని వశమొనర్చుకొను (వశీకరణ) సిద్ధి కలదు.

18. ఓ దేవీ! రవిబింబములో నెక్కువ ప్రసన్నతలేదు. చంద్ర బింబములో నెక్కువ యుజ్జ్వలత్వము లేదు. సుప్రసన్న ముగల మహోజ్జ్వలమైన నీ ముఖమును దేనితో మేము సరిపోల్చుట? (సూర్యునిలో నుజ్జ్వలత్వమే కలదు, చంద్రునిలోఁ బ్రసన్నతయే కలదు. రెండు గుణములు నీ ముఖమునఁ గలవు కనుక నిరుప మానము.)

19. లోచనే తవలోక సవిత్రి
జ్యోతిషశ్చ శవసశ్చ నిధానే ।
వస్తు మజ్జసమే నను లజ్జే
ధోరణీ మనుసృత్య కవీనాం ॥

20. ఆయతోజ్జ్వల పక్ష్మలనేత్రా
చంపక ప్రసవోపమ నాసా ।
రత్నదర్పణ రమ్య కపోలా
శ్రీలిపి ద్యుతి సుందరకర్ణా ॥

21. అష్టమీ శశి భాసుర ఫాలా
విష్టప త్రయ చాలక లీలా ।
స్మేర చారుముఖీ సురభర్తుః
ప్రేయసీ విదధాతు శివం మే ॥

22. మందహాసలవేషు వలక్షా
మేచకా చికుర ప్రకరేషు ।
శోణతా మధరే దధతీ సా
రక్షతు ప్రకృతి స్త్రిగుణా నః ॥

23. సర్వలోక వధూజనమధ్యే
యాం శ్రుతి స్సుభగామభిధత్తే ।
యాదివో జగతో రుచిసార
స్తాం నమామి పురందరరామామ్ ।

24. స్వర్గభూపతి లోచనభాగ్య
శ్రీశ్శరీరవతీ జలజాక్షీ ।
భారతస్య కరోతు సమర్థం
రక్షణే నరసింహ తనూజమ్ ॥

19. ఓ తల్లీ! నీ లోచనములు కాంతికి, సర్వతోగతికి నిధులు. కవుల ధోరణి ననుసరించి వానిని పద్మములతో బోల్చుటకు నేను లజ్జించుచుంటిని.

20. విశాలములై ప్రకాశించు నేత్రములు, సంపెంగపువ్వుతో సరియగు నాసిక, రత్నఖచితమైన అద్దములవంటి చెక్కిళ్లు, శ్రీకారమును బోలు సుందర కర్ణములు,

21. అష్టమీ చంద్రుని బోలు ఫాలము, ముల్లోకములను చలింపజేయు విలాసము, నవ్వుచే సుందరమగుచున్న ముఖముగల యింద్రాణి నాకు మంగళము లొనర్చుగాక.

22. చిఱునవ్వునందు తెలుపురంగు, తలవెంట్రుకలయందు నలుపు రంగు, అధరోష్ఠమందెరుపురంగు- యీ మూడు గుణములు గల ప్రకృతి మమ్ము రక్షించుగాక. (సత్త్వరజస్తమస్సులు)

23. సకలలోక నారీమణులలో శుభప్రదమైనది అని యేదేవిని వేదము చెప్పుచున్నదో, జగదాకాశముల రెండింటియందే దేవి కాంతిసారమో, అట్టి యింద్రాణికి నేను నమస్కరింతును.

24. శరీరమును ధరించిన యింద్రుని లోచన భాగ్యలక్ష్మియగు పద్మనేత్రములుగల దేవి భాతరక్షణకై నరసింహ పుత్రునకు సామర్థ్యము నిచ్చుగాక.
('సర్వభూపతి'కి బదులు 'స్వర్గ భూపతి' యని పాఠాంతరము)

25. లోకమాతురిమే రమణీయాః
పాకశాసన చిత్తరమణ్యాః ।
అర్పితాః పదయోర్విజయం తాం
సత్కవేః కృతయో మణిరాగాః ॥

## 4. మేఘవితానస్తబకము

1. అమరక్షితి పాలక చేతో
మదనం సదనం శుచితాయాః ।
స్మిత మాదివధూ వదనోత్థం
హరతాదఖిలం కలుషం మే ॥

2. సుతరామథనామతిఖిన్నా
మధునా బహుళం విలపంతీం।
పరిపాతు జగత్త్రయనేత్రీ
భరతక్షితి మింద్రపురంధ్రీ ॥

3. స్థలమే తదమర్త్య నృపాల
ప్రమదే తవ "మేఘ వితానం" ।
అయి యత్రపరిస్ఫురసీశే
తటిదుజ్జ్వల వేషధరా త్వం ॥

4. తటితా తవ భౌతిక తన్వా
జితమంబుధరే విలసంత్యా ।
ఉపమా భువి యాలలితానాం
యువచిత్త హృతాం వనితానాం ॥

25. గణపతియొక్క రమణీయమైన యీ 'మణిరాగ' వృత్తము లింద్రాణీ పాదములందర్పింపబడినవై ప్రకాశించుగాక.

---

1. ఇంద్రుని మనస్సును మదింపజేయునది, శుభ్రతకు స్థానమైనది యగు ఆదిస్త్రీయొక్క ముఖమునుండి వెడలు మందహాసము నా యఖిల కలుషములను హరించుగాక.

2. బొత్తిగా ధనములేనిదై, యతిఖిన్నురాలై, యిప్పుడు బహుళ రోదనము గావించుచున్న భరతక్షితిని త్రిలోకపాలకురాలైన యింద్రాణి రక్షించుగాక.

3. ఓ తల్లీ! మెరుపనెడి యుజ్జ్వలవేషముతో నీ వెచ్చట ప్రకాశింతువో, అట్టి మేఘసమూహము నీకు స్థలమైయున్నది. (ఈ స్తబకములోనివి మేఘవితానవృత్తములగుట చమత్కారము)

4. భూలోకమందు లలితమై, యువకచిత్తములను హరించు వనితలను బోలి మేఘమందు విలసించు తటిద్రూపముతోనున్న నీ భౌతిక దేహము జయప్రదముగా ప్రకాశించుచున్నది.

5. స్ఫురితం తవలోచన హారి
స్తనితం తవధీర గభీరం ।
రమణీయతయా మిళితా తే
శచిభీకరతా చపలాయాః ॥

6. చపలే శచి విస్ఫురసీంద్రం
ఘనజాలపతిం మదయంతీ ।
దితిజాత 'మవగ్రహ' సంజ్ఞం
జనదుఃఖకరం దమయంతీ ॥

7. ప్రభు మభ్రపతిం రమయంతీ
దురితం నమతాం శమయంతీ ॥
హరితాం తిమిరాణి హరంతీ
పవమాన పథే విలసంతీ ॥

8. అలఘు స్తనితం విదధానా
బలముగ్రతమంచ దధానా ।
హృదయావరకం మమ మాయా
పటలం తటిదాశు ధునోతు ॥

9. సురపార్థివ జీవిత నాథే
నిఖిలే గగనే ప్రవహంత్యాః ।
తటిత స్తవ వీచిషు కాచి
చ్చపలా లసతీహ పయోదే ॥

10. విబుధ ప్రణుతే ధనికానాం
భవనేషు భవంత్యయి దీపాః ।
పటుయంత్రబలా దుదితానాం
తవదేవి లవాః కిరణానాం ॥

5. ఓ శచీ! నీ తటిత్స్ఫురణ దృష్టిని హరించుచు, నీ గర్జన ధైర్యముతో గంభీరమైయున్నది. మెరుపురూపమున నున్న నీ భయంకరత్వము రామణీయముతో మిళితమైయున్నది.

6. ఓ దేవీ! మేఘాధిపతియైన యింద్రుని మదింపజేయుదానవై, జనులకు దుఃఖమును గలిగించిన 'అవగ్రహ' మను పేరుగల రక్కసుని ఖండించి నీవు ప్రకాశించుచుంటివి.

7. మేఘాధిపతియగు నింద్రుని రమింపజేయుదానవు, నమస్కరించువారి పాపములను హరించుదానవు, దిక్కుల తిమిరములను హరించుదానవు అయి నీ వాకాశమందు విలసిల్లుచుంటివి.

8. అధిక గర్జనయు, ఉగ్రబలమును ధరించు తటిత్తు నా హృదయము నాక్రమించిన మాయ యనెడి తమః పటలమును శీఘ్రముగా నశింపజేయుగాక.

9. ఓ తల్లీ! సమస్తాకాశమందు ప్రవహించు తటిద్రూప తరంగములలో నొకటియైన మెఱుపీ మేఘమందు ప్రకాశించుచున్నది. (అవ్యక్తముగా నంతటను అలలుగా వ్యాపించియున్న విద్యుచ్ఛక్తియొక్క ఒకయలయే మనకుఘోరమైన మెఱుపగుచున్నది)

10. ఓ తల్లీ! ధనికుల గృహములందు పటుయంత్ర బలమువలన బుట్టిన కిరణములుగల దీపములు (విద్యుద్దీపములు) నీ యొక్క లేశకాంతి యగుచున్నవి.

11. వ్యజనానిచ చాలయసి త్వం
బత సర్వ జగన్నృప జాయే ।
విబుధోఽభి దధాత్వథవా కో
మహతాం చరితస్య రహస్యం ॥

12. ఇహ చాలిత ఈడ్య మనీషై
రయి యంత్ర విశేష విధిజ్ఞైః ।
బహుళాద్భుత కార్యకలాప
స్తటిత స్తవ మాతరధీనః ॥

13. అచర స్తరుగుల్మలతాదిః
సకలశ్చచరో భువి జంతుః ।
అనితి ప్రమదే సురభర్తు
స్తటిత స్తవ దేవి బలేన ॥

14. మనుతే నిఖిలోఽపి భవత్యా
మనుజోఽనితి వక్తి శృణోతి ।
అవలోకయతేచ భణామః
కిముతే జగదంబ విభూతిం ॥

15. అతిసూక్ష్మపవిత్ర సుషుమ్నా
పథత స్తనుషు ప్రయతానాం ।
కులకుండ కృశాను శిఖాత్వం
జ్వలసి త్రిదశాలయ నాథే ॥

16. ఇతరో న సురక్షితి పాలా
త్కులకుండ గతో జ్వలనోఽయం ।
ఇతరేంద్ర విలాసిని నత్వ
త్కులకుండ కృశాను శిఖేయం ॥

11. ఓ తల్లీ! నీవు పంకాలను (వ్యజనములను) తిరుగునట్లు చేయు చుంటివి. ఆశ్చర్యము! ఏ పండితుడు గొప్పవారి చరిత్రమును జెప్పగలడు ?

12. ఓ మాతా! కొనియాడబడు బుద్ధిచే యంత్ర విశేషముల నెఱిగినవారు చేయు నద్భుతకార్య విశేషములన్నియు తటిత్తు వగు నీ కధీనములేకదా !

13. ఓ దేవీ! సంచరించలేని చెట్లు, పొదలు మొదలైనవి, సంచరించు సకల జంతుజాతముకూడ భువిలో తటిద్రూపిణివైన నీ బలము వల్లనే జీవించుచున్నవి.

14. ఓ తల్లీ! నీ సహాయమువల్లనే సర్వమానవులు చింతించుట, కదలుట, పలుకుట, వినుట, చూచుట చేయుచున్నారు. మేము నీ యైశ్వర్యము నేమి వర్ణించగలము.

15. ఓ దేవీ! అతి సూక్ష్మమైన పవిత్రమగు సుషుమ్నా నాడీ మార్గములో కులకుండాగ్ని శిఖవై, పవిత్ర దేహములందు నీవు ప్రకాశించుచుంటివి (తటిద్రూపముతో)

16. ఓ దేవీ! కులకుండమును బొందిన యీ అగ్ని యింద్రునికంటె వేఱుకాదు, ఆ కులకుండాగ్ని శిఖ నీకంటె వేఱుగాదు.

17. కులకుండ కృశాను శిఖాయాః
కిరణైః శిరసి స్థిత ఏషః ।
ద్రవతీందు రసారత మేత
ద్వపురాత్మమయం విదధానః ॥

18. మదకృద్బహుళామృత ధారా
పరిపూతమిదం మమ కాయం ।
విదధాసి భజన్మనుజాప్తే
కులకుండ ధనంజయ దీప్తే ॥

19. శిరసీ హసతః సితభానో
రమృతేన వపుర్మద మేతి ।
హృది భాత ఇనస్య చ భాసా
మతిమేతు పరాం శచి చేతః ॥

20. మమ యోగమదేన నతృప్తి
ర్నిజదేశదశా వ్యథితస్య ।
అవగంతు ముపాయ మమోఘం
శచి భాసయ మే హృది భానుం ॥

21. విదితః ప్రమదస్య విధాతుః
శశినో జనయిత్రి విలాసః ।
అహముత్సుక ఈశ్వరి భానో
ర్విభవస్య చ వేత్తు మియత్తాం ॥

17. కులకుండాగ్ని శిఖయొక్క కిరణములచే శిరస్సునందుండుచు, శరీరము నాత్మమయ మొనర్చు చంద్రు డనవరతము ద్రవించు చుండెను.

(ఆ కిరణములచే చంద్రుని ద్రవింపజేసి, తద్ద్రవముచే శరీరము నాత్మమయ మొనర్చునది కులకుండాగ్నిశిఖయే.)

18. ఓ దేవీ! నా యీ శరీరమును మదింపజేయు బహుళామృత ధారలచే నీవు నాకు పవిత్రత నిచ్చుచుంటివి.

(ఆకులకుండధనము భజించు మనుజులందు విస్తరించును.)

19. ఈ శిరశ్చంద్రుని యమృతస్రావముచే శరీరము మదముబొందు చుండ, హృదయమందు ప్రకాశించు సూర్యకాంతివలన చిత్తము జ్ఞానముబొందుచున్నది.

(ఈ రెండింటికి, అనగా సూర్యచంద్రుల వ్యాపారమున కగ్ని శిఖ కారణము)

20. ఓ శచీ। భారతదేశగతిని జూచి దుఃఖితుడనైయున్న నాకు యోగమదముచే తృప్తి గలుగదు. అమోఘమైన ఉపాయము నెఱుగుటకై నాహృదయమందు సూర్యుని ప్రకాశింపజేయుము.

21. ఓ తల్లీ! ఆనందముగలిగించు చంద్రకళావిలాసము నాకు తెలిసినది. సూర్యుని వైభవముయొక్క పరిమితి నెఱుగుటకు నేనుత్సాహపడుచుంటిని.

22. వరుణస్య దిశి ప్రవహంతీ
మదమంబ కరోషి మహాంతం ।
దిశి వజ్రభృతః ప్రవహంతీ
కురుబుద్ధి మకుంఠిత సిద్ధిం ॥

23. అమలామధిరుహ్య సుషుమ్నాం
ప్రవహాస్యధునాంబ మదాయ ।
అమృతా మధిరుహ్య చ కించి
త్ప్రవహేశ్వరి బుద్ధిబలాయ ।

24. భరతక్షితిరక్షణ కర్మ
ణ్యభిధాయ మనోజ్ఞముపాయం ।
అథ దేవి విధాయచ శక్తం
కురుమాం కృతినం శచి భక్తం ॥

25. నరసింహసుతేన కవీనాం
విభునా రచితైః కమనీయైః ।
పరితృప్యతు మేఘవితానై
ర్మరుతా మధిపస్య పురంధ్రీ ॥

---

పంచమం పాంక్తం శతకమ్ సంపూర్ణమ్.

22. పశ్చిమదిక్కున బ్రవహించుచు (వెన్నెముకయందున్న సషుమ్న యందు) గొప్ప మదమును గలిగించుచుంటివి. నీవు తూర్పు దిశ (ముందువైపున్న హృదయమందు - సూర్యుడు ప్రకాశించు వైపు) బ్రవహించి బుద్ధికి శాశ్వతసిద్ధి నిమ్ము.
(పాశ్చాత్యదేశములు, ప్రాగ్దేశములు శ్లేషచే నుద్దేశింపబడెను)

23. ఓ తల్లీ! నిర్మలమైన సుషుమ్న నధిష్ఠించి మదముకొఱకు ప్రవహించుచుంటివి. అమృతానాడి నధిష్ఠించి (శిరస్సునుండి ముందు వైపునకు హృదయమువరకు నుండు సూక్ష్మనాడి) కొంచెము బుద్ధిబలముకొరకు ప్రవహింపుమా.

24. ఓ దేవీ! భారతభూమిని రక్షించుటకై నా మనస్సునం దుపాయములుచెప్పి, భక్తుడనైన నన్ను శక్తిమంతునిగా జేసి, కృతకృత్యుని గావింపుము.

22. నరసింహపుత్రుడైన కవిశ్రేష్ఠునిచే రచింపబడిన కమనీయ 'మేఘవితాన' వృత్తము లింద్రాణికి దృప్తినిచ్చుగాక.

ఓం

షష్ఠం

# త్రైష్టుభం శతకమ్

## 1. ఉపజాతిస్తబకము

1. మందోఽపి బోధం విదధన్మునీనాం
స్వచ్ఛోఽపి రాగం త్రిదశేశ్వరస్య ।
అల్పోఽపి ధున్వన్ హరితాం తమాంసి
స్మితాంకురో భాతు జయంతమాతుః ॥

2. అశేషపాపౌఘనివారణాయ
భాగ్యస్య పాకాయచ దేవరాజ్ఞీ ।
శోకాకులాం భారతభూమిమేతాం
లోకస్యమాతా హృదయే కరోతు ॥

3. ధర్మద్విషామింద్రనిరాదరాణాం
సంహారకర్మణ్యతి జాగరూకాం ।
దేవీంపరా దేవపథే జ్వలంతీం
ప్రచండచండీం మనసా స్మరామః ॥

4. వ్యాప్తాతటిద్వా గమనే నిగూఢా
నారీ సురేశాన మనోరమావా ।
శక్తిః సుషుమ్నాపథ చారిణీవా
ప్రచండచండీతి పదస్యభావం ॥

1. మందమైనను నీ హాసము మునులకు జ్ఞానమిచ్చును, స్వచ్ఛమైనను ఇంద్రునకు రాగమిచ్చును, అల్పమైనను దిక్కుల చీకట్లను బోగొట్టును. అట్టి యింద్రాణీమందహాసము ప్రకాశించుగాక.

2. సకల పాపనివారణకొఱకు, భాగ్యమును వృద్ధిగావించుటకు శోకభూయిష్ఠమైన భారతభూమి నింద్రాణి తన మనస్సునందుంచుకొనుగాక.

3. ధర్మమునకు శత్రువులై యింద్రుని నిరాదరించువారిని సంహరించుట కతి జాగరూకురాలు, దేవయానమార్గమందు ప్రజ్వలించు శక్తియగు ప్రచండచండిని మేము స్మరించుచుంటిమి.

4. వ్యాపించునది యనిగాని, గమనమందు నిగూఢమైయుండు తటిత్తనిగాని, ఇంద్రసతి యనిగాని సుషుమ్న యందు సంచరించునది యనిగాని 'ప్రచండచండీ' పదమున కర్థము.

(యోగశాస్త్రమందు సుషుమ్నయనునది వ్యష్టిశరీరములందు వెన్నెముకద్వారా మూలాధారమునుండి సహస్రారమువఱకు ప్రవహించు శక్తి నాడియని పేర్కొనబడెను. నాడి యనగా శక్తి రశ్మియని భావము. ఇది సూర్యునినుండి ప్రతిశరీరమును బొందు రశ్మి. సూర్య రశ్మి యొక్కొక్కటియు శాఖలగుచు నెన్నిశరీరములున్నవో అన్నిశాఖలుగా విభాగమైనను. ప్రతిశాఖయు సమష్టియందు సుషుమ్నయగుచున్నది. ఆకాశమునుండి సూర్యుని బొందిన ప్రచండచండీ యను తేజశ్శక్తి సూర్యగోళమునుండి యీ విధముగా రశ్మిరూపములచే విభాగమగుచున్నను. ప్రతిరశ్మియందు సంచరించుచున్నందున నీమె సుషుమ్నామార్గసంచారిణి యగుచున్నది.)

5. సమస్తలోకావని నాయికాయాః
సుపర్వమార్గేణ శరీరవత్యాః ।
మాతుర్మహోంశం మహనీయసారం
విజ్ఞానవంత స్తటితం భణంతి ॥

6. నిగూఢతేజ స్తను రంబికేయం
ప్రచండచండీ పరితో లసంతీ ।
అవ్యక్తశబ్దేన శరీరవత్యాః
కల్పాః కవీనాం వచనేషు భిన్నాః ॥

7. శబ్దం వినానైవ కదాపి తేజ
స్తేజో వినానైవ కదాపి శబ్దః ।
శక్తిద్వయం సంతతయుక్తమేత
త్కథం స్వరూపేణ భవే ద్విభక్తః ॥

8. ఏకైవ శక్తిః జ్వలతి ప్రకృష్టా
స్వరత్యపి ప్రాభవతః సమంతాత్ ।
క్రియావిభేదా దిహ పండితానాం
శక్తిద్వయోక్తిస్తు సమర్థనీయా ॥

9. ఏకక్రియాయాశ్చ ఫలప్రభేదా
త్పునర్విభాగః క్రియతే బహుజ్ఞైః
కాళీంచ తారాం స్వరమగ్ర్యమాహుః
ప్రచండచండీం లలితాంచ తేజః ॥

5. సమస్తలోకములకు నాయకురాలైన ఆకాశశరీరిణి యగు తల్లి యొక్క మహనీయమైన మహోంశయొక్క సారమును పండితులు తటిత్తనుచున్నారు.
(తేజోంశ సారమును. ఇది వస్తువుతో కూడి సహస్సై తిరుగ వస్తువునుండి సారమువలె వస్త్వనుభవరూపిణియై మహస్సుగా నివృత్తియగును.)

6. నిగూఢ తేజోంశశరీరముగా గల యీ అంబిక సర్వత్ర ప్రకాశించు ప్రచండ చండిక యగుచున్నది. అవ్యక్త శబ్దాంశ శరీరముగా గల దేవియొక్క వికల్పములను (విభూతులను) కవులు భిన్న (దేవీ) నామములతో పిలచిరి.

7. శబ్దము లేనిదే తేజస్సు లేదు, తేజస్సు లేనిదే శబ్దముండదు. ఈ రెండును నిత్యము కలసి నీ శక్తిద్వయమగునప్పుడు, వానిచే నీ స్వరూపమున కెల్లు వ్యత్యాసము కలుగును.
(శబ్ద తేజములు రెండు శక్తియొక్క క్రియా చిచ్ఛాఖలు. ఈ రెండింటికి మూలశక్తి యొక్కటియే గావున మూలస్వరూపము నెఱుగుటకు రెండు మార్గములు విధింపబడెను.)

8. ప్రకృష్టమై యొకేశక్తి జ్వలించుచు, శబ్దించుచు నంతటను ప్రకాశించునప్పుడు పండితులచే చెప్పబడు శక్తిద్వయము క్రియాభేదమందే సమర్థనీయమగును.
(అనగా శబ్దించుట, జ్వలించుట అను క్రియలవలననే శబ్ద తేజములను వేఱుచేయగలమని భావము.)

9. ఒకే క్రియకు ఫలభేదమువలన తిరుగ విభాగము పండితులచే చేయబడెను. శ్లేష్మస్వరమును (ఫలభేదమువలన) 'కాళి'గాను, 'తార'గాను చెప్పుచున్నారు; తేజస్సును (ఫలభేదమువలన) చండికగాను, లలితగాను చెప్పుచున్నారు.

10. సంపద్యతే శబ్దగతే ర్హి కాలః
శబ్దో వరేణ్య స్త్వదభాణి కాళీ ।
ధ్యాతేన శబ్దేన భవంత రేద్య
ద్బుధా స్తతః శబ్దముశంతి తారాం ॥

11. యదక్షరం వేదవిదా మృషీణాం
వేదాంతినాం యః ప్రణవో మునీనాం ।
గౌరీ పురాణేషు విపశ్చితాం యా
సా తాంత్రికాణాం వచనేన తారా ॥

12. సంపద్యతే సంహృతి రోజసాయ
త్ప్రచండచండీ తదుదీరితౌజః ।
సిద్ధ్యే ద శేషోఽనుభవో యదోజ
స్యతో బుధా స్తాం లలితాం వదంతి ॥

10. శబ్దగతివలన కాలము పుట్టుచున్నది. అట్టి శ్రేష్ఠశబ్దము కాళి యనబడెను (గతిచే కాలమునుబుట్టించు శబ్దశక్తి). ధ్యానము చేయబడిన శబ్దమువలన సంసారమునుండి తరించుచున్నారు గనుక పండితులా శబ్దమును 'తారా' యనిరి.

(గతివలన పరిణామము లేదా పాచకత్వము ద్యోతనమగును. మఱియు క్రియాశక్తి తెలియబడుచున్నది. కనుక అవ్యక్తమగు శ్రేష్ఠశబ్దమేది క్రియాశక్తిచే నంతటను వ్యాపించి యాకాశవస్తువును వ్యాపింపజేయుటద్వారా యొక స్థితినుండి యింకొకస్థితికి దానిని పాకమొనర్చుచున్నదో, ఆ పాకక్రియాశక్తిచే వస్తురూపముయొక్క పూర్వస్థితి సంహరింపబడినట్లు, క్రొత్తది యుద్భవించినట్లుదోచును. అది నిజమునకు పరిణామమార్పు,దానికి కారణమగు శ్రేష్ఠశబ్దసంబంధ క్రియాశక్తిని కాళియనిరి. మన యుచ్ఛ్వాసనిశ్వాసలందీ శక్తి వైభవము తెలియబడును. ఇంక తారయనగా అవ్యక్తశబ్దశక్తియే యైనను, సర్వశబ్దముల కాంతర్యమందదియే యుండునను ననుభవము నిచ్చి వికృతులనుండి తరింపజేయును. ఉచ్ఛ్వాసనిశ్వాసలను గైకొనినచో, వాటి యొక్క శబ్దమూలము తార. ప్రణవస్వరూపము తార యగును. కేవల పరిణామక్రియాశక్తి కాళియగును. అనగా ప్రాణము, ప్రాణమందు వ్యాపారమును నిరూపించు శక్తి విభూతి అని రెండింటికి తాత్పర్యము. దశమహావిద్యలలో మొదటిది కాళి. రెండవది తార. మనయందు పరావాగ్రూపమున మూలాధారమందావేశించిన కుండలినీ శక్తియే కాళి. పశ్యంతీ వాక్కనబడు నవ్యక్తప్రణవశబ్దరూపిణి తార.)

11. వేదవిదులైన ఋషులు దేని నక్షరముగాను, వేదాంతులైన మునులు దేనిని ప్రణవముగాను, పురాణకర్తలు దేనిని గౌరిగాను పిలచిరో, తాంత్రికుల భాషలో నామెయే తార యగుచున్నది. (శబ్దమువలెనే తేజస్సుకూడ ఫలభేదముచే రెండు విధములుగా పిలువబడుట తరువాత శ్లోకములో చూడుడు.)

12. ఏ యోజస్సువలన సంహారక్రియ జరుగుచున్నదో (ప్రకాశించుచున్నదో) దానిని ప్రచండ చండిక యనిరి; యే ఓజస్సువలన సకలానుభవసిద్ధి (ఆత్మానుభవ మన్ని యనుభవములకు మూలమను ప్రకాశము) కలుగుచున్నదో దానిని లలిత యని బుధులు పల్కిరి.

13. ప్రచండచండీం లఘునాపదేన
చండీం విదుః కేచన బుద్ధిమంతః ।
ఏకే విదః శ్రేష్ఠమహోమయీం తాం
లక్ష్మీం మహత్పూర్వపదాం వదంతి ॥

14. అతీవసౌమ్యం లలితేతి శబ్దం
ప్రచండచండీతి పదంచ భీమం ।
దేవీ దధానా సుతరాం మనోజ్ఞా
ఘోరాచ నిత్యం హృదిమే విభాతు ॥

15. ప్రచండచండీంతు శరీరభాజాం
తనూషు యోగేన విభిన్న శీర్షాం ।
శక్తిం సుషుమ్నాసరణౌ చరంతీం
తాం ఛిన్నమస్తాం మునయో వదంతి ॥

16. కపాలభేదో యది యోగవీర్యా
త్సంపద్యతే జీవతఏవ సాధోః ।
తమేవ సంతః ప్రవదంతి శీర్ష
చ్ఛేదం శరీరాంతర భాసిశక్తేః ॥

17. ఉదీర్యసే నిర్జరరాజపత్ని
త్వం ఛిన్నమస్తా యమినాం తనూషు ।
ఉజ్జృంభణే విశ్వసవిత్రి యస్యాః
కాయంభవే వైద్యుతయంత్రతుల్యం

13. ప్రచండచండిని క్లుప్తముగా కొందఱు 'చండిక' యని వచించిరి. ఆ శ్రేష్ఠ తేజోరూపమునే మఱికొందఱు విద్వాంసులు 'మహాలక్ష్మి' అనుచున్నారు.

14. 'లలిత' యను సౌమ్యపదముగలది, ప్రచండచండి యను భీకర నామమును ధరించునది, అత్యంత మనోజ్ఞముగానున్నను ఘోరమైనది యగు శ్రేష్ఠ తేజశ్శక్తియైన దేవి నా హృదయ మందు ప్రకాశించుగాక. (మూలానుభవము నిచ్చుటకు)

15. శరీరధారులయొక్క శరీరములందు యోగముచే శీర్ష కపాలములను భిన్నముగావించి, సుషుమ్నా నాడియందు సంచరించుశక్తిని మునులు 'ఛిన్నమస్త' యనుచున్నారు.
(మస్తకమును ఛేదించునది.)

16. జీవించుచున్న సాధువునకు యోగబలమువలన కపాలభేదన మైనచో, దానినే శరీరమందు భాసించు శక్తియొక్క శీర్షచ్ఛేద మైనట్లు చెప్పుచున్నారు.
(నిజమునకు శీర్షచ్ఛేదము సాధకునకైనను, శక్తికైనట్లు ధ్వనించు పేరామెకు ఛిన్నమస్తయని పెట్టబడెనని తాత్పర్యము. ఈ సిద్ధి బొందిన సాధకుడు చనిపోనక్కరలేదు. ఈ కవి యిట్టి సిద్ధిని బొంది జీవించెను.)

17. ఓ తల్లీ! నీవు యోగుల (అనగా కపాలసిద్ధిబొంది జీవించియుండు యోగుల) శరీరములందు 'ఛిన్నమస్త' యని చెప్పబడుచుంటివి. ఏ నీవిజృంభణమువలన శరీర మొక వైద్యుతయంత్రతుల్యమగునో (అట్టి నీవు ఛిన్నమస్తవని లేదా అట్టి యోగుల శరీరములందు నీవు ఛిన్నమస్తవైతివని అన్వయము.)

18. పితు ర్నియోగాత్తనయేన కృత్తే
మస్తే జనన్యాః కిలరేణుకాయాః ।
త్వమావిశః పావని తత్కబంధం
తద్వా త్వముక్తాసి నికృత్తమస్తా ॥

19. ఛిన్నంశిరః కీర్ణకచం దధానాం
కరేణ కంఠోద్గత రక్తధారాం ।
రామాంబికాం దుర్జనకాలరాత్రిం
దేవీం పవిత్రాం మనసా స్మరామి ॥

20. భ్రువో రమా చంద్రధరస్య రామా
వాగ్వజ్రవైరోచన దీర్ఘనిర్యే ।
కూర్చద్వయం శస్త్రకృశాను జాయే
విద్యానృపాణాం సురరాజశక్తిః ॥

18. ఓ తల్లీ ! తండ్రియాజ్ఞపై కుమారునిచే (అనగా జమదగ్ని ముని యాజ్ఞపై పరశురామునిచే) తల్లియైన రేణుకయొక్క శిరస్సు ఖండింపబడగా, నీవా కబంధమందు ప్రవేశించితివి. అందువల్ల నైన నీవు 'నికృత్తమస్తా' యనబడుచుంటివి.

(ఇక్కడకూడ నికృత్తమస్తయైనది రేణుక యగునుకాని ఆమెను జీవింపజేయుటకు యోగుల సుషుమ్నయందు ప్రవేశించునట్లు కబంధమందు ప్రవేశించిన శక్తి నికృత్తమస్తకాదు. ఆమె యంశావతారిణియైన రేణుకనుబట్టియు ఛిన్నమస్తా నామము శక్తికి వచ్చియుండునని)

19. విడిపోయిన కొప్పుగలిగి ఛిన్నమైన శిరస్సును చేతియందు ధరించినది, కంఠమునుండి రక్తధారలు కారునది, దుర్జనులకు కాలరాత్రివలె భయంకరమై యుండునది యగు పరశురామ జననియైన పవిత్రదేవిని నేను మనస్సులో స్మరించుచుంటిని.

(పరశురామ జననియైన రేణుకవల్లనే లోకమునకు ఛిన్నమస్తా శక్తివైభవము దెలిసెను. ఆ వైభవ మెట్టిదనిన నిజముగా కంఠపర్యంతము నరుకబడిన శిరస్సుచే ప్రాణము నిర్గమించక, కబంధము ప్రాణయుక్తమై, తెగిన శిరస్సును చేతితో ధరించి యాశ్చర్యము గలిగించెను. కనుకనే రేణుక సాక్షాచ్ఛక్తి రూపిణిగా ధ్యానింపబడుచున్నది.)

20. ధ్రువః = ఓం; రమా = శ్రీం; చంద్రధరస్యరామా = హ్రీం; వాక్ = ఐం; వజ్రవైరోచన దీర్ఘనిః యే = వజ్రవైరోచనీయే ('న'కారమునకు దీర్ఘని అనగా 'నీ'. అట్టి యంతమునకు 'యే' అను సంబోధనము జేర్చుట); కూర్చద్వయం = హూం హూం ('హూం' అనుదానిని కూర్చయనియు ధేనుబీజమనియు కూడ

21. మాయా ద్విఠారంయది సైకవర్ణా
విద్యైకవర్ణాయది ధేనురేకా
ధేన్వాది సంబోధనమన్త్ర మగ్నే
ర్విలాసినీ చేతి ధరేందువర్ణా ॥

22. చతుష్టయేష్వేతాన్యతమం గృహీత్వా
మంత్రం మహేంద్రస్య మనోధినాథాం ।
భజేత యస్తాంత్రిక దివ్యభావ
మాశ్రిత్య సిద్ధీః సకలాః సవిందేత్ ॥

పిలుతురు); శస్త్ర, కృశానుజాయే=శస్త్రబీజమగు 'ఫట్', అగ్నిభార్యయగు-లేదా అగ్నిశక్తియగు 'స్వాహా'యు-కలుపగా వచ్చు మంత్రము-నృపాణాం సురరాజ శక్తిః విద్యా (భవతి)= శ్రేష్ఠమైన సురరాజ శక్తియగు ఇంద్రాణీ విద్యయగును. (ఇంద్రాణీయే ప్రచండచండిక లేదా ఛిన్నమస్త. ప్రచండచండిక యొక్క తాంత్రిక మంత్రమిచ్చట చెప్పబడెను.

21. 20 వ శ్లోకములో చెప్పబడిన మంత్రములో 'హ్రీం' అను మాయాబీజము రెండుసార్లు వచ్చిన దింకొక మంత్రము; ధేను బీజ మొక్కటియు నింకొక మంత్రము; ఆదిని ధేనుబీజము, తరువాత సంబోధింపబడిన వజ్రవైరోచని, తరువాత అస్త్ర బీజము, చివరను 'స్వాహా' కలవి మఱియొక మంత్రము.

ఈవిధముగా పూర్వశ్లోక మందొక మంత్రము చెప్పబడి దానిలో చేయబడిన మార్పులచే మఱి మూడు మంత్రము లిచ్చట పేర్కొనబడెను. మొత్తము నాలుగు మంత్రము లిట్లుండును.-

(1) ఓం శ్రీం హ్రీం ఐం వజ్రవైరోచనీయే హూం హూం ఫట్ స్వాహా (16 అక్షరములు)

(2) ఓం శ్రీం హ్రీం హ్రీం ఐం ,, ,, (17 ,, )

(3) హూం (ఏకాక్షరి)

(4) హూం వజ్రవైరోచనీయే ఫట్ స్వాహా (11 అక్షరములు)

22. పైని చెప్పబడిన నాల్గింటిలో నొక్క మహావిద్యామంత్రము నైనను గ్రహించి యెవడు దేవిని తాంత్రిక దివ్యభావము నాశ్ర యించి భజించునో, వాడు సకలసిద్ధులను బొందును.

(మంత్రాక్షరములే దేవి కంగములని యెంచి మంత్ర రూప మామెకు రూపమగునట్లు ధ్యానించుట తాంత్రిక దివ్యభావము)

23. సంహోత్ర మిత్యద్భుతశక్తి యుక్తం
వృషాకపేర్దర్శన మంబ మంత్రం ।
యో వైదికం తే మనుజో భజేత
కించిన్న తస్యేహ జగత్యసాధ్యం ॥

23. అద్భుతశక్తియుక్తమై, వృషాకపికి దర్శనమైనట్టి 'సంహోత్ర' మనెడి నీ యొక్క వేదమంత్రము నెవడు భజించునో, ఓ దేవి ! వాని కీ జగత్తునం దసాధ్యమైన దేదియు నుండదు.

ఆ మంత్రమిది :- "సంహోత్రం స్మపురా నారీ సమనం వావ గచ్ఛతి, వేధా ఋసత్య వీరిణీంద్ర పత్నీ మహీయతే, విశ్వ స్మాదింద్ర ఉత్తరః"

(వృషాకపికి నామాంతరమగు గణపతికి (అనగా నీ కవికి) ఒక వేదమంత్రము దర్శనమయ్యెను. అది యింద్రాణీ యనబడు చండీ మంత్రమై, అగ్నిహోత్రమునందర్పిత మగు సంహోత్రసంబంధము గలది గావున నీ శ్లోకమందు శ్లేషచే కవి దానిని ధ్వనింపజేసి నట్లును భావించవచ్చును. వైదిక మంత్రములందు తాంత్రికమంత్రములందువలె బీజాక్షరము లుండవు. ఎందువల్లననగా, తాంత్రిక మంత్రములు శబ్ద ప్రధానములుకాగా, వైదిక మంత్రము లర్థ (తేజ) ప్రధానములు. అట్లైనను, తాంత్రిక మంత్రములలో శ్రేష్ఠమైన వాటికి తత్త్వార్థము లుండకపోవు. దర్శనమైన వేదమంత్ర మింద్రాణీ మహావిద్యయనియు, విరాణ్మహా మంత్ర మనియు, వజ్రాస్త్రవిద్యయనియు, రేణుకా విద్యయనియు బహువిధములుగా వేదమందు స్తుతింపబడి, యిహపరముల రెండింటియందును సకలార్థ సిద్ధిదాయక మగుచున్నది. అంతే గాక, మంత్రార్థముచే సహస్రారసిద్ధికి మించిన హృదయసిద్ధినిచ్చునది యగుచున్నది. ఆ మంత్రమిది:-)

"రాయస్కామో వజ్రహస్తం సుదక్షిణం పుత్రోన పితరంహువే."

(స్త్రీలు జపించునప్పుడు 'పుత్రీణ' అని 'పుత్రోన' కు బదులుగా మార్చవలెను. ఈ మంత్రమునకు 'స్వాహా' అనిచేర్చి, దీనిచే నగ్నియందు హోమములు చేయబడును.)

అర్థము :- రాయస్ = సకలార్థ కామమోక్షములను, కామో = కోరు చున్నవాడనై, వజ్రహస్తం = వజ్రాయుధమును హస్తమందు ధరించువాడును (ఇంద్రుడు) - లేదా ఆధ్యాత్మికార్థముచే వజ్ర దండ మనబడు సుషుమ్నా శక్తియుతమగు వెన్నెముకను హస్త ముచే హృదయస్థానమునుండి ధరించువాడును, సుదక్షిణం = దానముచేయుటకు సుప్రసిద్ధమైన దక్షిణహస్తము కలవాడును

---

24. ప్రచండచండీ ప్రమదే పురాణే
పురాణవీరస్య మహోధినాథే ।
ప్రయచ్ఛ పాతుం పటుతాంపరాం మే
పుణ్యామిమా మార్యనివాస భూమిం ॥

(అర్ధనారీశ్వర రూపమందు పురుషదైవమే కుడిచేయి కలవాడు)-అధ్యాత్మార్థము చొప్పున సుప్రసిద్ధమైన దక్షిణభాగమునసుండు సూక్ష్మహృదయము స్థానముగా గలవాడును అగు సచ్చిదానంద ఆత్మస్వరూపుని, పుత్రో న పితరం = తండ్రిని కొడుకువలె, హువే=పిలుచుచున్నాను- (అనగా సర్వార్థముల కధికారియైన నింద్రు నా సంపద లర్థించుటకు హక్కుగల పుత్రునివలె కోరుదు నని తాత్పర్యము.

(ఈ యర్థములు బాహ్యమందు ధనధాన్యాది సంపదలకును, ఆంతర్యమం దాత్మ సంపద యనదగు జ్ఞానమునకు, నితరసిద్ధుల కును జెందును. ఈ మంత్రము ద్విపాద విరాట్ ఛందస్సు గలదియై, వసిష్ఠఋషికి దర్శనమయ్యెను. ఈ కలియుగ మందిది విస్మరింపబడి, తిరుగయుగము మార్పును సంకల్పించిన వాసిష్ఠ గణపతిమునికి దర్శనమైనందున రెండుపక్షములందును దీనికి ఋషి వాసిష్ఠుడే యగుచున్నను గణపతి నామధేయుడైన యీ వాసిష్ఠుడు వృషాకపినామాంతరము గలవాడగుటయు గమనింప దగును. ఈ మంత్ర మద్భుత శక్తియుక్తమని వాసిష్ఠుని యను భవమే ప్రమాణము. శ్రీరమణు డుపదేశించిన హృదయవిద్య కేవల విచారణ మార్గమునకు జెందినదై యుండగా, భక్తి మార్గముచే మంత్రధ్యానమువలనను హృదయవిద్య కుపాయ ముండవలెనని వాసిష్ఠ గణపతిముని చింతించు సమయమున రేణుకా కృపచే నీ మంత్రదర్శనమయ్యెను. పరశురామ దర్శ నముతోకూడి యిది విదితమై శ్రీరమణోపదేశమునకు కవచ మంత్ర మగును.)

24. ఓ ప్రచండచండీ! నీవు పుణ్యమైన యీ ఆర్యభూమిని రక్షిం చుటకు నా కధిక పటుత్వము నిచ్చెదవుగాక.

25. ప్రపంచరాజ్ఞీం ప్రథితప్రభావాం
ప్రచండచండీం పరికీర్తయంత్యః ।
ఏతాః ప్రమోదాయ భవంతు శక్తే
రుపాసకానా ముపజాతయో నః ॥

---

## 2. రథోద్ధతాస్తబకము

1. క్షాలనాయ హరితాం విభూతయే
విష్టపస్య మదనాయ వజ్రిణః ।
తజ్జయంత. జననీ ముఖాబ్జతో
నిర్గతం స్మిత సుఘం ధునోతు నః ॥

2. అన్నలోపకృశ భీరుకప్రజాం
భిన్నభావ బలహీన నేతృకాం ।
వాసవస్య వరవర్ణినీ పరై
రర్దితా మవతు భారతావనిం ॥

3. పాణిపాద మనిమేషరాజ్ఞి తే
పారిజాత నవ పల్లవోపమం ।
అక్షపా విరహ మంగభా సరి
ద్వాసి చక్రమిథునం కుచద్వయం ॥

4. పూర్ణిమాశశి యశోఽపహారకం
సంప్రసాద సుషమాస్పదం ముఖం ।
జ్ఞానశక్తిరుచి శేవధీ దృశౌ
రక్తవర్ణకసుధా ఘనోఽధరః ॥

25. ప్రపంచమునకు రాణివై, యధిక ప్రభావముగల ప్రచండచండిని కీర్తించు నా యీ ఉపజాతివృత్తములు దేవి నుపాసించువారికి సంతోషము నిచ్చుగాక.

---

1. దిక్కులను శుభ్రపరచుటకు, లోకముల కైశ్వర్య మిచ్చుటకు, ఇంద్రునకు ముద మిచ్చుటకు వెడలు ఇంద్రాణీ ముఖహాసము మా పాపములను తొలగించుగాక.

2. అన్నలోపముచే కృశించి, భయభ్రాంతులై యున్న ప్రజలును; భిన్నభావములచే దుర్బలులైన నాయకులును గల భారత భూమిని పీడించు శత్రువులనుండి యింద్రాణి రక్షించుగాక.

3. ఓ తల్లీ! నీ పాణిపాదములు నూత్న పారిజాత పల్లవములను బోలి ప్రకాశించుచున్నవి. నీ కుచద్వయము రాత్రియందు విరహము లేనివియై, అంగకాంతియనెడి నదియందు వసించు చక్రవాక మిథునమువలె నున్నది.

4. ఓ దేవీ! పూర్ణిమచంద్రుని కీర్తి నపహరించు నీ ముఖము ప్రసన్నతాశోభ కాస్పదమైయున్నది. నీ దృష్టులు జ్ఞానశక్తి కాంతులకు నిధులు. నీ యధర మెరుపురంగుగల అమృతము ఘనీభవించినట్లున్నది.

5. మర్దయ స్తిమిర ముద్ధతం దిశా
మల్ప మప్యధిక వైభవం స్మితం ।
ప్రావృడస్త యమునాతరంగ వ
న్నీలచారురతి పావనః కచః ॥

6. వల్లకీంచ పరుషధ్వనిం వద
న్దుఃఖితస్య చ ముదావహః స్వరః ।
చారుహాస వశ బలాఽలసాగతిః
కాయ ధామ వచసాం నపద్ధతౌ ॥

7. యోగసిద్ధి మతులాం గతా మతి
శ్చాతురీచ బుధమండలస్తుతా ।
విష్టపత్రితయ రాజ్యతోఽప్యసి
త్వం సుఖాయ మహతే బిడౌజసః ॥

8. శ్యాముదీక్ష్య ధృత దేవతాతనుం
దీప్తపక్ష్మల విశాలలోచనాం ।
అదితేర్జనని జన్మినా మభూ
ద్వాసవస్యరతి రాదిమేరసే ॥

9. ఆదిమం రస మసాదివాసనా
వాసితౌ ప్రథమ మప్యగృహ్ణతాం ।
సమ్మదస్యనిధి మాది దంపతీ
సోఽచల త్త్రిభువనే తతః క్రమః ॥

10. జ్యాయసా దివిషదాం పురాతనీ
నీలకంజ నయనా విలాసినీ ।
యద్విహారమతనో త్ప్రరోచనం
తత్సతా మభవ దాదిమేరసే ॥

5. ఓ దేవీ! నీ నగవు దిక్కులయొక్క యధికములగు చీకట్లను మర్దించుచు, కొంచెముగా వెడలుచున్నను అధిక వైభవము గలదై యున్నది. నీ కొప్పు శరత్కాల యమునాతరంగమువలె నీలవర్ణముతో గూడి అతిపావనమై యున్నది.

6. ఓ దేవీ! నీ స్వరము వీణాస్వరమును పరుష మనిపించుచు, దుఃఖించువారి కానంద మొసగుచున్నది. మనోహర విలాసవశ మగు నీ నడక మందముగానున్నది. నీ శరీరకాంతి వర్ణింప నలవి గాకున్నది.

7. ఓ దేవీ! నీ బుద్ధి యతులమైన యోగసిద్ధులను బొందియున్నది. నీ చాతుర్యము పండితులకు స్తుత్యమైయున్నది. దేవేంద్రునికి త్రిలోకాధిపత్యముకంటె నీవేయెక్కువ సుఖము నిచ్చుచున్నావు.

8. ఓ తల్లీ! దేవతాశరీరమును ధరించి, ప్రకాశించు పక్ష్ములతో (అనగా రెప్ప వెండ్రుకలతో) గూడిన నేత్రములను బొందిన నిన్ను జూచినప్పుడు దేవేంద్రునకు శృంగారమనెడి ఆదిమరసము పుట్టెను.

9. అనాదియైన వాసనచే వసించు నాదిదంపతులు సంతోషనిధి యగు శృంగారరసము నాదియందు బొందిరి. అందువల్లనే ముల్లోకములందా క్రమము ప్రాకెను.

10. నీలోత్పలములవంటి నేత్రములుగల ఆ పురాతనస్త్రీ దేవతా ప్రభువైన యింద్రునితో విహారమే కారణమువలన జేయుచుండెనో, ఆ కారణమువల్లనే సత్పురుషుల కా శృంగారరసమునం దభిలాష గల్గెను.

11. నత్వదంబ నళినాననాఽధికా
నాపి నాకపతితోఽధికః పుమాన్ ।
నాధికంచ వనమస్తి నందనా
న్నాది మాదపి రసోఽధికోరసాత్ ॥

12. నాయికా త్వమసమాన చారుతా
నాయకః స మరుతాం మహీపతిః ।
నందనంచ రసరంగభూః కథం
మన్మథస్య నభవేదిహోత్సవః ॥

13. దేవి వాం మృతికథైవ దూరతో
జాతు చిద్గళతినైవ యౌవనం ।
కాంక్షితః పరికరో నదుర్లభః
కిం రసః పరిణమేదిహాఽన్యథా ॥

14. విష్టపస్య యువరాజ కేశవే
త్రాణభారమఖిలం నిధాయ వాం ।
క్రీడతో రమరరాజ్ఞి నందనే
క్రీడితాని మమ సంతు భూతయే ॥

15. యద్యువామమరరాజ్ఞి నందనే
కుర్వతో రహసి దేవి మంత్రణం ।
తత్రచేన్మమ కృతిర్మనాగియం
స్పర్శమేతి భువి కోను మత్కృతీ ॥

16. క్రందనం యది మమేహ వందినో
నందనే విహరతో స్సవిత్రి వాం ।
అంతరాయకృదధాబ్జకాంతి తే
సంప్రగృహ్య చరణం క్షమాపయే ॥

11. ఓ యంబా ! నీకంటె నధికురాలైన పద్మముఖి లేదు; నాకపతి కంటె నధికుడైన పురుషుడు లేడు; నందనవనముకంటె నధిక మగు వనము లేదు; శృంగారరసముకంటె నధికరసము లేదు.

12. సాటిలేని సౌందర్యముగల నీవు నాయికవు. దేవతాప్రభువగు ఇంద్రుడు నాయకుడు. నందనవనము రసమునకు రంగస్థలము. ఇక్కడ మన్మథున కింక ఉత్సవము కాకేమి ?

13. ఓ దేవీ ! మీ యుభయులకు మృత్యుకథ దూరమైయున్నది. మీ యౌవన మెప్పటికి జారదు. కోరిన పరికరములు మీకు లభించకపోవు. ఇంక రసమునకు లోపమేమున్నది ?

14. ఓ తల్లీ ! యువరాజైన విఘ్నవునకు సర్వవిఘ్నపభారము విడచి, నందనవనమందు మీరు సల్పు క్రీడలు నా యైశ్వర్యమున కగు గాక (గణపతి జన్మకని).

15. ఓ దేవీ ! నందనవనమందు మీరు రహస్యాలోచనలు సల్పు నప్పుడు నా యీ కృతి కొంచెము మిమ్ము స్పృశించినచో నాకంటె ధన్యుడీ జగత్తునం దెవడుండును.

16. ఓ దేవీ ! ఇప్పుడిక్కడ నమస్కరించుచున్న నాయొక్క మొఱ్ఱ నందనవనములో విహరించు మీకేమైన విఘ్నము కలుగజేసి నచో, నీ పాదపద్మములుబట్టి నేను క్షమాపణ వేడెదను.

17. మోపి తామపి విమోహనాకృతి
ర్మోహనం పురుషసంహతే రపి ।
ఇంద్రమంబ రమయాం బభూవిథ
త్వం రసార్ద్రహృదయా లసద్రసం ॥

18. దివ్యచందన రసానులేపనైః
పారిజాత సుమతల్పకల్పనైః ।
చారుగీతకృతిభిశ్చ భేజిరే
నాకలోక వనదేవతాశ్చ వాం ॥

19. స్వర్ణదీసలిలశీకరోక్షితాః
పారిజాత సుమగంధ ధారిణః ।
నందనే త్రిదశలోకరాజ్ఞి వాం
కేపి భేజు రలసాః సమీరణాః ॥

20. ఆదధాసి సకలాంగ నాదికే
పద్మగంధిని సుధాధరాధరే ।
మంజువాణి సుకుమారి సుందరి
త్వం సురేంద్ర సకలేంద్రియార్చనం ॥

21. ఆదిదేవి వదనం తవాభవ
త్కాంతిధామ మదనం దివస్పతేః ।
ఆననాదపి రసామృతం కిర
న్నిష్క్రమం విలసితం కలం గిరాం ॥

22. చారువాగ్విలసితాచ్చ నిస్తుల
ప్రేమవీచిరుచిరం విలోకితం ।
వీక్షితాదపి విలాస విభ్రమ
స్థాన మల్పమలసం శుచిస్మితం ॥

17. ఓ తల్లీ! స్త్రీలనుగూడ మోహింపజేయు నాకారము, రసార్ద్రమగు హృదయముగల నీవు పురుషుల మోహింపజేయు సుందరుడును, ప్రకాశించు రసముగల్గువాడు నగు నింద్రుని రమింపజేసితివి.

18. స్వర్గమందుండు వనదేవతలు మీకు దివ్యచందన రసానులేపనము, పారిజాతపుష్పపు పాన్పులు, సుందరగానకృతులుకూర్చి సేవించుచుండిరి.

19. ఓ తల్లీ! ఆకాశగంగతో తడుపబడుచు, పారిజాతపుష్ప గంధములను ధరించిన నందనవనములోని పిల్లగాలులు కొన్ని మిమ్ము సేవించుచున్నవి.

20. ఓ దేవీ! నీవింద్రుని సకలేంద్రియముల కర్చన (రసార్చన) గలుగజేయుచుంటివి. పద్మగంధిని గనుక ఘ్రాణమునకు, సుధాధరాధరయగుటచే జిహ్వకు, మంజువాణికావున శ్రోత్రమునకు, సుకుమారి యగుటచే త్వగింద్రియమునకు, సుందరి కనుక చక్షువునకు సంతృప్తినీయగలుగుచున్నది. (పరికరాలంకారము)

21. ఓ దేవీ! నీ ముఖ మింద్రునిగూడ మదింపజేయునదై, కాంతులకు నిధియై యున్నది. ముఖముకంటె నీ వాగ్విలాస మధిక రసము నిచ్చుచు మరింత మధురముగా నొప్పుచున్నది.

22. ఓ దేవీ! ఆ సొగసైన వాగ్విలాసముకంటె నీ చూపు నిరుపమాన ప్రేమ రమ్యము. చూపుకంటె మందమైన నీ నగవు నిర్మలమై, విలాస విశ్రాంతి స్థానమై యున్నది.

23. భాసురేంద్ర దృఢబాహుపంజరీ
లజ్జయా సహజయా నమన్ముఖీ ।
తద్విలోచన వికర్ష కాలకా
పాతుమాం త్రిదివలోకనాయికా ॥

24. భారతక్షితి విషాదవారణే
తత్సుతం గణపతిం కృతోద్యమం ।
ఆదధాతు పటుమర్జున స్మితా
దుర్జన ప్రమథనక్షమాం శచీ ॥

25. చారుశబ్ద కలితాః కృతీరిమాః
సత్కవిక్షితిభుజో రథోద్ధతాః ।
సాశృణోతు సురమేదినీపతే
ర్నేత్రచిత్తమదనీ విలాసినీ ॥

---

## 3. మౌక్తికమాలాస్తబకము

1. నిర్మలభాసాం దిశిదిశి కర్త్రీ
పుణ్యమతీనాం హృదిహృది ధర్త్రీ ।
పాలయతా న్మామనఘవిలాసః
శక్రమహిష్యాః సితదరహాసః ॥

2. పుణ్యచరిత్రా మునిజనగీతా
వాసవకాంతా త్రిభువన మాతా ।
వత్సలభావా దవతు విదూనాం
భారతభూమిం ధనబలహీనాం ॥

23. దేదీప్యమానమైన ఇంద్రుని దృఢ బాహుపంజరమును బొంది, సహజలజ్జచే వంగిన ముఖము, ఇంద్రుని నేత్రముల నాకర్షించు ముంగురులు గల యింద్రాణి నన్ను రక్షించుగాక.

24. భారత భూవిషాదనివారణ విషయమై ప్రయత్నించు గణపతిని ధవళస్మితవదనయై, దుర్జనశిక్షణయందు పటుత్వముగల శచీదేవి సమర్థుని గావించుగాక.

25. ఇంపైన శబ్దములతో సత్కవియైన గణపతిచే కూర్చబడిన యీ 'రథోద్ధతా' వృత్తముల నింద్రాణి వినుగాక.

---

1. ప్రతి దిశయందును నిర్మల కాంతులను కలిగించునది, ప్రతి హృదయమందును పుణ్యబుద్ధులను ధరించునది, పాపకళంకము లేని విలాసములు గలదియైన ఇంద్రాణీ మందహాసము నన్ను రక్షించుగాక.

2. పుణ్య చరితములుగలది, మునులచే కీర్తింపబడునది, త్రిభువనములకు జననియు నగు నింద్రాణి ధనబలములు రెండును గోల్పోయి దుఃఖితమైన భారతభూమిని వాత్సల్యముతో రక్షించు గావుత.

3. కోటితటిద్వత్తవ తనుకాంతిః
పూర్ణసమాధౌ తవహృది శాంతిః ।
వాసవభామే భగవతి ఘోరః
శత్రువిదారీ తవభుజసారః ॥

4. ఆశ్రయభూతం సుమధురతాయాః
ఆలయభూతం జలధిసుతాయాః ।
వాసవదృష్టే స్తవముఖమబ్జం
కింకరదృష్టే స్తవపదమబ్జం ॥

5. పాదసరోజం వృజినహరం తే
యో భజతే నా సురపతికాంతే ।
తత్రకటాక్షా అయి శతశస్తే
తస్యసమస్తం భగవతి హస్తే ॥

6. జ్ఞాపకశక్తిః ప్రతినరమస్తం
కారకశక్తిః ప్రతినరహస్తం ॥
వాసవ చక్షుస్సుకృతఫలశ్రీ
ర్భాతు మమాంతః సురభవనశ్రీః ॥

7. మంత్రపరాణాం వచసి వసంతీ
ధ్యానపరాణాం మనసి లసంతీ ।
భక్తిపరాణాం హృది విహరంతీ
భాతి పరాంబా నభసి చరంతీ ॥

8. సేవక పాపప్రశమన నామా
దిక్తిమిరౌఘ ప్రమథన ధామా ।
ఉజ్జ్వలశస్త్రా రణభువి భీమా
పాతు సతతం మాం హరిహయరామా ॥

3. ఓ భగవతీ! నీ శరీర కాంతి కోటి మెఱుపుల ప్రభవలె ప్రకాశించు చున్నది. పూర్ణసమాధిగల నీ హృదయమందు శాంతికలదు. నీ భుజబలము ఘోరమై శత్రుసంహారము చేయునది.

4. మిగుల మాధుర్యమున కాశ్రయమై లక్ష్మీనివాసమున కాల యనువంటిదిగా ప్రసిద్ధిజెందిన పద్మ మింద్రదృష్టిలో నీముఖమే యగుచున్నది. భక్తులదృష్టిలో నీ పాద మట్టి పద్మమగుచున్నది.

5. ఓ దేవీ! పాపమును తొలగించు నీ పాదపద్మము నెవడు భుజించునో, వానికి నీ కటాక్షశతములు (ముఖపద్మానుగ్రహము) లభించును. వానికి సమస్తము హస్తగత మగుచున్నది.

6. ప్రతి మానవ శిరస్సునందు జ్ఞాపకశక్తిగా నున్నది, ప్రతి నర హస్తమందు కారకశక్తిగా నున్నది, యింద్రుని చక్షువునకు సుకృతఫలసంపదయై యున్నది యగు ఇంద్రాణి నా యంత రంగమున బ్రకాశించుగాక.

7. మంత్రవేత్తల వాక్కున బ్రకాశించునది, ధ్యానపరుల మనస్సున వికసించునది, భక్తిపరుల హృదయమందు విహరించునది, గగన మందు సంచరించునదియైన పరాదేవియగు అంబ భాసించు చున్నది.

8. సేవించువారి పాపములను నశింపజేయు నామముగలది, దిక్కుల చీకట్లను నశింపజేయు తేజస్సుగలది, రణభూమియందు భయ మును గలిగించు నుజ్వలశస్త్రముకలదియైన ఇంద్రాణి నమ్ర డనై యున్న నన్ను రక్షించుగాక.

9. యోగినిశక్తి ర్విలససి దాంతిః
యోషితిశక్తి ర్విలససి కాంతిః ।
జ్ఞానినిశక్తి ర్విలససి తుష్టి
ర్ధన్వినిశక్తి ర్విలససి దృష్టిః ॥

10. సంగినిశక్తి ర్విలససి నిద్రా
ధ్యాతరిశక్తి ర్విలససి ముద్రా ।
వాసవకాంతే గగననిశాంతే
భాషితుమీశః క్వను విభవం తే ॥

11. యద్దితిజానాం దమనమవక్రం
కేశవహస్తే విలసతిచక్రం ।
తత్రకళా తే భగవతి భద్రా
కాచన భారంవహతి వినిద్రా ॥

12. దుష్టనిశాట ప్రశమన శీలం
యత్సిత భూభృత్పతికరశూలం ।
తత్ర మహోంశ స్తవ జగదీశే
రాజతి కశ్చిత్పటు రరినాశే ॥

13. యన్నిజరోచి ర్హృత రిపుసారం
వాసవహస్తే కులిశ ముదారం ।
తత్ర తవాంశో విలసతి దివ్యః
కశ్చన భాసో భగవతి భవ్యః ॥

14. అంబరదేశే సుమహతి గుప్తా
పంకజబంధౌ విలసతి దీప్తా ।
రాజసి మాత ర్హిమరుచిశీతా
వేదికృశానౌ క్రతుభృతిపూతా ॥

9. యోగియొక్క శక్తివై నీవు దమముగాను (ఇంద్రియ నిగ్రహ శక్తిగాను), స్త్రీయొక్క శక్తివై నీవు కాంతిగాను, జ్ఞానియొక్క శక్తివై నీవు తృప్తిగాను, ధనుర్ధరుని శక్తివై నీవు లక్ష్యశుద్ధిగాను ప్రకాశించుచుంటివి.

10. ఓ దేవీ! సంగదోషముగలవానియందు నీవు నిద్రాశక్తివైతివి, ధ్యానించువానియందు ముద్రాశక్తివైతివి. నీ వైభవమును వర్ణించుట కెవడు సమర్థుడు?

11. ఓ దేవీ! రాక్షసులను ఖండించునట్టిది, యవక్రమైనదై విష్ణు హస్తమందు ప్రకాశించునట్టిది యగు చక్రమేదికలదో, అది భద్రమైన, జాగరూకమైన నీయొక్క ఒకానొక కళాభారమునే వహించుచున్నది.

12. ఓ దేవీ! దుష్టరాక్షససంహారమే శీలమై యొప్పు కైలాసాధిపతి హస్తమందుండు శూలమేదిగలదో, దానియందు శత్రునాశన పటుత్వముగల నీ తేజముయొక్క ఒక యంశమే ప్రకాశించు చున్నది (విష్ణుచక్రమందును, శివశూలమందును నున్న అస్త్ర శక్తి యామె వైభవమే అనుట)

13. తన జ్వాలలచే శత్రువులను హరించునది, యుదారమైనది (అనగా సంహారమేగాక మంగళములకొఱకు రక్షించు నుదార లక్షణముకూడ కలది)అయి యింద్రహస్తమందే వజ్రమున్నదో దానియందును దివ్యమగు నీ తేజోంశమే యున్నది.

14. ఓ తల్లీ! మహిమచే వ్యాపించిన ఆకాశప్రదేశమందు గుప్తము గాను, విలసించు సూర్యునియందు దీప్తముగాను, చల్లని కిరణ ములుగల చంద్రునియందు శీతలముగాను, క్రతువులనుభరించు వేదికాగ్నియందు పవిత్రముగాను నీవు ప్రకాశించుచుంటివి.

15. సూక్ష్మరజోభి ర్విహితముదారం
యజ్జగదేత ద్గగన మపారం ।
త త్తవ వేదః ప్రవదతి కాయం
పావని భాను స్తవ తనుజోఽయం ॥

16. ఈశ్వరి నైక స్తవ ఖరతేజా
స్తేపిచ సర్వే జనని తనూజాః ।
ఉజ్వల ఖేటాః కువదతికాయాః
పావని క స్తే ప్రవదతు మాయాః ॥

17. యా మహిమానం ప్రథయతి భూమిః
పావనకీ ర్తిర్జలనిధి నేమిః ।
సేయమపీశే భవతి సుపుత్రీ
వాసవజాయే తవ జనధాత్రీ ॥

18. అంగ! సఖాయో! విరమత సంగా
ద్దుర్విషయాణాం కృతమతి భంగాత్ ।
ధ్యాయత చిత్తే ధుతభయబీజం
వాసవజాయా చరణ సరోజం ॥

19. పాపమశేషం సపది విహాతుం
శక్తిమనల్పామపి పరిధాతుం ।
చేతసి సాధో కురు పరిపూతం
వాసవజాయా పదజలజాతం ॥

20. ఈశ్వరి వంద్యద్యుతి భృతిమేఘే
కాంక్షిత సీరాణ్యాసృజతి మోఘే ।
నిర్మలకీ ర్తే స్తవ శచి గానం
శక్ష్యతి కర్తుం తదుదక దానం ॥

15. ఓ దేవీ! సూక్ష్మరజస్సులతో నిండి శ్రేష్ఠమై యే యీఅపార గగనమనబడు (సూక్ష్మ) జగత్తు కలదో, అది నీకు శరీరమని వేదములో చెప్పబడుచున్నది. అట్టి నీకే సూర్యుడు కుమారుడు.

16. ఓ జననీ! తీక్ష్ణతేజస్సు గల సూర్యుడొక్కడే నీకు పుత్రుడు కాడు. భూమివలె పెద్దకాయము గలిగి గగనమందు ప్రకాశించుచు జ్యోతిర్గోళములు అను పుత్రులు నీకు పెక్కుమంది గలరు. నీ మాయల నెవడు చెప్పగలడు.

17. తల్లీ! పావనకీర్తి గలిగి, సముద్రమును కప్పగాగల యే భూమి విశాలమై యున్నదో, అదియు నీ పుత్రికయే.

18. ఓ సఖులారా! మతిని భ్రష్టమొనర్చు దుర్వ్యాసన సాంగత్యమునుండి విరమింపుడు. జన్మభయబీజమును నశింపజేయు నింద్రాణీ పదపద్మములను మీ చిత్తమందు ధ్యానింపుడు.

19. ఓ సాధువా; వెంటనే సర్వ పాపములనుండి విముక్తుడ వగుటకును, అధికశక్తి బొందుటకును నీ వింద్రాణియొక్క పవిత్రచరణములను చిత్తమందుంచుకొనుము.

20. ఓ శచీ! అంగరిచేతను పూజింపబడు కాంతిని ధరించు మేఘము వ్యర్థమై, కాంక్షింపబడిన జలము నది సృజింపజాలనప్పుడు, నీ నిర్మలకీర్తి గానము జలము నీయగలుగుచున్నది.

21. ఆమయవీర్యా ద్విగళతి సారే
జీవతి కించిద్రసనగనీరే ।
రక్షతి జంతుం తవ శచినామ
ప్రాజ్ఞజనైర ప్యగణితధామ ॥

22. మధ్యమలోకేస్యతి శుచి రుగ్రా
రాజసి నాకే విభవ సమగ్రా ।
ప్రాణి శరీరే భవసి విచిత్రా
వాసవజాయే వివిధ చరిత్రా ॥

23. వ్యోమ్నివపుస్తే వినిహతపాపం
విశ్రుతలీలం తవ దివిరూపం ।
కర్మవశాత్తే భవతి సభోగః
ప్రాణిశరీరే భగవతి భాగః ॥

24. భారతభూమేః శుచ మపహంతుం
శ్రేష్ఠముపాయం పునరవగంతుం ।
వాసవజాయే దిశ మమబుద్ధిం
పావని మాయే కురుకురుసిద్ధిం ॥

25. సమ్మదయంతీ ర్బుధజనమేతాః
స్వర్గధరిత్రీపతిసతి ! పూతాః ।
మౌక్తిక మాలాః శృణు నుతికర్తు
ర్భక్తినిబద్ధాః కవికులభర్తుః ॥

---

21. ఓ శచీ! రోగబలమువలన రోగియొక్క బలము జారి, జిహ్వ యందున్న నీటితో నతడు కొంచెము జీవించియుండగా, ప్రాజ్ఞులకు గూడ గణింపనలవిగాని యుత్తమస్థితినిచ్చు నీ నామమే యా జంతువునప్పుడు రక్షించగలదు.

22. ఓ యింద్రాణీ! నీవు గగనమందు (మధ్యమలోకమందు) విశేష పవిత్రముగను, నుగ్రముగను నుందువు; స్వర్గమందు సమగ్ర వైభవముతో రాజిల్లుచుందువు. ఇంక ప్రాణిశరీరమందు విచిత్రములతో గూడి వివిధములగు చరిత్రలుగల దాని వగుచుంటివి.

23. నీ శరీర మాకాశమందు పాపవర్జితమై, సూర్యునియందు విశ్రుత లీలలుగలదై యున్నది. ప్రాణి శరీరములో కర్మవశమువలన నీ రూపభాగము భోగయుక్తమై యున్నది.

24. ఓ మాయారూపిణీ! భారతభూమియొక్క దుఃఖమును తొలగించుటకును, శ్రేష్ఠోపాయమును తిరుగ (వేదకోశమునుండి) తెలిసికొనుటకును నాకు బుద్ధినిమ్ము, సిద్ధిని తప్పక చేకూర్చుము.

25. ఓ యింద్రాణీ! బుధజనులను సంతోషపరచునది, పవిత్రమైనది, భక్తితోగూడినది, కవికులపతిచే నుతింపబడినదియైన యీ 'పూర్తిక'మాలను నీవు వినుము.

## 4. సుముఖీ స్తబకము

1. అజితమినాగ్ని తటి చ్ఛశిభి
ర్మమహృదయస్య తమః ప్రబలం ।
అమరపతిప్రమదా హసితం
విమల ఘృణిప్రకరై ర్హరతు ॥

2. సురనృపతేర్దయితా వినతా
హితశమనీ లలితా మితరైః ।
వరకరుణా వరుణాలయ దృ
ఙ్మమజననీ మవతా దవనిం ॥

3. పటుతపసో జమదగ్నిమునే
రిహ సహధర్మచరీం భువనే ।
తనయ నికృత్తశిరఃకమలాం
వరమతి మావిశ దింద్రవధూః ॥

4. యదుకులకీర్తి విలోపభియా
బత వినిగుహ్య ఋతం కవయః ।
మునిగృహిణీ వధహేతుకథా
మితర పథేన భణంతి మృషా ॥

5. న సురభి రర్జునభూమిపతి
ర్భృగుతిలకస్య జహార స యాం ।
ఇయమమృతాంశు మనోజ్ఞముఖీ
పరశుధరస్య జనన్యనఘా ॥

6. అతిరథ మర్జునభూమిపతిం
సహపృతనం జమదగ్నిసుతః ।
యుధి సవిజిత్య విశాలయశాః
పునరపి మాతర మాహృతవాన్ ॥

1. సూర్యాగ్నులచే గాని, తటిత్తుచే గాని; చంద్రునిచేగాని జయింపబడజాలని నా హృదయ తమస్సు నింద్రాణీ హాసితము తన నిర్మల కాంతిపుంజములచే హరించుగాక.
(మొదటినాల్గును బాహ్యతమస్సులను మాత్రము జయించును.)

2. నమ్రుల కిష్టములేనిదానిని నశింపజేయు కరుణా సముద్రమగు దృష్టిగల యింద్రాణి యితర మతస్థులచే చీకాకు గావింపబడిన నా యీ జననియగు భారతభూమిని రక్షించుగాక.

3. ఈ లోకములో కుమారునిచే ఛేదింపబడిన శిరస్సు గలది, శ్రేష్ఠబుద్ధి గలదియైన జమదగ్ని ముని భార్య నింద్రాణి యావేశించెను.

4. యదుకులమున కపకీర్తి వచ్చునను భీతిచే కవులు నిజమును గప్పిపుచ్చి, యీ మునిపత్నియొక్క వధహేతు కథను వేఱు మార్గమున నసహ్యముగా జెప్పుచున్నారు.
(కార్తవీర్యుడు యదుకులమువాడు.)

5. ఆ కార్తవీర్యార్జునుడు భృగుకుల తిలకుని సురభి నపహరింపలేదు. అతని పత్నియు, చంద్రముఖియు, పాపరహితురాలునగు పరశురామ జననినే యపహరించెను.

6. ఆ జమదగ్ని సుతుడైన పరశురాము డతిరథుడైన అర్జున మహారాజును సేనా సమేతముగా యుద్ధమందు జయించి విశాల కీర్తిగలవాడై, తల్లిని తిరుగ తీసికొనివచ్చెను.

7. పరగృహవాస కళంకవశా
న్నిజగృహిణీం జమదగ్ని మునిః ।
బత వినిహంతుమనాకలయం
స్తనుభవమాదిశ దుగ్రమనాః ॥

8. పితృవచనాదతి భక్తిమతా
ప్యసురవదాత్మసుతేన హతాం ।
మునిగృహిణీ మనఘేతి వదం
స్తవ వరదేఽవిశదంశ ఇమాం ॥

9. ఇదమవికంప్య మతిప్రబలం
ప్రభవతి కారణ మార్యనుతే ।
మునిగృహిణీ మనఘాం భణితుం
శచికలయా యదిమామవిశః ॥

10. ఖలజన కల్పిత దుష్టకథా
శ్రవణవశా ద్వ్యథితం హృదయం ।
అథ చరితేఽవగతే విమల
స్మృతి వశతో మమ యాతి ముదం ॥

11. తవ మహసాంవిశతా కృపయా
మమ శచి సూక్ష్మశరీరమిదం ।
నృపరిపుమాతృ పవిత్రకథా
స్మరణపథం గమితా సపది ॥

12. విదధతు రాసురకృత్య ముభౌ
బహుళగుణామపి యద్గృహిణీం ।
సముని రఘూత యదచ్ఛకథాం
దశరథజశ్చ ముమోచ వనే ॥

7\. పరగృహమందు వసించెనను కళంకము నెంచి తన భార్య నీ జమదగ్ని ముని చంపుట కుగ్రమనస్కుడై, మనస్సునం దాలోచించనివాడై, తన కుమారు నాజ్ఞాపించెను. ఆశ్చర్యము ! (తాను చంపక, కుమారుని చంపుమనుట యాశ్చర్యము.)

8\. ఓ వరదా ! అతి భక్తిమంతుడైనను (తల్లి యందు), తండ్రి వచనమువలన రాక్షసునివలె తన కుమారునిచే చంపబడిన యీ ముని పత్ని పుణ్యాత్మురాలనుచు నామెను నీ యంశ ప్రవేశించెను.

9\. ఓ శచీ ! ఏ హేతువువలన నీవు నీ కళచే నీమెయం దావేశించితివో, ఆ హేతువువల్లనే మునిపత్ని పవిత్రురాలని చెప్పుట కిది ఖండింపనలవిగాని యత్యంత ప్రబలకారణ మగుచున్నది.

10\. దుర్మార్గులచే కల్పితమైన యీ దుష్టకథ వినుటవలన నా హృదయము తొలుత దుఃఖభరితమై, పిదప నిర్మలబుద్ధిచే నిజమగు చరిత్రను తెలిసికొని సంతోషమును బొందెను.

11\. ఓ శచీ ! నా యీ సూక్ష్మశరీరమును కృపతో ప్రవేశించిన నీయొక్క తేజస్సువలన పరశురాము జననియొక్క పవిత్ర కథ తత్క్షణమే స్మృతిపథమును బొందెను.

12\. బహు గుణములుగల భార్య నా జమదగ్నిముని యే హేతువువల్ల చంపించెనో, స్వచ్ఛమైన చరిత్రగల భార్యను దశరథపుత్రు డే హేతువుచే వనమందు విడచిపుచ్చెనో, ఆ హేతువువలన నుభయులు రాక్షసకృత్యమే చేసిరి.

13. అపి వినికృత్తశిరాః శచి తే
వరమహసా విశతా సపది ।
అలభత జీవిత మంబ పున
ర్భువన శుభాయ మునేస్తరుణీ ॥

14. యది శిరసా రహితే వపుషి
ప్రకటతయా విలసంత్యసవః ।
యది హృదయం సహభాతిధియా
కిమివ విచిత్ర మితశ్చరితం ॥

15. పరశుధరస్యసవిత్రి కళా
త్వయి పురుహూత సరోజదృశః ।
స శిరసి కాచిదభూద్రుచిరా౽
విశిరసి భీమతమా భవతి ॥

16. పరశుధరో౽ర్జున భూమిపతిం
యదజయ దంబ తపో౽త్ర తవ ।
అభజత కారణతా మనఘే
వరమునిగేయ పవిత్రకథే ॥

17. భగవతి కృత్తశిరా భవతీ
మథితవతీ నృపతీ నశుభాన్ ।
ప్రధన భువి ప్రగుణం భుజయోః
పరశుధరాయ వితీర్య బలం ॥

18. శుభతమ కుండల పూర్వసతిః
పదనతపాతక సంశమనీ ।
దిశతు నికృత్తశిరాః కుశలం
మమ సురపార్థివశక్తికళా ॥

13. ఓ యంబా! కృత్తశిరస్కురాలైనను జమదగ్ని భార్యమైన రేణుక తనయందు తత్క్షణమే ప్రవేశించిన నీ యొక్క గొప్ప తేజస్సుచే లోకశుభముకొఱకు తిరుగ జీవితమును బొందెను.

14. శిరస్సులేని శరీరములో స్పష్టముగా ప్రాణములు ప్రకాశించిన హృదయము బుద్ధితోగూడ ప్రకాశించినది. ఇంతకంటె విచిత్ర మేది యుండును?

15. ఓ రేణుకా! శిరస్సుతోనున్న నీయందు శచీ సంబంధమైన నొకానొక మోహన కళయు, శిరస్సులేని నీ యందామె యొక్క భీకర కళయు నుండెను.

16. ఓ యంబా! పరశురాముడు కార్తవీర్యార్జున మహారాజును జయించినప్పు డా విజయమునకు నీ తపస్సే కారణత్వము బొందెను.

17. ఓ భగవతీ! కృత్తశిరస్సుగల నీవు యుద్ధభూమియందు పరశురాముని భుజముల కమితబలమునిచ్చి, దుర్మార్గులైన రాజులను చంపించినదాన వైతివి.

18. శుభమైన కుండలీపురము వాసముగాగలది, పాదములకు నమస్కరించువారి పాపములను పరిహరించునది, కృత్తశిరస్కురాలు అయిన ఇంద్రాణీకళ నాకు కుశలమిచ్చుగాక.
(కుండలీపురమే పడైవీడను క్షేత్రము. ఇది వేలూరు సమీపమందున్నది.

19. నిజసుత రంగపతే ర్నికటే
కృతవసతి ర్నత సిద్ధికరీ ।
దళితశిరాః ప్రతనోతు మమ
ప్రియ మమరేశ్వరశక్తికళా ॥

20. భువితతసహ్యా నగాంతరగే
శుభతమచంద్రగిరౌ వరదా ।
కృతవసతిః కురుతాన్మమ శం
భృగుకులరామజన న్యజరా ॥

21. అవతు నికృత్తశిరాః పదయో
ర్భజక మనింద్య విచిత్రకథా ।
దినకరమండలమధ్య గృహా
సురధరణీపతిశక్తికళా ॥

22. గగన చరార్చిత పాదుకయా
పదనత సన్మతి బోధికయా ।
మమ సతతం శుచి రేణుకయా
పరవదిదం కుల మంబికయా ॥

23. శమయితు మ్యగతమం దురితం
ప్రథయితు మాత్మ నిగూఢబలం ।
గమయితు మ్యగ్యదశాం స్వకులం
తవచరణాంబుజ మంబ భజే ॥

19. తన కుమారుడైన రంగపతియొక్క సమీపమున వాసము చేయుచున్నది, నమ్రులకు కార్యసిద్ధి నిచ్చునది, ఛేదింపబడిన శిరస్సు గలదియగు నింద్రాణీ కళ నాకు ప్రియములు సమకూర్చుగాక.

(ఈ క్షేత్రములో రేణుకాలయమునకు కొంచెము దూరములో రఘురామాలయ ముండుట వింత. ఒకప్పుడిది పరశురామాలయము కావచ్చును లేదా పరశురాముని యుత్తర చరిత్రమే రఘురామ చరిత్రమై యుండవచ్చును.)

20. ఓ సహ్యాపర్వతనివాసినీ! శుభప్రదమైన చంద్రగిరియందు వాసము జేయునది, వరము లిచ్చునది, ముసలితనము లేనిది యగు భార్గవరామ జనని శుభము లొసగు గాక.

21. కృత్త శిరస్సు కలది, పవిత్రమైనట్టియు, విచిత్రమైనట్టియు కథ కలది, సూర్యమండల మధ్యభాగము గృహముగా గలదియైన యింద్రాణీ కళ తన పాదములను భజించు నన్ను రక్షించుగాక. (దేవయాని మార్గమునుండి సూర్యునిబొందునది యింద్రాణీకళ.)

22. దేవతలచే పూజింపబడు పాదుకలు కలది, పాదములకు నమస్కరించువారికి మంచి బుద్ధులిచ్చునది యైన అంబికయగు రేణుక పరాధీనమైన నా యీ భారతకులమును సతతము శుచిగా నుండునట్లొనర్చుగాక.

23. ఓ యంబా! ఉగ్రతమమైన పాపములను ధ్వంస మొనర్చుటకు, నిగూఢమైన ఆత్మబలమును ప్రకటన మొనర్చుటకు, స్వకులము నుచ్చ దశ బొందించుటకు నేను నీ పాదములను సేవించుచుంటిని.

24. పరవశగా మశివేనవృతాం
భరతధరాం పరిపాతుమిమాం ।
పటుమతి వాక్క్రియ మాతనుతా
ద్గణపతి మగ్ర్యహాయఃప్రమదా ॥

25. గణపతిదేవ మహాంశజుషో
గణపతినామ కవిప్రకవేః ।
సురపతి జీవసఖీ శృణుయా
ద్దశశత పత్రముఖీ సుముఖీః ॥

---

షష్ఠం త్రైష్టుభం శతకమ్ సంపూర్ణమ్.

24. పరులకు వశమై, యమంగళములో గూడియున్న యీ భారత భూమిని రక్షించుట కింద్రాణీదేవి గణపతిని పటుతరబుద్ధి వాక్క్రియలు గలవానిగా జేయుగాక.

25. గణపతి దైవముయొక్క తేజమును బొందిన గణపతినామ కవిచే రచింపబడిన యీ 'సుముఖి' వృత్తముల నింద్రాణి వినుగాక.

ఓం

సప్తమం

# జాగతం శతకమ్

# 1. ద్రుతవిలంబితస్తబకము

1. సురమహీరమణస్య విలాసినీ
జలచరధ్వజ జీవితదాయినీ ।
హరతు బోధదృగావరణం తమో
హృదయగం హసితేన సితేన మే ॥

2. నమదమర్త్యకిరీటకృతైః కిణైః
కమఠపృష్ఠనిభే ప్రపదేంకితా ।
పరిధునోతు శచీ భరతక్షితే
ర్వృజినజాల మజాలమకంపనం ॥

3. అతితరాం నతపాలన లోలయా
విబుధనాథ మనోహరలీలయా ।
కిరిముఖీ ముఖశక్త్యుపజీవ్యయాఽ
విదితయాఽదితయా గతిమానహం ॥

4. ఘనహిరణ్య మదాపహ రోచిషా
వనరుహాసనయాఽవన దక్షయా ।
గతిమదింద్ర మనోరథ నాథయా
భువనమేవ న మే కులమత్రకా ॥

5. తనుషు వామనమూర్తిధరే విభౌ
తమనుయాచ విరాజతి వామనీ ।
శరణవా సనయాంబికయా లస
త్కరుణయాఽరుణయా పదయోరహం ॥

1. మీనధ్వజుఁడైన మన్మథునకు జీవితమిచ్చిన జననియై, సురపతి యైన యింద్రున కర్ధాంగియైన యింద్రాణీదేవి తన స్వచ్ఛమైన హాసముచే నా బుద్ధి నావరించి, నా హృదయమం దలముకొనిన తమస్సును హరించుగాక. (ఇది మీనావతారస్మృతి)

2. నమస్కరించు దేవతాకిరీటముల తాకుడువలన కాయలుకాచి తాబేలు పృష్ఠముతో సమమగు పాదములుగలిగిన శచీదేవి యధికమై తొలగింప నసాధ్యమగుచున్న భారతభూమియొక్క పాపములను నశింపజేయుగాక. (కూర్మావతారస్మృతి.)

3. నమ్రములను బాలించుటయం దత్యంతాసక్తికలది. విభుని చిత్తమును హరించు విలాసముకలది. వరాహముఖి మొదలగు శక్తి మాతృకల స్వరూప జీవనాధారమగునట్టి యవ్యక్తమహిమ గలదియైన ఆదిమస్త్రీచే నేను గతిగలవాడనగుదునుగాక. (వరాహావతారస్మృతి.)

4. హిరణ్య సంబంధమగు మదమును హరించు ఘనమైన తేజస్సు గలది, పద్మముఖియు, రక్షించుటయందు దక్షురాలునగు ఇంద్రాణివలన నీ భూమియందు నా కులమొక్కటియేగాక భువనమంతయు గతి బొందుచున్నది. (నారసింహావతారస్మృతి)

5. విభుడైన యింద్రుడు వామనమూర్తివేషమును ధరించగా నతని ననుసరించి వామనియై విరాజిల్లినది (మూర్తిసంక్షిప్తమైనప్పుడు మూర్తియందు శక్తియు సంక్షిప్తమగును), ప్రకాశించు దయ కలది, మెత్తని పాదములుకలదియైన యింద్రాణిని నేను శరణు

6. సకరుణా కుశలం మమ రేణుకా
తనురజా తనుతా దుదితో యతః ।
యుధి ముని ర్వ్యదధా పరశుం దధ
జ్జనపతీ నపతీ్రవ భుజామదాన్ ॥

7. సుజన శత్రురమాధి ఘనధ్వని:
శచి స రాత్రిచర స్తవ తేజసా ।
జనని రామసహోదర సాయకం
ప్రవిశతావిశతా దధికౌజసః ॥

8. తవ మహః కళయాబలమా ప్తయా
జనని శుంభనిశుంభ మదచ్ఛిదా ।
జగదరక్ష్యత గోపకులేశితు
స్తనుజయానుజయార్జునసారథేః ॥

9. న వినిరూపయితుం ప్రబభూవ
యాం కలిజనో వివిధం కథయన్నపి ।
మునిహృదంబుజ సౌధతతేందిరా
జయతి సా యతిసాధుజనావనీ ॥

బొందుదును. (వామనావతారస్మృతి - చిద్గుహాలోని పరమాకాశ స్వరూపమంతటను నిండియున్న స్వరూపమున కవిభక్తమైనను ప్రతివ్యక్తియందు చిద్గుహనధిష్ఠించుట కంగుష్ఠప్రమాణమగుట వామనవైభవము.)

6. ఏ రేణుకకుదయించిన (శక్తిగల) పరశువును (పరశువన గొడ్డలి గాక అస్త్రవిద్య గావలయును లేదా వేదభావమందు కపాల భేదన మొనర్చు వైభవముగల సుషుమ్న కర్థమై యుండును.) ధరించిన ముని యుద్ధమందు రాజుల తీవ్ర భుజగర్వమును హరించెనో, దయామయియైన ఆ రేణుక నాకు కుశలము జేయుగాక. (పరశురామావతారస్మృతి)

7. ఓ తల్లీ, శచీ! శ్రీరాముని తమ్ముడగు లక్ష్మణుని బాణమందు ప్రవేశించి, సూర్యశతముకంటెను నధిక తేజస్సు గలిగిన నీ జ్యోతి సజ్జనులకు శత్రువైన రాక్షసుడగు ఇంద్రజిత్తును (మేఘనాథునిః) చంపెను. (రఘురామావతారస్మృతి)

8. ఓ తల్లీ! బలమును బొందినది, శుంభనిశుంభుల నెడి రక్కసుల మదమును హరించినది. గోపకుల ప్రభువైన నందునకు జన్మించినది, కృష్ణుని సోదరియై మాయాదేవిగా పుట్టినదియైన నీ తేజః కళవలన జగత్తు రక్షింపబడెను. (కృష్ణావతారస్మృతి)

9. కలికాల జనులే దేవిని గుఱించి యెన్నివిధములుగా జెప్పినను నిరూపించు కొనజాలకుండిరో, ముని హృదయ పద్మసౌధములపై (అసంగబుద్ధిరూపమున) విహరించుచు యతులైన సాధుజనులను రక్షించుచున్న ఆ దేవి ప్రకాశించుచున్నది. (ఇదియే శుద్ధబుద్ధి లక్షణము గనుక బుద్ధావతారస్మృతి)

10. ఇమమయి త్రిదివేశ్వరి కల్కినం
రుషమపోహ్య సవిత్రి విలోకితైః ।
సురపతే ర్ద్విషతోఽఘవతో లస
న్మదనకైరవ కైరవలోచనే ॥

11. స్మరదమర్త్య నృపాల విలాసినీం
ప్రబలపాతకభీతి వినాశినీం ।
ప్రవణయాంత రనన్య ధియా లస
ద్వినయయా నయ యామవతీర్మనః ॥

12. భగవతీ గగనస్థలచారిణీ
జయతి సంగరరంగ విహారిణీ ।
సుకృత శత్రు మతిభ్రమ కారిణీ
హరిహయారి హయాది విధారిణీ ॥

13. శరణవానహ మర్జునహాసయా
భువనభూపతిహారి విలాసయా ।
దివి పులోమజయా ధవళాచలే
గిరిజయాఽరిజయా వితదేవయా ॥

14. చరణయోర్ధృతయా విజయామహే
వయమశేష జగన్నృప జాయయా ।
దివిపులోమజయా ధవళాచలే
నగజయా గజయానవిలాసయా ॥

15. అరివధాయ విధాయ బుధాధిపం
పటుభుజాబల భీషణమాజిషు ।
న భవతీ శచి గచ్ఛతి దుర్గతః
క్వచన కాచన కాతర ధీరివ ॥

10. ఓ త్రిలోకేశ్వరీ ! నీవు కోపమును విడచి, యింద్రుని మోహ పరవశుని జేయుదృష్టితో పాపాత్ముడైన యీ జనుని (నన్ను) పాపియగు శత్రువునుండి రక్షింపుము. (కల్కి = కల్కము కలవాడు గనుక కల్క్యవతారస్మృతి.)

11. ఓ మనస్సా ! ప్రబలపాపభీతిని దొలగించు నింద్రాణిని నీయంత రంగమున నిశ్చలమైనట్టి, వినయముతో గూడినట్టి, యనన్యమై ప్రకాశించునట్టి బుద్ధితో స్మరించుచు రాత్రులు వెళ్లబుచ్చుము.

12. గగనమందు సంచరించునది, యుద్ధమందు విహరించునది, పుణ్యమునుండి శత్రువుల మతిని భ్రమింపజేయునది, యింద్రుని శత్రువులైన హయుడు మొదలుగాగల రక్కసులను ఛేదించు నది యగు భగవతి ప్రకాశించుగాక.

13. తెల్లని నవ్వుగలది, ఇంద్రునాకర్షించు విలాసముగలది, స్వర్గమం దింద్రాణీ రూపిణిగా నున్నది, ధవళాచలమందు గిరిజాంబగా నున్నది, శత్రువులను జయించి దేవతలను రక్షించినది యైన అంబికను నేను శరణుబొందుచున్నాను.

14. చరణములందు మాచే ధరింపబడినది, ఇంద్రునకు భార్యగా నున్నది, స్వర్గమం దింద్రాణియై యున్నది, ధవళాచలమందు పార్వతిగా నున్నది, యేనుగు గమనమువంటి గమనవిలాసము గలది యగు దేవివలన మేము ప్రకాశించుచుంటిమి.

15. ఓ శచీ ! యుద్ధమందు దేవేంద్రుని శత్రువధకొఱకు సమర్థ భుజబలయుక్తునిగా జేసి, నీవొకానొక పిఱికిదానివలె దుర్గము (కోట) నుండి యెచ్చటికిని వెడలవు.

16. సపది మానసస్థైర్యహృతో జగ
జ్జనని వజ్రతనోర్జ్వలితార్చిషః ।
అరిజనే ప్రథమం తవవీక్షయా
సురపతే రపతేజసి విక్రమః ॥

17. న మననోచితమస్తి పరం నృణాం
విబుధరాజవధూపదపద్మతః ।
జగతి దర్శనయోగ్యమిహాऽపరం
న రమణీ రమణీయముఖాబ్జతః ॥

18. శరణవానహమస్మి పురాతన
ప్రమదయా మునిగేయ చరిత్రయా ।
స్వబలచాలిత నాకజగన్నభో
వసుధయా సుధయా సురరాడ్దృశాం ॥

19. అయమహం గతిమా నతిశాంతయా
త్రిదివభూమిపతి ప్రియకాంతయా ।
మనసి మే నిజనై రతిభక్తితః
నిహితయా హితయా సుకృతాత్మనాం ॥

20. వినయతః స్మృతయా గమయామ్యహం
జనిమతాం జనయిత్రి నిశాస్త్వయా ।
ప్రసృతయా కులకుండ ధనంజయా
దృతతనూ తత నూతనవేగయా ॥

21. సకృదమోఘ సరస్వతి సాధుధీ
హృదయవేద్య పదాంబుజసౌష్ఠవే ।
మను శివం సుమనఃపృథివీపతే
స్స్వవదనే వదనేత్రలసద్దయే ॥

16. ఓ జననీ ! వజ్రతనువు, ప్రజ్వలించు తేజస్సుగల నీ వొక వీక్షణముచే శత్రువును తొలుత విగతతేజస్సుగలవానిగా జేసి, వాని ధైర్యమును నశింపఁజేయగా, బిదప వానిపై సురపతి పరాక్రమమును చూపును.

17. ఇంద్రాణీ పాదపద్మములకంటె జగత్తులో మానవుల మననమునకుచితమైన దింకొకటి లేదు. రమణీయమైన ఆమె ముఖపద్మము కంటె దర్శనయోగ్యమైనది నరుల కింకొకటి లేదు.

18. మునులచే గానముచేయబడు చరిత్రగలది, స్వర్గ మధ్య పాతాళ ములను (స్వర్గమనెడి దివ్యతేజోలోకమును, ఆకాశమనెడి మధ్యమలోకమును, భూమిని) నిజబలముచే చలింపజేయునది, యింద్రుని దృక్కుల కమృతప్రాయమైనది యగు నింద్రాణి నాకు శరణము.

19. అతిశాంతరూపిణి, పుణ్యాత్ములకు హితమొదర్చునది, తనయందు గల సంతత భక్తిచే మనస్సునందుండునది యైన ఇంద్రాణి నన్ను గతిగలవానిగా జేయుగాక.

20. ఓ జననీ ! నమ్రతతో గూడిన వినయముతో స్మరింపదగినది, కులకుండాగ్నినుండి ప్రసరించునది, ఋతశరీరములందు నూత్న వేగముతో వ్యాపించునదియైన నీ కళచే నేను శత్రులను వెళ్లబుచ్చెదను.

21. ఓ దేవీ ! (నీ వాక్కుసారియైన) నాకు మంగళవాక్యము వేగముగా జెప్పుము.

22. దురవగాహపథే పతితం చిరా
జ్జనని గమ్యవిలోకన లాలసం ।
స్వయ మమర్త్యనృపాలమనోరమే
సునయనే నయ నేయమిమంజనం ॥

23. అవతు నః స్వయమేవ పటూన్ విప
ద్వివధనాయ విధాయ బుధేశ్వరీ ।
సకలమర్మసు వీతదయైః పరై
ర్వినిహతానిహ తాపవతః శచీ ॥

24. సురధరాపతి జీవితనాథయా
స్వజనరక్షితి రక్షణకర్మణి ।
పటుతమో జన ఏష విధీయతా
మిహ తయా హతయాతు సమూహయా ॥

25. గణపతేః శ్రుణుయాదిమముజ్జ్వలం
ద్రుతవిలంబితవృత్తగణం శచీ ।
సలిలరాజసుతాభవనీభవ
ద్భువనపావన పాదసరోరుహా ॥

## 2. జలోద్ధతా స్తబకము

1. హరిత్సు పరితః ప్రసాదమధికం
దధానమమల త్విషాం ప్రసరణైః ।
మహేంద్రమహిళా విలాసహసితం
మదంతర తమో ధునోతు వితతం ॥

22. ఓ జననీ! దురవగాహమైన మార్గములో చిరకాలమునుండి పడిపోయి, గమ్యస్థానము బొందు నాసక్తిగల యీ జనుని నీవా స్థానమును స్వయముగా పొందింపుము.

23. విబుధేశ్వరియగు శచి దయలేని శత్రువులచే సకల మర్మస్థలములందును కొట్టబడి సంతాపము జెందియున్న మమ్ములను విపన్నాశనముకొఱకు సమర్థులుగా జేయుచు స్వయముగా రక్షించుగాక.

24. రాక్షస సమూహమును హతముగావించిన ఆ యింద్రాణివలన భారతభూరక్షణకొఱకీ జనుడు సమర్థుడు గావింపబడుగాక.

25. లక్ష్మికాలయమైనట్టి, లోకములను పావన మొనర్చునట్టి పాద పద్మములుగల శచీదేవి గణపతికవియొక్క యుజ్జ్వలమైన యీ 'ద్రుతవిలంబిత' వృత్తములను వినుగాక.

---

1. నిర్మల కిరణములను ప్రసరింపజేయుచు, నన్ని దిక్కులందును నైర్మల్య మొనర్చు తేజఃప్రసాదము నధికముగా ధరించుచున్న యింద్రాణీహసితము విస్తరించియున్న నా యాంతర్య తిమిర మును హరించుగాక.

2. ప్రసూ స్త్రిజగతః ప్రియామఘవతః
కృపాళలితయా కటాక్షకళయా ।
నితాంతమగతే ర్వికుంఠితమతే
ర్ధునోతు భరతక్షితే రకుశలం ॥

3. పురా శచి మతి స్త్వమీశితు రథో
నభ స్తను మితా పృథజ్మతిమతీ ।
అనంతర మభూః సరోజ నయనా
తనుః సురపతేర్విలోచన సుధా ॥

2. ముల్లోకములనూ కనిన యింద్రప్రేయసి యత్యంత గతిహీనురాలైనట్టి, నష్టబుద్ధియైనట్టి యీ భారతదేశముయొక్క దుస్థితిని తన కృపతో గూడిన కటాక్షకళచే నివారించుగాక.

(కన్నబిడ్డ ననుగ్రహించు తల్లివలె.)

3. ఆదియందు (అనగా విశ్వసృష్టికి పూర్వము) సచ్చిదానంద తత్త్వస్వరూపుడైన యీశ్వరుని చిత్తువైయున్న నీవు విశ్వసృష్టి కొఱకు పృథఙ్మతివైతివి

(ఇక్కడ 4 రూపములు చెప్పబడెను. (1) కర్తయైన యీశ్వరుని యందభిన్నయై, తత్త్వస్వరూపముతో నున్న చిత్తు తానే కర్తయై ప్రభుత్వరూపిణియై మూలమందున్నది. (2) తరువాత సృష్టికొఱ కీశ్వరస్వరూపము తన మహిమచే వ్యాపించగా, మహిమాలక్షణమం దీశ్వరునే కర్తవలె ప్రచురించుట కహమ్మహమ్మను స్ఫూర్తులనిచ్చునొక్కానొక భాసమానలక్షణ యయ్యెను. ఇదియే సగుణ బ్రహ్మలక్షణము. 'అయితిని' అను నర్థమిచ్చు హృత్ + అయం=హృదయమను నామముచే ప్రసిద్ధమైన రూపమిదియే. (3) తరువాత (మహిమయొక్క వ్యాపారముచే చిమ్మబడుచున్న యీశ్వరసంపదనుధరించుటకు) ఆకాశశరీరిణి నైతివి. (4) అటు తరువాత (యీశ్వరునినుండి విభాజ్యమై చిమ్మబడు వీర్య వస్తుసంపద మహిమయుతమైయున్నను, ఈశ్వరచైతన్యము నీయనిదై జడత్వస్థితినిబొంది యాకాశగర్భమందుండగా, 'అహం' చైతన్యమును ప్రవేశపెట్టిన అనుగ్రహ వ్యాపారమనెడి మాతృలక్షణముచే) సురపతికి నేత్రామృతమగు పద్మనేత్రమైన స్త్రీరూపిణి నైతివి. (ఇదియే యనుగ్రహ దేవతా స్వరూపము)

4. పరత్ర విగుణా సతోఽసి ధిషణా
నభ స్తనురిహా ప్రపంచ మవసి ।
అసి స్వరబలా ప్రియా సురపతే
రియ త్తవ శచి స్వరూప కథనం ॥

5. ప్రజాపతిపదే పురాణపురుషే
స్మృతా త్వ మదితిః సురాసురనుతే ।
జనార్దన పదే రమాసి పరమే
సదాశివపదే శివా త్వమజరే ॥

6. ఉషా ఇనపదే స్వధానలపదే
పురందరపదే త్వమీశ్వరిశచి ।
యథా రుచి విదుః పదాని కవయ
శ్చితిశ్చ చితిమా న్యవామృజగిరా ॥

7. అమేయ మమలం పురాణపురుషం
తదీయ విభవాభిదాయిభిరిమే ।
వదంతి కవయః పదైర్బహువిధై
స్తథైవ భవతీం తతో మతభిదాః ॥

8. నభశ్చపవనః స్వరశ్చపరమ
స్తటిచ్చ వితతాః పతిశ్చ మహసాం ।
సుధాంశురనలో జలంచ పృథివీ
సవిత్రి యువయో ర్విభూతిపటలీ ॥

4. పరాకాశరూపమందు గుణముతో గూడసిదానవై నీవు మూల మైన సద్రూపునకు బుద్ధి లక్షణవైయుంటివి(కర్తప్రచురణబుద్ధి), యిచ్చటనున్న ఆకాశతనువుతో నీవు ప్రపంచమును పోషించుచు రక్షించుచుంటివి. స్వరమనెడి గుణమునకు బలమునిచ్చు ప్రాణేశ్వరివై నీవు స్వర్గమందింద్రుని ప్రియురాలివైతివి. ఓ శచీ! నీ స్వరూప కథ యిది.

5. ఓ సురాసురస్తూయమానులాలా! పురాణపురుషుడైన ప్రజాపతి స్థానమందు నీవు 'అదితి' వై స్మరింపబడుచుంటివి. ఉత్కృష్ట జనార్దనపదమందు 'లక్ష్మి' వై నీ వుంటివి. నాశనరహితమైన సదాశివపదమందు నీవు 'శివ' వై యుంటివి.

6. సూర్యుని స్థానమున 'ఉష' వై, అగ్నిపదవియందు 'స్వధ' వై, యింద్రపదమందు 'శచి' వై కవులచే నా యా స్థానముల కుచితపదములతో పిలువబడితివి. వేదవాక్కులో మీ రుభయులు జ్ఞాతృ, జ్ఞానము లగుదురు.

7. అమేయుడు, నచింత్యుడు నగు పురాణపురుషునినీ కవులతని సంబంధమగు వైభవములను దెలుపు పదములతో పిలుచుచున్నారు. దేవీ! నిన్నుగూడ వా రట్లే పిలచిరి. మతభేద మందులకే (అనగా వైభవ నామములందున్న భేదముచే) గలిగెను.

8. ఓ సవిత్రీ! అకాశము, వాయువు, పరావాక్కు, వ్యాపించివ తటిత్తు, సూర్యుడు, చంద్రుడు, అగ్ని, జలము, పృథ్వి- యీ సర్వము మీ యిద్దరియొక్క యైశ్వర్య స్వరూపమే.

9. అపారబహుళ ప్రమోదలహరీ
సతః కిలచితిః పరత్ర వితతా ।
పునర్వ్యయదిదం పరీత్య నిఖిలం
జగంతి దధతీ పరా విజయతే ॥

10. నయద్యపి పరాత్పరే నభసి తే
సరోజనయనా వపుః పృథగజే ।
తథాపి నమతాంమతీ రనుసర
న్స్వమేయ విభవే దధాసిచ తనూః ॥

11. సహ త్రిభువన ప్రపాలన కృతా
సమస్తమరుతాం గణస్య విభునా ।
సదా శశి ముఖి శరీర భృదజా
జగత్యదురితే శచీ విజయతే ॥

12. కులం బహు భిదం బలం నభుజయోః
కథంను విపద స్తరీమ భరతాః ।
సమర్థ మధునా విపద్వ్యధుతయే
తవాంబ చరణం వ్రజామి శరణం ॥

13. సమస్తమపిన స్వదేశ విదుషాం
విధానపటలం బభూవ విఫలం ।
అభాగ్య దమన క్షమం తదధునా
తవాంబచరణం వ్రజామిశరణం ॥

14. నిజో మమజనో నితాంతమగతి
ర్నకుక్షిభరణే ప్యయం ప్రభవతి ।
మహేశ్వరికృపా మరంద మధునా
తవాంబచరణం వ్రజామిశరణం ॥

9. అతి విపులమైన ఆనంద లహరియై పరలోకమందు సద్వస్తువు నుండి వ్యాపించిన చిత్తు తిరుగ నిఖిలమయిన యాకాశమున వ్యాపించి, జగత్తును ధరించుచున్నది. అట్టి పరాశక్తి ప్రకాశించుగాక. (4వ శ్లోకములో చెప్పబడినట్లిక్కడను గ్రహించవలెను)

10. ఓ పరాత్పరా! ఆ హేతువువలన ఆకాశముకంటె పద్మనేత్ర శరీరము (స్త్రీరూపిణి) నీకు వేఱుగాలేదు. అట్లైనను, నమస్కరించువారి బుద్ధి ననుసరించి నీవు శరీరములను దాల్చుచుంటివి.

11. ముల్లోకములను పాలించుచు, సకలమరుద్గణమునకు ప్రభువైన దేవేంద్రునితోసహ చంద్రముఖముగల్గి పుట్టుకలేనిదై, శరీరమును ధరించిన శచీదేవి పాపరహితజగత్తునందు (స్వర్గమందు) సదా ప్రకాశించుచున్నది.

12. (ఆర్య) కులము బహుభేదములను బొందియున్నది. భుజబలమూ లేదు. భారతీయులు విపత్తుల నెట్లు దాటగలరు? ఓ తల్లీ! ఇప్పుడీ విపన్నాశనముకొఱకు సమర్థమైన నీ చరణమును నేను శరణు బొందుచుంటిని.

13. స్వదేశ పండితులయొక్క విధానపటలము గూడ సమస్తము విఫలమైనది. కనుక (ఆధునికోపాయముకొఱకు) ఓ తల్లీ! దౌర్భాగ్యమును ఖండింపగల నీ చరణమును నేను శరణు పొందుచుంటిని.

14. ఓ మహేశ్వరీ! నా జనులు నితాంతదుర్గతిని బొంది, వారి కుక్షిని బోషించుకొనుటకు గూడ నసమర్థులగుచున్నారు. ఓ తల్లీ! ఇప్పుడు దయ యను మకరందముకొఱకు నీ పాదమును శరణు పొందుచుంటిని.

15. అదృష్ట కనకం కులం మమ చిరా
న్నిరాయుధమిదం నిరాశమభితః ।
స్వభావత ఇవ ప్రబుద్ధమభవ
త్తవాంబ చరణం వ్రజామిశరణం ॥

16. అవీరచరితం విపాలక కథం
నిరార్ష విభవం చిరాన్మమకులం ।
ఇదం మమమనో నికృంతతి ముహు
స్తవాంబచరణం వ్రజామిశరణం ॥

17. చిరాత్స్మృతిపథాదపి చ్యుత మజే
తపోబలభవం తమార్ష విభవం ।
స్వదేశమధునా పునర్గమయితుం
తవాంబచరణం వ్రజామిశరణం ॥

18. హతంచ విహతం ధుతంచ విధుతం
రుదంత మభితో విశిష్టకరుణే ।
ఇమం స్వవిషయం శివం గమయితుం
తవాంబచరణం వ్రజామిశరణం ॥

19. క్షయాయ సుకృత ద్విషాం విహరతాం
శివాయచ సతాం ప్రపంచ సుహృదాం ।
నిజస్యమనసో బలాయచ పరే
తవాంబచరణం వ్రజామిశరణం ॥

20. జయత్సు సుకృతం ద్విషత్సు పరితః
సతామపి కులే బలేన రహితే ।
ఖలప్రియయుగే కలౌ పరిణతే
తవాంబచరణం వ్రజామిశరణం ॥

15. బంగారమదృశ్యమైన నాయీాకులము చాలకాలమునుండి నిరాయుధమై, సర్వత్ర నిరాశజెందెను. ఓ తల్లీ ! స్వభావముచేతనే మేల్కొన్నట్లున్న బుద్ధిచే వికాశముకొఱకు నీ చరణమును శరణు బొందుచుంటిని.

16. ఓ అంబా ! వీరుల చరిత్రనశించి, పరిపాలకుల కథపోయి, ఋషివైభవము శూన్యమైయున్న నాయీాకులము చిరకాలమునుండి నా మనస్సును మాటిమాటికి వేధించుచున్నది. నీ చరణమునే శరణు బొందుచుంటిని.

17. ఓ తల్లీ ! చిరకాలమునుండి (నిజ) స్మృతి మార్గమునుండియు జారిపోయి, తపోబలమువలన గాని బుట్టనిదియునగు ఋషివైభవము నిప్పుడు తిరుగ నా స్వదేశము పొందుటకు నీ చరణమును శరణు బొందుచుంటిని.

18. ఓ కరుణామయీా ! కొట్టబడి, యణచబడి, కదల్పబడి, కల్లోలపెట్టబడి యంతటను రోదనముచేయు నా యీా స్వదేశము మంగళయుతమగుటకు నీచరణము నేను శరణుబొందుచున్నాను.

19. ఓ పరాదేవీ ! విహరించు పాపాత్ముల నాశనముకొఱకు, ప్రపంచమునకు మిత్రులయిన సత్పురుషుల మంగళముకొఱకు, స్వకీయమైన (మా) మనోబలము (మేము పొందుట) కొఱకు నీ చరణము నేను శరణు బొందుచుంటిని.

20. పాపాత్ములంతటను విజయము బొందుచుండగా, పుణ్యాత్ములు బలహీనులై యుండగా, దుర్మార్గులకు ప్రియమైన యీా కలియుగము పక్వమై యుండగా, తల్లీ ! నీ చరణమును నేను శరణు బొందుచుంటిని (కాలము మార్పుకొఱకు)

21. అభాతి సుకృతే నిగూఢ విభవే
విభాతి దురితే ఫలాని దిశతి ।
విధాన వికలే మనస్యభయదే
తవాంబచరణం వ్రజామిశరణం ॥

22. పటు ప్రతిభటే గదే ప్రతిభయే
నతావన విధావతీవ నిపుణం ।
సుపర్వ భువన క్షితీశదయితే
తవాంబ చరణం వ్రజామి శరణం ॥

23. అమర్త్యపటలీ కిరీట మణిభా
భుజంగ కిరణం నితాంతమరుణం ।
విపత్తి దమనం తమః ప్రశమనం
తవాంబ చరణం వ్రజామి శరణం ॥

24. వినష్టవిభవా మిమాం పునరపి
శ్రియావిలసితాం విధాతుమజరే ।
స్వజన్మపృథివీం స్వరీశదయితే
దిశేర్గణపతేః కరాయపటుతాం ॥

25. సుపర్వ వసుధాధి నాథసుదృశో
జలోద్ధతగతి స్తవోఽయమనఘః ।
కృతిర్గణపతేః కరోతు విధుతిం
భయస్య భరతక్షమాతల జుషాం ॥

---

21. నిగూఢవైభవముగల పుణ్యములు ప్రకాశింపకుండగా, ఫలములనిచ్చు పాపములు ప్రకాశించుచుండగా. మనస్సు వికలత్వము బొందియుండగా, తల్లీ. నీ చరణమే శరణు బొందుచుంటిని.

22. ఓ యంబా! శత్రువు సమర్థుడై యుండగా, రోగము భయంకరమై యుండగా, నమ్రులను రక్షించుటకు నిపుణురాలవైన నీ చరణమును నేను శరణు బొందుచుంటిని.

23. ఓ తల్లీ! దేవతాసమూహముల కిరీట మణికాంతులనెడి కుండలినీ కిరణములను బొందినట్టి, మిగుల మెఱుపుగానున్నట్టి, విపత్తులను తొలగించి యజ్ఞానమును నశింపజేయునట్టి నీ చరణము నాకు శరణము.

24. ఓ యీశ్వరీ! వైభవము గోల్పోయిన నా యీ జన్మభూమిని తిరుగ లక్ష్మీప్రదము గావించుకొనుటకు గణపతి హస్తమునకు పటుత్వమునిమ్ము.

25. ఇంద్రాణీదేవిపై గణపతిచే రచింపబడిన నిర్దుష్టమగు 'జలోద్ధత' గతి గల యీ స్తవము భారతదేశ జనుల భయమును బోగొట్టి వారిని రక్షించుగాక.

## 3. ప్రమితాక్షర స్తబకము

1. ఉదితం మహేంద్రమహిళా వదనే
ప్రసృతం కరైర్దిశిదిశి ప్రగుణైః ।
అహితం తమః ప్రశమయ ద్యమినాం
హసితం కరోతు మమభూరిశివం ।

2. భరతక్షితే స్తిమిర మాశుహర
త్వరిచాతురీకృత విమోహమతేః ।
రవిలక్షతో ప్యధికమంశుమతీ
పవిపాణి చిత్తదయితా వనితా ॥

3. శశిలక్షశీతలకటాక్షసుధా
తరుణార్కకోటి రుచిపాదయుగా ।
హృది మే విభాతు మునిగేయగుణా
విబుధేంద్ర చిత్తరమణీ తరుణీ ॥

4. కమనీయదీప్త సుకుమార తను
ర్నమనీయ పావనపదాంబురుహా ।
విదధాతు మే శివ మసద్విముఖీ
విబుధేంద్ర జీవితసఖీ సుముఖీ ॥

5. అనుమాన మూఢ పితృవాక్యవశా
త్తనయేన దేవి వినికృత్తశిరాః ।
తవ రేణుకా విలసితాకళయా
గణనీయశక్తి రభవద్దశసు ॥

౨

1. ఇంద్రాణియొక్క ముఖము నుదయించి, ప్రతిదిక్కున విశేష గుణముగల కాంతులతో ప్రసరించుచు, మిగుల నప్రియమగు తమస్సును ఖండించు హాసితము నాకధిక మంగళముల నిచ్చు గాక.

2. లక్షసూర్యులకంటె నధిక కాంతులుగల ఇంద్రాణి శత్రువుల చాతుర్యమునకు మోహవశమయిన భారతభూమియొక్క (మోహ) తిమిరమును తత్‌క్షణమే పరిహరించుగాక.

౪

3. లక్షచంద్రులిచ్చు శీతలసుధాకటాక్షము గలది, కోటిసూర్య ప్రభాకలితమైన పాదయుగళము గలది, మునులచే నుతింపబడు నది, ఇంద్రుని చిత్తమును రంజింపజేయునది యగు స్త్రీ (శచి) నా హృదయమందు ప్రకాశించుగాక.

4. కమనీయకాంతితో నొప్పు సుకుమార శరీరముగలది, మననము చేయదగిన పాదములుగలది, ఇంద్రుని ప్రాణసఖి, సుముఖురాలు, అసత్యపథులకు విముఖురాలు అగునట్టి దేవి నాకు మంగళములు చేయుగాక.

5. ఓ దేవీ! అనుమానించిన పితరునియొక్క మూఢవాక్యమువలన కుమారునిచే ఛేదింపబడిన శిరస్సుగల రేణుక నీ యొక్క కళచే ప్రకాశించిన దశలో గణనీయమగు శక్తి (రూపిణి) యయ్యెను. (ఇంద్రాణీ యవతారస్వరూపిణి యయ్యెను.)

6. సకలామయప్రశమనం దురిత
క్షయకారి కాంక్షితకరంచ భవేత్ ।
సురసుందరీ జనసమర్చితయో
ర్హృది రేణుకా చరణయోః కరణం ॥

7. వినిహంతి పాపపటలం స్మరణా
ద్విధునోతి రోగనివహం భజనాత్ ।
విదధాతి వాంఛితఫలం స్తవనా
న్మనుజస్య రామజననీ చరణం ॥

8. శరణం వ్రజామి నవరవ్యరుణం
చరణం తవాంబ నృపజాతిరిపోః ।
భరతక్షితే రవసతః ప్రథమం
మరణం మమేహ నభవత్వధమం ॥

9. స్మరణం చిరాదవిరతం విదధ
చ్చరణస్య తే తరుణభానురుచః ।
అయమస్తు రామజనయిత్రి పటుః
సురకార్య మార్యవినుతే చరితుం ॥

6. దేవతలచే పూజింపబడు రేణుకా చరణసేవ (లేదా ధ్యానము) సకల రోగములను శమింపజేయును, పాపములను నశింప జేయును, హృదయ కామ్యములను నెరవేర్చును.

(ఈ స్తవమునకుగల పారాయణఫలము గూడ నిట్టిదే యని తెలియునది.)

7. పరశురామ జననియైన రేణుకయొక్క పాదములను స్మరించుట వలన మనుజుల పాపపటలము నశించుచున్నది, భజించుటవలన వాంఛిత ఫలము సిద్ధించుచున్నది.

8. ప్రథమమున భారతభూమికొఱకు నమ్రుడనైన నేను (అనగా ప్రథమమున భూమియొక్క శ్రేయస్సును గోరి, దేవిని సేవించు నేను), ఓ రేణుకా, బాలసూర్యునిబోలు నీ చరణమును శరణు బొందుచుంటిని. ఇచ్చట నాకు నీచమృత్యువు గలుగకుండుగాక (దేశవిముక్తి పోరాటములో)

9. ఆర్యులకు స్తుతిపాత్రనైన రామజననీ! (బాల) మార్తాండునివలె ప్రకాశించు నీ చరణమును చిరకాలమునుండి యవిరళముగా స్మరించుచున్న యీ జనుడు దేవకార్యమును వహించి చేయు టకు సమర్థుడగుగాక.

(దేశవిముక్తి నీశ్వరకార్యముగా కవి తలచెను. దానికొఱకు నిర్మాణమైన గాంధీయోద్యమము నట్లే భావించి కొంతచేయూత నిచ్చిన స్వవిషయమును గుఱించి కవి యీ శ్లోకమందును పూర్వశ్లోకమందును స్మరించెను.)

10. అవ భారతక్షితి మమోఘ దయే
కరణం భవన్విహ త్వైవజనః ।
నిజయోః సవిత్రి చరణాంబుజయో
ర్న విహాతుమర్హసి చిరాద్భజకం ॥

11. అవిశ స్త్వమింద్రదయితే కిలతా
మపి యజ్ఞసేన తనయాం కళయా ।
అనఘవ్రతా సుకవయః ప్రథమాం
ప్రవదంతి యాం బహుళవంద్యగుణాం ॥

12. భువి భారతంపఠతి యః సుకృతీ
కలుషం ధునోతి సకలం కిల సః ।
ఇయమంబ శక్తికులరాజ్ఞి తవ
ద్రుపదస్యనందిని కథా మహిమా ॥

13. అభిమన్యుమాతర మనల్పగుణా
మతిలంఘ్య చైక్షత హరి ర్భవతీం ।
అతిసౌహృదేన యదిహార్యనుతే
తవ హేతు రీడ్యతమ శక్తికళా ॥

14. గృహకార్యతంత్ర చతురాగృహిణీ
సకలేంద్రియామృతఝరీ రమణీ ।
వరనీతిమార్గకథనే సచివా
ప్యభవస్త్వమంబ కురువంశభృతాం ॥

10. ఓ యమోఘదయావతీ ! ఈ భారతభూమిని నీవు రక్షింపుము. అందుల కీ జనుడు సాధనమగుగాక (గాంధీవలెనే వేఱొక రంగమున). నీ నిజ(పాద)పద్మమును చిరకాలమునుండి భజించు వీనిని విడచివేయకుము. (కవి తన కార్యశక్తిని నిరూపించెను.)

11. ఓ యింద్రాణీ ! పూజనీయమగు బహుగుణములుగల యెవరిని కవులు పతివ్రతలలో ప్రథమురాలని, శ్రేష్ఠురాలని చెప్పు చున్నారో, ఆ యాజ్ఞసేనియగు ద్రౌపదిని గూడ నీవు నీ కళచే ప్రవేశించితివికదా.

(రేణుకయందు శిరశ్ఛేదమైనప్పు డింద్రాణి యావేశించినట్లే ద్రౌపదియందు కేశములచే నీడ్వబడినప్పుడు శక్తియావేశించి దేవకార్యకారణము వహించెను.)

12. పుణ్యాత్ముడైన యెవడీ లోకములో భారతమును పఠించునో, వాడు సకలపాపములను నశింపజేసికొనిన వాడగును కదా ! ఓ యంబయైన ద్రౌపదీ! ఇది నీ కథయొక్క మహిమమే కదా!

13. ఆర్యులకు పూజ్యురాలవైన ద్రౌపదీ ! కృష్ణు డధిక గుణములు గల సుభద్రను మించి నిన్నధిక ప్రేమభావముతో జూచిన విషయమునకు నీయొక్క కొనియాడదగిన శక్తి కళయే కారణమై యుండును.

14. ఓ యంబా ! నీవు పాండవులకు భార్యవై గృహకార్య తంత్రము లందు చతురురాలవై, సకలేంద్రియముల కమృతఝరీవంటి రమణివై నీతిమార్గకథనమందు సచివురాలవుగూడ నైతివి.

15. న యుధిష్ఠిరస్య వరఘోరతపో
న ధనంజయస్య పటుబాహుబలం ।
అరిసంక్షయం కృతవతీ బహుళం
తవ వేణికాఽపచరితా ఫణినీ ॥

16. అసితాపి కాంతి వసతి ర్మహతీ
వనితాజనస్య చ విమోహకరీ ।
కుశలం మమాభ్రపతిశక్తికళా
మ్రపదక్షితీంద్ర దుహితా దిశతు ॥

17. శిరసా సమస్తజనపాపభరం
వహతాఽభయాయ భువియా మవృణోత్ ।
అమరాధిపః పతితపావని తాం
భువి కన్యకాం తవ వివేశ కళా ॥

18. కళయా తవాతిబలయా కలితా
పురుషస్య యోగమఖిలాంబ వినా ।
అఖిలేశ్వర ప్రహితతేజ ఇయం
సుతజన్మనే కిల దధావనఘా ॥

15. శత్రునాశనము గావించినది ధర్మరాజుయొక్క ఘోరతపస్సు కాదు, అర్జునుని పటుతర బాహుబలముకాదు. అపచార మొనర్పబడిన నీ వేణీపన్నగమే బహుళశత్రునాశముగావించెను.

16. కృష్ణవర్ణమైనను కాంతిమంతమై, మహిమగలిగి, వనితా జనమును మోహింపజేసిన ఇంద్రశక్తికళా భరితయగు ద్రౌపది నాకు కుశల మొనర్చుగాక.

17. ఓ పతిత పావనీ! సమస్త జన పాపభారమును (నుపలక్షితగా) వహించి శిరస్సంబంధమగు నే వేణియందు(కృష్ణునిదైన)ఇంద్రునిచే నభయమీయబడుటకు భూమిపై నీ వవతరించితివో, ఆ (వేణి గల) కన్యకను భూమియందు నీ కళయే ప్రవేశించెను. (ధర యనగా భూమికి, మెదడుకు గూడ నర్థమున్నందున ద్రౌపదియొక్క శిరస్సు సమస్త జన పాపభారమును వహించు భూమి కుపలక్షణము. అభయ మొసగబడిన వేణి భూమియందు పాపముచే పీడింపబడిన జనకోటిని నిరూపించును. అట్లు నిరూపించు లక్షణములను శిరస్సున వేణియందు బొంది పుట్టిన ద్రౌపది కభయ మొసగిన సమయమున నామె నింద్రాణీ కళ యావేశించి నట్లెంచవలెను. ఆ యావేశావతరణమున కుపాధి యగుటకై పుట్టిన పవిత్ర వ్యక్తి ద్రౌపది యని భావము.)

18. ఓ యఖిలాంబ! అతి బలమైన నీ కళతో గూడిన అనఘ చరిత్రురాలగు రేణుక పురుషావతరణము వేఱుగా లేకుండగనే పురుషుడైన అఖిలేశ్వరుని తేజస్సును గూడ కలిగియున్నట్లా తేజమును తన కుమారునియందు బొందగల్గెనుగదా!

19. సురరక్షకస్య మదయిత్రి దృశాం
నరరక్షకస్య జనయిత్రి పరే ।
కులరక్షణాయకృతబుద్ధిమిమం
కురు దక్ష మద్భుతపవిత్రకథే ॥

20. ముముచుః కులే మమ సుపర్వపతే
స్తవచాభిధేయ మిహ మందధియః ।
అపరాధమేత మతిఘోరతరం
జనని క్షమస్వ షమవీక్ష్యముఖం ॥

21. ఇహ శారదేతి యతిభిర్వినుతా
ప్రథితాసు రేశ్వరమనోదయితా ।
భువిభాతి కీర్తివపుషా శచి యా
సుకథాపి సా తవ సవిత్రికళా ॥

22. అరుణాచలేశ్వరదరీ వసతే
స్తపతో మునేర్గణపతేః కుశలం ।
వివిధావతార విలసచ్చరితా
వితనోతు సా విబుధరాడ్వనితా ॥

23. అరుణాచలస్య వరకందరయా
ప్రతిఘోషితం కలుషహారి యశః ।
విభుధాధినాథరమణీ శృణుయా
ద్గణనాథగీతమతిచారు నిజం ॥

19. నరులనురక్షించు నో తల్లీ, యింద్రాణీ! కులరక్షణమందు బుద్ధి గలిగియున్న వీనిని (కవిని) సమర్థునిగా జేయుము.

20. ఓ జననీ! ఈ నా కులమందున్న మందబుద్ధు లింద్రనామమును, నీ నామమును గూడ విడిచిపెట్టిరి. నా ముఖముజూచి యతి ఘోరమైన యీ యపరాధమును నీవు క్షమింపుము.

21. ఓ శచీ! 'శారద' యని యీ లోకములో యతులచే నే దేవి పొగడబడుచున్నదో, ఇంద్రుని భార్యగా ప్రసిద్ధిజెందిన యే కాంత భూమియందు ప్రకాశించుచున్నదో, శుభచరిత్రగల నామెయు నీ కళగానే యున్నది.

(అనగా శంకరాచార్య ప్రతిష్ఠితమైన 'శారద' యను విద్యారూపిణి భూమియందు ప్రకాశించు నింద్రాణీకళయని భావము)

22. వివిధావతారములందు ప్రకాశించు చరిత్రగల ఆ యింద్రాణి యరుణాచలేశ్వర గుహను వసతిగా జేసికొని తపమొనర్చు గణపతిమునికి కుశలము చేయుగాక.

23. ఓ రమణీ! అరుణాచలగుహచే ప్రతిధ్వనింపబడుచు, గణపతిచే కలుషహరణముకొఱకు రచింపబడిన యీ కథాస్తవము చాకుతరమై, నిజమై, నీ యశస్సంబంధమై, నీచే శ్రవణము చేయబడు గాక.

24. భరతక్షితేః శుభవిధాయిషు సా
విబుధక్షితీశదయితా దయయా ।
ధనశక్తిబంధుబలహీనమపి
ప్రథమంకరోతు గణనాథమునిం ॥

25. ముదితామిమా విదధతు ప్రమదాం
త్రిదివాధిపస్య నిపుణశ్రవణాం ।
అమితప్రకాశగుణశక్తినుజాం
ప్రమితాక్షరాః సుకవిభూమిపతేః ॥

---

## 4. సులలితతామరసస్తబకము

1. దిశతు శివం మమ చంద్రవలక్ష
స్తిమిరసమూహ నివారణ దక్షః ।
కృతగతిరోధక పాతక నాశః
సురధరణీశవధూ స్మితలేశః ॥

2 అవిదిత మార్గతయాతి విషణ్ణాం
గతిమపహాయ చిరాయ నిషణ్ణాం ।
భరతధరా మనిమేష ధరిత్రీ
పతి గృహిణీ పరిపాతు సవిత్రీ ॥

3. భువన మిదం భవతః కిల పూర్వం
యదమలరూపమనాకృతి సర్వం ।
ప్రకృతిరియం కురుతాద దరిద్రా
మతిమతి శాతతరాం మమ భద్రా ॥

24. ఆ యింద్రాణి ధనశక్తి బంధుబలము లన్నింట హీనుడైయున్న గణపతిమునిని కృపతోజూచి, భారతదేశ శుభము నొడగూర్చు వారిలో ప్రథమునిగా జేయుగాక.

25. సుకవిరాట్టైన గణపతియొక్క యీ 'ప్రమితాక్షర' వృత్తము లధిక కాంతి గుణ శక్తులు గలిగిన ఇంద్రాణీదేవిని సంతోషము తోడను, నేర్పుతోడను వినునట్లు చేయుగాక.

---

1. చంద్రునివలె ధవళమైనది, చీకటి సమూహములను నివారింప సమర్థమైనది, యెన్నిజన్మముల పాపములనైనను నశింపజేయు నట్టిదియైన యింద్రాణీ మందస్మితలేశము నాకు శుభము గూర్చుగాక.

2. దేవేంద్రుని రాణియైన సవిత్రి–మార్గము తెలియక విషణ్ణురాలై చిరకాలమునుండి గతిలోల్పోయి స్తంభించియున్న భారత భూమిని రక్షించుగాక.

3. ఈ భువనసృష్టికి పూర్వము నిరాకార నిర్మలమై యేది యంత టను నుండెనో, మంగళప్రదమైన ఆ ప్రకృతి నా బుద్ధిని తీక్ష్ణ మొనర్చుగాక. (అట్టి ప్రకృతినే పరదేవతయందురు)

4. సృజతి జగంతి విభో పరమే యా
సు బహుళ శక్తిరరాజత మాయా ।
ప్రదిశతు సా మమ కంచన యోగం
ఝటితి నిరాకృత మానసరోగం ॥

5. ప్రతి విషయం వికృతీ తవ సత్తా
విలసతి యా మతి మద్భిరుపాత్తా ।
ఇయమనఘా పరిపాలిత జాతిం
వితరతు మే వివిధాంచ విభూతిం ॥

6. ప్రతి విషయగ్రహణం పరిపూతా
మతిరఖిలస్య జనస్యచ మాతా !
మమ విదధాతు శుభం శుభనామా
త్రిదివ నివాసి నరేశ్వరరామా ॥

4. జగత్తును (అనగా కదలిక లేదా చలనముగలిగి యచలస్వరూపముకంటె వేఱైనదానిని) సృజించుచు విభునియందు దధికశక్తిగల యే మాయ (దీనినే కొందఱు చాలక మహిమను ధరించు ప్రాణశక్తి యందురు) రాజిల్లుచున్నదో; ఆ మాయ నా మనస్సులోని రోగములను దొలగించి, నా కనిర్వాచ్య యోగము నిచ్చుగాక.

5. ప్రతివిషయమందు బుద్ధిమంతులచే స్వీకరింపబడు వికృతిభిన్న సత్తేదికలదో, ఆ పుణ్యప్రదమైన సత్తు సర్వజాతులను పాలించుటకు సమర్థమైన నానావిధవైభవమును నా కిచ్చుగాక.

(అనగా వికృతులైన విషయరూపములనుండి నిర్విషయమైన బుద్ధి వికృతజాతుల సర్వమును వశమొనర్చుకొను వైభవము గలదియగును. కవి యట్టి బుద్ధియోగమును సాధించి కపాల భేదనముతో గూడిన యోగసిద్ధి బొందెను.)

6. ప్రతివిషయమును గ్రహించు సామర్థ్యమునిచ్చుటకై జనులందరికి (దేవమానవ పితృగణము లందరికి) తల్లివలె వారియందు బుద్ధి రూపిణియైయున్నది, శుభనామముగలది యగు నింద్రాణి నాకు శుభము గూర్చుగాక,

(శక్తి స్త్రీరూపిణిగను, ఆకాశరూపిణిగను విశ్వమందున్నట్లు పూర్వము చెప్పబడెను. వానిలో స్త్రీరూపము నిక్కడ ప్రస్తుతించి, తరువాత శ్లోకములో ఆకాశరూపమును కవి స్తుతించుచుండెను.)

7. గగనతనుర్జగతో విపులస్య
ప్రభుపదమగ్ర్యమితా సకలస్య ।
ప్రతిజన దేహమజా ప్రవహంతీ
మమహృది నందతు సా విహరంతీ ॥

8. పటుకులకుండ ధనంజయకీలా
సముదిత హార్ద విభాకర లీలా ।
ద్రుత శిర ఇందు కళామృత ధారా
జన మవతా న్నిజభక్త ముదారా ॥

9. విషయ సమాకృతి రత్ర పురస్తా
ద్వ్యమలతమా కిల తత్ర పరస్తాత్
భవవ మయీ భువనాచ్చ విభక్తా
మతిరనఘాఽవతు మామతిశక్తా ॥

7. ఆకాశశరీరిణియై ఆమె విపులముగా వ్యాపించిన సకల జగత్తుల కంటె శ్రేష్ఠమైన (జగత్తులకుమించి వ్యాపించుటచే నాకాశము శ్రేష్ఠము, జ్యేష్ఠము కూడ అగును) ప్రభుపదమును బొంది యున్నది. ప్రతిమానవ దేహమందు ప్రవహించుచు విహరించు చున్నను పుట్టుక లేకయున్న ఆ యాకాశరూపిణి నా హృదయ మందు క్రీడించుగాక.

(అనిత్యమైన వికృతచలనరూపములకంటె నిత్యచలనాత్మకమైన ఆకాశము శ్రేష్ఠము. ఇదియే సర్వప్రవాహములకు మాతృక వంటిది.)

8. సమర్థమైన కులకుండాగ్నిజ్వాలలుగలది, లెస్సగా నుదయించిన భానునివంటి హృదయప్రభావమే లీలగాగలది, శిరస్సునందు ద్రవించు చంద్రకళామృతధారలు గలదియైన ఉదారమగు దేవి తన భక్తజనమును రక్షించుగాక.

(ప్రతిమానవునియందు నాకాశరూపిణియై వ్యాపించియున్న దేవి తదాకాశముద్వారా చైతన్యమునిచ్చి యనుగ్రహించునప్పుడు మాతృలక్షణము త్రివిధములై మూలాధార, హృదయ మస్తక స్థలములం దెట్లుండునో వచింపబడెను.)

9. ఇక్కడ ముందున (సృష్టియందు, లేదా శరీరక్రియలందు) విషయాకృతిగాను అక్కడ వెనుకను (ఆకాశమున నుండు నిర్గుణ పరాస్థితియందు) మిగుల నిర్మలముగాను నుండి (ఇది దివ్య స్త్రీరూపచైతన్యము), విశ్వమును గృహముగా బొందినను భువనములకంటె వేఱుగా నిర్దోషమై యతి శక్తివంతమైయుండు (బుద్ధిసంబంధమగు) రూపము నన్ను రక్షించుగాక.

10. విషయ పరిగ్రహణేష్వతి సక్తా
విషయ విధూతిషు కాపి వివిక్తా ।
అఖిలపతేర్మయి దీవ్యతు శక్తి
ర్విమలతమా విధుతేతర సక్తిః ॥

11. దృశిదృశి భాతి యదీయమపాపం
దిశిదిశి గన్తృచ వేత్తృచ రూపం ।
భవతు శివాయ మమేయ మనింద్యా
భువనపతేర్గృహిణీ మునివంద్యా ॥

12. జడకులకుండదరీషు శయానా
బుధకులవహ్నిషు భూరి విభానా ।
హరిహయశక్తి రమేయ చరిత్రా
మమ కుశలం విదధాతు పవిత్రా ॥

13. దహరగతాఖిల మాకలయంతీ
ద్విదళగతా సకలం వినయంతీ ।
దశశతపత్రగతా మదయంతీ
భవతు మయీంద్రవధూ ర్విలసంతీ ॥

10. విషయపరిగ్రహణమందు మిగుల ఆసక్తికలది, విషయములను వీడుటలో ననిర్వాచ్యమైన పవిత్రతకలది, మిక్కిలి నిర్మలమైనది, యితరాపేక్షలు లేనిదియగు నఖిలలోకాధిపశక్తి నాయందు ప్రకాశించుగాక.

11. ప్రతి దృక్కునందెవతె నిర్దోషరూపముచే (దృశ్యమును విడచిన దృష్టిరూపము) ప్రకాశించుచునదో, ప్రతిదిక్కున నెవతె (బుద్ధి) రూపముగా వ్యాపించి తెలిసికొనుచున్నదో, అట్టి యనింద్య మైనది, మునివంద్యమైనది యగు నింద్రభార్య నాకు మంగళము జేయుగాక.

12. జడుల కులకుండమందు శయనించునది (అనగా తిరోధాన మైనది), పండితజనులందు - నిర్మలబుద్ధితో గూడి-కులకుండాగ్ని యందు విశేషముగా ప్రకాశించునది (చిదగ్నిరూపము నుద్గార మొనర్చు బుద్ధి జ్యోతియగునది), పవిత్రచరిత్ర గలదియైన యింద్రాణి నాకు కుశలమిచ్చుగాక.

(అజ్ఞానులలో నిద్రించునదియు, విజ్ఞానులలో మేల్కొనునదియు నని భావము.)

13. దహరగుహాయందుండి సకలమును బోషించుచున్నది, ఆజ్ఞా చక్రగతమై సకలమును శిక్షించుచున్నది (అనగా శాసించునది) సహస్రారగతమై యమృత మదముగలిగించునది (అనగా నిర్వి షయ నిరతిశయానందము నిచ్చునది) యైన యింద్రాణి నా యందు విలసించుగాక.

(అనగా మూడు ప్రకారములగు విలాసములను జూపుగాక).

14. గృహయుగళీ శ్రియ ఆశ్రితగమ్యా
పదకమల ద్వితయీ బహురమ్యా ।
మమహృది భా త్వవికుంఠితయానా
హరి సదృశ స్తరుణారుణ భానా ॥

15. ఉపరి తతా కులకుండ నిశాంతా
జ్వలిత ధనంజయ దీధితి కాంతా ।
హరిహయ శక్తిరియం మమ పుష్టా
ద్రవయతు మస్తకచంద్ర మదుష్టా ॥

16. నభసి విరాజతి యా పరశక్తి
ర్మమ హృది రాజతి యా వరశక్తిః ।
ఉభయ మిదం మిళితం బహువీర్యం
భవతు సుఖం మమ సాధితకార్యం ॥

17. త్రిభువనభూమిపతేః ప్రియయోషా
త్రిమలహారీ సురవిష్టప భూషా ।
మమ వితనోతు మనోరథపోషం
దురిత విపత్తి తతేరపి శోషం ॥

18. పవన జగత్ప్రభు మోహనమూర్తి
ర్జలధర చాలన విశ్రుతకీర్తిః ।
మమ కుశలాయ భవ త్వరిభీమా
జనసవతాం జననీ బహుధామా ॥

14. లక్ష్మి నివసించుటకు రెండు గృహములవలెనుండి, యాశ్రిత భక్తజనులు చేరదగినవై, బహురమ్యమై, యడ్డులేని గమనము గలిగి, బాలసూర్యప్రకాశమానమై యొప్పు ఇంద్రాణీ పదకమల ద్వయము నా హృదయమందు ప్రకాశించుగాక.

15. శరీరముయొక్క మీది (స్థూల) భాగమందు వ్యాపించి, కుండలినీ గృహముగాగలది, జ్వలించు నగ్ని కాంతులచే మనోహరమై యున్నది; పుష్టిగలది, పవిత్రమైనది యగు నీ యింద్రాణి నా శిరఃకమల చంద్రుని ప్రకాశింపజేయుగాక.

16. ఏ పరాశక్తి గగనమందు రాజిల్లుచున్నదో, ఏది నా హృదయ మందు ప్రకాశించుచున్నదో, బహువీర్యవంతమైన ఆ రెండు శక్తులు నా హృదయమున మిళితమై (బాహ్యాంతర భేదములేక దేవతలందువలె) నా కార్యసాధన జేయుచు నాకు సుఖము నిచ్చుగాక.

(అహంకార మమకారములను దొలగించవలెనని భావము.)

17. మనోవాక్కాయ కర్మలు మూడింటిని హరించు నింద్రాణి (అన్నమయ, మనోమయకోశములను బాలించునది యను భావముగూడ కలదు), నా మనోరథమును బోషించి నెరవేర్చు గాక, నా పాపఫలమును నశింపజేయుగాక.

18. మేఘములను చలింపజేయుటవలన ప్రసిద్ధకీర్తినొందినది, విస్తార తేజస్సుగలది, జన్మగలవారికి జనని యగునది, యింద్రుని మోహింపజేయునట్టిదియైన మూర్తి నాకు కుశలము జేయుగాక.

19. మమ సురరాజవధూ కళయోగ్రా
ఖలజన ధూనన శక్త నఖాగ్రా ।
దమయతు కృత్తశిరాః కలుషాణి
ప్రకటబలా హృదయస్య విషాణి ॥

20. కులిశివధూకళయా పరిపుష్టా
బుధనుత సద్గుణజాల విశిష్టా ।
మమ పరితో విలసద్విభవాని
ద్రుపదసుతా విదధాతు శివాని ॥

21. సురజనరాడ్దయితాంశ విదీప్తే
పదకమలాశ్రిత సాధుజనాప్తే ।
దురితవశాదభితో గతభాసం
మనుజకుమారజనన్యవ దాసం ॥

22. అమరనరేశ్వర మందిరనేత్రీ
సుమశరజీవన సుందరగాత్రీ ।
భవతు శచీ వితత స్వయశస్సు
ప్రతిఫలితా గణనాథ వచస్సు ॥

23. వికసతు మే హృదయం జలజాతం
విలసతు తత్ర శచీస్తుతిగీతం ।
స్ఫురతు సమస్తమిహేప్సిత వస్తు
ప్రథితతమం మమ పాటవమస్తు ॥

19. ఇంద్రాణియొక్క కళను బొంది (ఉగ్రకళ, శాంతకళ యని శక్తి రెండు విధములుగా నుండును. ఈ శ్లోకమం దుగ్ర కళను స్తుతించి, తరువాత శాంత కళను కవి పేర్కొనును.) యుగ్రమైనది, దుష్ట జనులను నాశన మొనర్చు పటుత్వము గల గోళ్లకొనలు గలది, అతి బలమైనది, కృత్తశిరస్సు గలదియైన ప్రచండచండి నా హృదయమందుగల విషతుల్య పాపములను సంహరించుగాక.

20. ఇంద్రాణీకళతో గూడినది, పండితులచే పొగడబడు సద్గుణములు గలది యగు ద్రౌపది నా కంతిటను వైభవముతో గూడిన మంగళములను సమకూర్చుగాక.

21. ఓ మనుజకుమార జనని! పాపవశమువలన సంతటను నిస్తేజుడనై దాసుడనగు నన్ను రక్షింపుము.

22. ఇంద్రుని మందిరమునకు నాయకురాలై, మన్మథుని బోషించు సుందర శరీరముగల శచీదేవి యొక్క కీర్తిగానముచే వ్యాపించిన గణపతి వాక్కునందామె ప్రతిఫలించుగావుత.

23. నా హృదయమను పద్మము వికసించుగాక (ఈ స్తుతిగీతము వలన), అందు శచీదేవి సంబంధమైన యీ గీతమామెకు విలాసము నిచ్చుగాక, సర్వేష్టార్థములు నిహమందు (తత్ఫలముగా) వ్యక్తమగుటకు స్ఫురించుగాక, (ఆ యిష్టార్థప్రాప్తిచే) నా సామర్థ్య మధికమగుగాక.

24. కురు కరుణారససిక్త నిరీక్షే
వచనపథాతిగ సద్గుణలక్షే ।
శచి నరసింహజ మాహితగీతం
భరతధరా మవితుం పటుమేతం ॥

25. సులలిత తామరసైః ప్రసమాప్తం
వరనుతిబంధమిమం శ్రవణాప్తమ్ ।
జనని నిశమ్య సుబద్ధ మశేషం
హరిలలనే మమ కుర్వభిలాషమ్ ॥

---

సప్తమం జాగతం శతకమ్ సంపూర్ణమ్.

24. ఓ కరుణామయీ! వర్ణనాతీతములైన లక్షలకొలంది గుణములు కలదానా! భారతదేశ రక్షణార్థ మీగీతములను రచించిన నరసింహాసుతుడైన గణపతిని సమర్థుని గావింపుము.

25. ఓ తల్లీ! 'సులలితతామరస' వృత్తములచే సమాప్తము గావింపబడి, చెవులకింపగునట్లు నిబద్ధమైన యీ వరనుతిబంధమును నీవు పూర్తిగావిని నా యభిలాషను నెరవేర్పుము.

ఇట్లు,
శ్రీ భగవన్మహర్షి రమణాంతేవాసియు,
నరసింహపుత్రుడును, కావ్యకంఠ బిరు
దాంకితుడును, వాసిష్ఠగోత్రనామకుడును
అగు గణపతిమునిచే విరచితమైన
ఇంద్రాణీ సప్తశతి సమాప్తము.
ఓం ఇంద్రాణ్యర్పణమస్తు.

---

జయంతి ప్రింటర్సు, కాకినాడ.

## మా యొద్ద లభించు గ్రంథములు

నాయన (కావ్యకంఠ శ్రీ వాసిష్ఠ గణపతిముని సంపూర్ణ జీవిత చరిత్రము - తెలుగున - 800 పేజీలు.
రచయిత :- శ్రీ గుంటూరు లక్ష్మీకాంతము) 10-00

### పత్రికాభిప్రాయములు

గణపతిముని జననం మొదలు (17-11-1878) వారు కీర్తిశేషు లగు వరకూ (25-7-1936) విస్తృతమైన వారి సమగ్ర జీవితకథనమే 'నాయన' అనే గ్రథం.

ఈ సమగ్ర కథనంలో అబ్బురపాటు కల్గించునవీ, ఔరా అనిపించునవీ, అయ్యో అనిపించునవీ, ఆనందబాష్పములను రాల్పించునవీ, ఆవేదనతో కనుల చెమటింపజేయునవీ — అనేక సంఘటనలు కానవస్తాయి. —(ఆంధ్ర ప్రభ)

ఒక ఆంధ్ర మహాపురుషుని జీవిత చరిత్ర తెలుగులో ఇంతవరకూ ఈ విధంగా వెలువడలేదు. —(ఆంధ్ర పత్రిక)

అనేక విచిత్రగాథలతో కూడిన ఈ మహనీయుని జీవిత చరిత్ర నవలకంటె ఆకర్షణీయంగా చదివిస్తున్నది. ఇది యీ సంవత్సరం వచ్చిన జీవిత చరిత్రలలో తలమానికమైనది. —(స్వతంత్ర)

It is a big work of 783 pages, replete with thrilling episodes. Written in simple and faultless style, it is a valuable contribution to Telugu literature. —(The Weekly Mail)


[P. T. O.

## (శ్రీ గణపతిముని రచనలు- తెలుగు తాత్పర్యములతో)

1.(ఎ) మహావిద్యాది సూత్రగ్రంథావళి (దశమహావిద్యలకు, గాయత్రీ — యోగాది యితర తత్త్వములకు, రాజయోగ సారమునకు వ్యాఖ్యలు) ... 1-50

(బి) మహావిద్యాది సూత్రగ్రంథావళి (నాగరి లిపిలో మూలము మాత్రమే) ... ... 0-50

2. ఖండకావ్యద్వయము (పాండవ ధార్తరాష్ట్ర సంభవము, సుకన్యాదస్ర సంవాదము) ... 0-25

3. సదాచార బోధిని ... ... 0-25

4. తత్త్వఘంటా శతకము (ద్వాదశాదిత్య, ఏకాదశ రుద్ర, అష్టవసువుల సమష్టి వ్యష్టి సామరస్యము) 0-50

5. గీతమాల (వైదిక దేవతాస్తుతి గీతములు) ... 1-50

6. విశ్వమీమాంస (విశ్వసృష్టి, జీవసృష్టి, వివిధ అధిష్ఠాన దేవతా తత్త్వములు, అవతారములు వచ్చు విధము, ఉపనిషద్విద్యలు మొదలగు 50 విషయములున్నవి.) 3-00

7. ఇంద్ర సహస్రనామ స్తోత్రము (ఋఙ్మంత్రములనుండి యేరిన నామములైనందున ఇవి మంత్రతుల్యములు) 0-50

8. భారతచరిత్ర పరీక్ష (ఈ చరిత్ర వేదయుగ మధ్యకాలములో సంభవించెననియు, భారతవీరులు ఋషులవలె మంత్రద్రష్టలనియు ఋగ్వేదమునుండి ప్రమాణములతో రుజువొనర్చి, వ్రాసిన మహత్తర విమర్శగ్రంథము) 6-00

9. స్తోత్రచతుష్కము ... ... 1-00
(ప్రచండచండీ, ఉమా, శివ, దేవీ స్తోత్రములు.)

(పోస్టు ఖర్చులు ప్రత్యేకము)

# తప్పొప్పులు

## శ్లోకములలోనివి

| శ. స్త. శ్లో. | తప్పు. | ఒప్పు. |
| --- | --- | --- |
| 1-1-18 | తమ | తను |
| 1-3-16 | శబా | శబ్దా |
| 3-3- 6 | భజిష్యః | భుజిష్యః |
| 3-4-13 | ధర్మేపరీ | ధర్మేపరి |
| 4-2-13 | విభవ మహాంతం | విభవమపి మహాంతం |
| 4-4- 7 | మాంతర్భవతీ | మాతర్భవతీ |
| 5-1-19 | తావాంబ | తవాంబ |
| 5-3- 4 | బాహు | బహు |
| ,, | నమః | నః |
| 6-1-10 | స్త్వదభాణి | స్తదభాణి |
| 6-3-23 | వోమ్ని | వ్యోమ్ని |
| 7-3-13 | అతిలంఘ్యా | అతిలంఘ్య |
| 7-4- 7 | విపులప్య | విపులస్య |
| 7-4- 9 | భవవ | భవన |
| 41 పేజీ | స్త. 2 | స్త. 1 |
| 94 ,, | శ. 4 | శ. 3 |
| 98 ,, | ఆనుష్ఠుభం శతకం | అనుష్టుభం శతకం |
| 199 ,, | స్త. 1 | స్త. 2 |

# తాత్పర్యముల లోనివి

| శ. స్త. శ్లో. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|
| 1-1-16 | అకాశ | ఆకాశ |
| 1-2-3 | సృష్ణి | సృష్టి |
| 1-2-8 | యెక్క | యొక్క |
| 2-1-19 | మదు | మందు |
| 2-2-9 | స్థితి | సిద్ధి |
| 3-1-19 | కర్పించ | కల్పించ |
| 3-4-10 | నిరూపమాన | నిరుపమాన |
| 3-4-14 | ఋతు | ఋత |
| 4-2-6 | ముఖవిలాస | ముఖవికాస |
| 4-2-12 | ధాపించు | భాసించు |
| 4-4-9 | దనగి | దణగి |
| 4-4-16 | ప్రత్యేకముకా | ప్రత్యేకముగా |
| 4-4-17 | వినువు | వినుము |
| 5-4-7 | పాపములను హరించుదానవు | పాపములను శమింపజేయుదానవు |
| 6-1-23 | వేధాఋసత్య | వేధాఋతస్య |
| 6-2-8 | పక్ష | పక్ష్మ |
| 6-3-5 | భుజించునో | భజించునో |
| 7-3-7 | భజించుటవలన వాంఛిత | భజించుటవలన రోగపటలము హరించుచున్నది, స్తుతించుటవలన వాంఛిత |
| 7-3-10 | కార్యశక్తి | కార్యాసక్తి |
| 7-3-17 | వహించి | వహించిన |
| .. | కృష్ణునిదైన | కృష్ణుడైన |
| 7-4-17 | అన్నమయ మనోమయ | అన్నమయ ప్రాణమయ మనోమయ |
| 7-4-18 | ప్రసిద్ధ కీర్తినొందినది | ప్రసిద్ధ కీర్తినొందినది, శత్రువులకు భయంకరమైనది |